బుధవారం
23•10•2019
కరీంనగర్
• వెల. రూ. 6.50
• సంపుటి 9 • సంచిక 118
• పేజీలు : 14 + 16 + 8 పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD







# మున్సిపోల్స్‌కు పచ్చజెండా



## 131 కార్పొరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికలకు మార్గం సుగమం

జాబితాల్లో తప్పులను పిటిషనర్లు నిరూపించలేదు • ఎన్నికల ప్రక్రియపై దాఖలైన పిటిషన్లను కొట్టివేసిన హైకోర్టు

ప్రీ ఎలక్షన్ ప్రాసెస్‌కు కనిష్ఠ సమయం లేదని స్పష్టీకరణ • ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకోలేమని వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రంలోని 131 మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఎన్నికలు నిర్వహించేందుకు మార్గం సుగమమైంది. ఎన్నికలకు ముందు ఆయా మున్సిపాలిటీల్లో చేపట్టాల్సిన ప్రీ ఎలక్షన్ ప్రాసెస్ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నదని, ఎన్నికల ప్రక్రియకు సింగిల్ జడ్జి ధర్మాసనం వద్ద మూడునెలలకు పైగా సమయం తీసుకుని ఎనిమిది రోజుల్లో ప్రక్రియను ముగించారని పేర్కొంటూ దాఖలైన రెండు వేర్వేరు ప్రజాప్రయోజన వ్యాజ్యాలను చీఫ్ జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ అభిషేక్‌రెడ్డి నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం కొట్టేసింది. ఈ కేసులో ఈ నెల 1న తీర్పును రిజర్వు చేసిన ధర్మాసనం.. మంగళవారం తుది ఉత్తర్వులను వెలువరించింది. మిగిలిన ఎన్నికల ప్రక్రియను చేపట్టవచ్చని తీర్పు రిజర్వు చేస్తున్న సందర్భంగానే ధర్మాసనం స్పష్టంచేసింది. సింగిల్ జడ్జి వద్ద తీసుకున్న 119 రోజులు గరిష్ఠ సమయమని, కనిష్ఠంగా ఎన్ని రోజుల్లో వార్డుల విభజన, ఇతర ప్రక్రియలు చేపట్టాలనే విషయం సింగిల్ జడ్జి ఆదేశాల్లో లేదని తాజా తీర్పులో పేర్కొన్నది. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వం సాధ్యమైనంత త్వరగా ఎన్నికల ప్రక్రియను చేపట్టిందని అదనపు అడ్వకేట్ జనరల్ జే రామచంద్రరావు చేసిన వాదనలను ధర్మాసనం సమర్థించింది. మరోవైపు రాజ్యాంగంలోని ఆర్టికల్ 243 జెడ్ (జీ) ప్రకారం ఎన్నికల విషయాల్లో కోర్టుల జోక్యంపై నిషేధం ఉన్న విషయాన్ని ధర్మాసనం గుర్తుచేసింది. కేవలం ఎన్నికల పిటిషన్లు తప్ప మున్సిపల్ ఎన్నికలకు సంబంధించిన ముందస్తు ఎన్నికల ప్రక్రియ అంశాలను కోర్టుల్లో సవాల్‌చేయజాలరని రాజ్యాంగంలో స్పష్టంగా ఉన్నదని గుర్తుచేసింది. ఓటర్ల జాబితాల విషయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపులో తప్పులు జరిగినట్లు పిటిషనర్లు ఎక్కడా నిరూపించలేకపోయారని ధర్మాసనం తెలిపింది. ఇవి నిరాధార ఆరోపణలేనని స్పష్టంచేసింది. తమను తప్పుడు క్యాటగిరీలో

మిగతా 2వ పేజీలో

## మళ్లీ ఎన్నికల సందడి

మున్సిపల్ ఓట్లపై తుది నిర్ణయం తీసుకోనున్న సర్కార్

తీర్పుకాపీ వచ్చాక చర్యలు: ఎస్ఈసీ

2

### పట్టణ బీసీ ఓటర్లు 61.12 లక్షలు

20 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తికి అధికారుల కసరత్తు

# ఆర్టీసీపై కమిటీ

## విలీనం తప్ప 21 అంశాలను పరిశీలించాలి • సీఎం కేసీఆర్ ఆదేశం

- తక్షణం వెయ్యి అద్దెబస్సులకు నోటిఫికేషన్
- ఆర్టీసీ సంఘాల ప్రోద్బలంతోనే సమ్మె
- చట్టవ్యతిరేక సమ్మెకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మద్దతు అనైతికం
- కాంగ్రెస్ హయాంలోనే మధ్యప్రదేశ్‌లో ఆర్టీసీ మూసివేత
- మోదీ చట్టానికి వ్యతిరేకంగా రాష్ట్ర బీజేపీ నేతల వ్యవహారం
- తెలంగాణలో చేస్తున్న డిమాండ్లు కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలుచేస్తున్నారా?
- ఆర్టీసీ సమ్మె, ప్రత్యామ్నాయ చర్యలపై సుదీర్ఘ సమీక్షలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు
- స్థానిక బీజేపీ నేతల తీరుపై ప్రధానికి, కేంద్ర రవాణామంత్రికి లేఖ రాయటంపై చర్చ

### అధ్యయనం కోసం ఆరుగురు ఈడీలతో కమిటీ

### కమిటీ సూచనల ఆధారంగా హైకోర్టుకు నివేదిక



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్‌ను కార్మికసంఘాలు తమంతటతామే వదులుకున్న నేపథ్యంలో ఇతర డిమాండ్లను పరిశీలించాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. డిమాండ్లను పరిశీలించడానికి ఆర్టీసీ ఈడీలతో ఆర్టీసీ ఎండీ ఒక కమిటీని నియమించారు. కమిటీ సూచనల ఆధారంగా హైకోర్టుకు నివేదిక సమర్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆర్టీసీ సమ్మెపై హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మంగళవారం ప్రగతిభవన్‌లో మంత్రి, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తున్నట్లు ప్రకటిస్తేనే చర్చలు జరుపుతామని కార్మికసంఘాల నాయకులు మొదట ప్రకటించారు. అదే తమ ప్రథమ అవసరమని కూడా చెప్పారు. కానీ హైకోర్టులో విచారణ

మిగతా 2వ పేజీలో

## ప్రగతిచక్రం పరుగు

ఫలించిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు
రవాణా, పోలీసు, రెవెన్యూ, ఆర్టీసీ సమన్వయం
సీఎం కేసీఆర్ ఆదేశాలతో యంత్రాంగం అప్రమత్తం

2



మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న నోబెల్ విజేత అభిజిత్ బెనర్జీ

## మోదీ మిమ్మల్ని గమనిస్తున్నారు

మీడియాతో అభిజిత్ బెనర్జీ

భారత్‌కు క్షేత్రస్థాయి అధికారులు అవసరమని వ్యాఖ్య

ప్రధానితో సమావేశమైన నోబెల్ విజేత

5

**మీడియా** నన్ను మోదీకి వ్యతిరేకంగా మాట్లాడేలా ఎలా వలలో వేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నదో ప్రధాని నాతో చెప్పారు. ఆయన టీవీ చూస్తారు. మీ అందరినీ గమనిస్తున్నారు. మీరు ఏం చేయడానికి ప్రయత్నిస్తున్నారో కూడా ఆయనకు తెలుసు..

భారతదేశం ఎంతో ప్రత్యేకమైనది. ఇక్కడ చాలా మంది విధానాల గురించి చెప్తారు తప్ప, వాటి వెనుకనున్న ఆలోచనల గురించి మాట్లాడరు.

– విలేకరులతో అభిజిత్ బెనర్జీ

# పుప్పాలగూడ విజయం

## ఆ 148 ఎకరాలు ప్రభుత్వానివే • పుప్పాలగూడ భూములపై సుప్రీంకోర్టు తీర్పు • ముగిసిన కాందిశీకుల నాటకం

దశాబ్దాల నాటి అక్రమాలకు తెర • ఎప్పటికప్పుడు కేసుపై సీఎం కేసీఆర్ సమీక్ష

రెవెన్యూ, హెచ్‌ఎండీఏ, టీఎస్ఐఐసీ అధికారుల కృషి

ప్రభుత్వ స్వాధీనంలోనే భూమి • హైటెక్ సిటీ, ఐటీ కంపెనీలకు చేరువలో..

మార్కెట్ ధర ఐదు వేల కోట్లపైనే



రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడలోని వివాదాస్పద భూములు

**హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడలోని వివాదాస్పద భూములన్నీ ప్రభుత్వానివేనని సుప్రీంకోర్టు సోమవారం ఇచ్చిన తీర్పుతో ఈ భూములపై దశాబ్దాలుగా సాగిన అక్రమాలకు తెరపడింది. దాదాపు ఐదువేల కోట్ల రూపాయలకుపైగా విలువచేసే 148.30 ఎకరాల భూమి ప్రభుత్వపరమైంది. ఉమ్మడి రాష్ట్రంలో సాగిన అక్రమాల చిట్టాను.. తెలంగాణ ఏర్పడిన తర్వాత.. ప్రభుత్వం దుమ్ముదులిపింది. అంగుళం భూమి కూడా అక్రమార్కుల పాలుకావద్దన్న గట్టి నిర్ణయంతో ఉన్న సీఎం కేసీఆర్.. అక్రమాలను ఒక్కొక్కటిగా వెలుగులోకి తీసుకువస్తూ చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో అప్పటి దాకా కబ్జాల్లో ఉన్న భూమి.. ప్రభుత్వ స్వాధీనం అవుతున్నది. ఈ క్రమంలోనే పుప్పాలగూడ భూమి కేసులో సీఎం ఎప్పటికప్పుడు సమీక్షించడం, దానికి రెవెన్యూ, హెచ్‌ఎండీఏ, టీఎస్ఐఐసీ అధికారులు కృషి తోడుకావటంతో అత్యంత ఖరీదైన భూమి ప్రభుత్వానికి దక్కింది.

**ఐటీ కంపెనీలకు చేరువలో..**

పుప్పాలగూడ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 301 నుంచి 308 వరకు, 324 నుంచి 331 వరకు 148.30 ఎకరాల భూములున్నాయి. అవన్నీ హైటెక్‌సిటీ, సైబర్ గేట్‌వే, పలు ఐటీ కంపెనీలకు అత్యంత సమీపంలో ఉన్నవే. వీటి ధర బహిరంగ మార్కెట్లో ఎకరా రూ.20 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు పలికే అవకాశం ఉన్నది. అంటే ప్రస్తుతం ప్రభుత్వం రూ.5 వేల కోట్లకు పైగా విలువ కలిగిన భూములపై విజయం సాధించిందన్న మాటే! అప్పనంగా, అక్రమంగా కేటాయించిన భూములపై సీరియస్‌గా దృష్టిసారించిన సీఎం కేసీఆర్.. పుప్పాలగూడ భూములపై హక్కులు సాధించాలని

మిగతా 3వ పేజీలో



## భారత్ జయభేరి

దక్షిణాఫ్రికాపై భారీ విజయం

సిరీస్ 3-0తో క్లీన్‌స్వీప్

సఫారీలు తొలిసారి వైట్‌వాష్

వివరాలు ఆటలో

# పెన్షనర్లకు యాప్

## రిటైర్డ్ ఉద్యోగులకు శుభవార్త

ఉన్నచోటుకే పింఛన్ • 'టీ యాప్ ఫోలియో'లో ఫొటో పంపితే చాలు

స్వయంగా లైఫ్ సర్టిఫికెట్ ఇవ్వాల్సిన పనిలేదు • పక్కాగా యాప్ రూపొందించిన టీఎస్‌టీఎస్

దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ప్రయోగం • రాష్ట్రవ్యాప్తంగా వచ్చేనెల నుంచి అమలు

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**



పదవీవిరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త. పింఛన్ పొందేందుకు కార్యాలయాల చుట్టూ తిరుగాల్సిన అవసరం లేదు! ప్రతిసారి యాన్యువల్ లైఫ్ సర్టిఫికెట్, వేలిముద్రలు ఇచ్చే బాధ ఇకపై తప్పునున్నది! ఉన్నచోటినుంచే మొబైల్‌యాప్ ద్వారా ఫొటో దిగి సంబంధితశాఖకు పంపితే, ఖాతాలో ఫింఛన్ జమ కానున్నది. దీనికోసం 'టీ-యాప్ ఫోలియో'ను గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని 'ఫేస్ రికగ్నిషన్ ఫర్ లైఫ్ సర్టిఫికేషన్' టూల్ ద్వారా ఫొటో పంపించాలి. దేశంలోనే తొలిసారి తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ (టీఎస్‌టీఎస్)పకడ్బందీగా ఈ యాప్‌ను రూపొందించింది. ఈ విధానాన్ని వచ్చేనెల నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలుచేయనున్నట్టు ట్రెజరీస్, అకౌంట్స్ డైరెక్టర్ శ్రీరామచంద్ర మూర్తి తెలిపారు. యాప్‌ను రిటైర్డ్ ఉద్యోగులు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

**ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం**

వాస్తవానికి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు పెన్షన్ పొందాలంటే నిబంధనల ప్రకారం ఏటా బతికే ఉన్నట్టు నిరూపించుకోవడానికి లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి. పదవీ విరమణ ఎక్కడైతే చేశారో, ఆ ప్రాంతంలోని పెన్షన్ కార్యాలయానికి వెళ్లి బ్యాంక్ ఖాతా, వేలి ముద్రలు కూడా ఇవ్వాలి. వయస్సుమీరినవారిలో వేలిముద్రలు చెదిరిపోయి, గతం వేలిముద్రలతో సరిపోలక పెన్షన్ పొందడం కష్టమవుతున్నది. ఈ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారంగా తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ (టీఎస్‌టీఎస్) ఫేస్ రికగ్నిషన్(ముఖ గుర్తింపు)సాఫ్ట్‌వేర్‌ను తయారుచేసింది. దీన్ని ఇప్పటికే రూపొందించిన టీ యాప్ ఫోలియోకు జతచేశారు. బయోమెట్రిక్ ఐడీ ఆథెంటికేషన్, ఫేషియల్, డెమోగ్రాఫిక్ ఆథెంటికేషన్, డీప్ లెర్నింగ్ ఫొటో మెషిన్ ద్వారా లోపాలకు ఆస్కారం లేకుండా ఆధునిక సాంకేతికతతో రూపొందించారు. పెన్షనర్లు యాప్‌లో ఐడీ నంబర్‌ను నిక్షిప్తం చేయడంతోపాటు ఫొటోను దిగి ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌కు పంపాలి. ఈ ఫొటో అసలైన వ్యక్తిదా? కాదా? అనేది తెలుసుకొనేందుకు గతంలో ఇచ్చిన ఫొటోతో పోల్చిచూస్తారు. మూడు దశల్లో జరిగే ఈ ప్రక్రియ వల్ల అనర్హులు పెన్షన్ పొందే ఆస్కారమే లేదని ఈ-గవర్నెన్స్, మీ-సేవ కమిషనర్ జీటీ వెంకటేశ్వర్‌రావు వెల్లడించారు. స్మార్ట్‌ఫోన్‌తో పెన్షనర్లు ఈ సులభమైన విధానాన్ని ఉపయోగించుకోవచ్చని తెలిపారు.



మంగళవారం గోదావరిలో ఒడ్డుకు చేర్చిన రాయల్ వశిష్ఠ బోటు

# గోదావరిలో బోటు వెలికితీత

## 38 రోజుల తర్వాత ఒడ్డుకు..

ఫలించిన ధర్మాడి సత్యం బృందం ప్రయత్నం

పడవలో ఎనిమిది మృతదేహాలు లభ్యం

కుళ్లిపోయి, ఎముకలు తేలి దుర్వాసన

డీఎన్‌ఏ పరీక్షలు చేశాక అప్పగిస్తామంటున్న అధికారులు

లభించని మరో నలుగురి ఆచూకీ

47కు చేరిన మృతుల సంఖ్య

3




| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 77.00 | రిటైల్ లైవ్ | 99.00 |
| డ్రెస్డ్ | 144.00 | స్కిన్‌లెస్ | 163.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 377.00 | రంగారెడ్డి | 377.00 |
| మెదక్ | 377.00 | కరీంనగర్ | 380.00 |
| వరంగల్ | 380.00 | చిల్లర ధర | 4.35 |



జాతీయస్థాయిలో ఉత్తమ ఎమ్మెల్యేగా ఎంపికైన పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని మంగళవారం ప్రగతిభవన్‌లో అభినందిస్తున్న ముఖ్యమంత్రి కేచంద్రశేఖర్‌రావు

## అభివృద్ధి పనులకు రూ.31.93 కోట్లు విడుదల

■ ఉత్తర్వులు జారీచేసిన ప్రణాళికాశాఖ

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** రాష్ట్రంలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం ప్రత్యేక అభివృద్ధినిధి నుంచి రూ.31.938 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రణాళికాశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి నియోజకవర్గంలో 178 పనులకు రూ.7.82 కోట్లు, మధిర నియోజకవర్గంలో 131 పనులకు రూ.4.02 కోట్లు, మెదక్ జిల్లా హవేలీఘన్‌పూర్ మండలంలోని కూచనపల్లి నుంచి మైసమ్మ టెంపుల్ మీదుగా మక్దూంపూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.3.4 కోట్లు, మంచిర్యాల నియోజకవర్గంలో16 పనులకు రూ.53.87 లక్షలు, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గంలో ఏడు అభివృద్ధి పనులకు రూ.7.32 కోట్లు, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గంలో రోడ్డు పనులకు రూ. 3.85 కోట్లు, అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో రుయ్యాడి, కజ్జర్ల గ్రామాలకు రోడ్డు నిర్మాణం కోసం రూ.1.08 కోట్లు, నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలో 82 అభివృద్ధి పనులకు రూ.3.91 కోట్లను వేర్వేరు జీవోల ద్వారా ప్రభుత్వం విడుదల చేసింది.

## టాప్-10 వర్సిటీల్లో హెచ్‌సీయూ

■ క్యూఎస్ ఇండియా-2020 ర్యాంకుల్లో 8వ స్థానం




**కొండాపూర్:** క్యూఎస్ ఇండియా-2020 ర్యాంకింగ్స్‌లో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) టాప్-10లో నిలిచింది. ఈ ర్యాంకింగ్స్‌లో హెచ్‌సీయూ 8వ స్థానంలో నిలవడం సంతోషదాయకమని వర్సిటీ వీసీ పీ అప్పారావు తెలిపారు. ఈ ర్యాంకుల్లో ఐఐటీ బాంబే అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా.. బెంగళూరులోని ఐఐఎస్సీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్), ఐఐటీ ఢిల్లీ వరుసగా ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. దేశంలోని 100 అత్యుత్తమ యూనివర్సిటీల్లో హెచ్‌సీయూ తన ర్యాంకును మెరుగుపర్చుకోవడం, పీహెచ్‌డీ విభాగంలో ఉత్తమ స్కోరు సాధించడంపై వీసీ అప్పారావు హర్షం వ్యక్తంచేశారు. హెచ్‌సీయూలోని అన్ని విభాగాలు మరింత మెరుగవుతుండటంతోనే ఈ ర్యాంకు సాధ్యమయిందని పేర్కొంటూ.. భవిష్యత్తులో మరింత మెరుగైన ర్యాంకును సాధించేందుకు కృషిచేస్తామని చెప్పారు.



# ఆర్టీసీపై కమిటీ

▶ మొదటిపేజీ తరువాయి...

సందర్భంగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం మీదనే పట్టుపట్టబోమని తెలిపారు. కార్మికసంఘాల తరపున కోర్టులో వాదించిన న్యాయవాది ప్రకాశ్‌రెడ్డి కూడా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్ నెరవేర్చితే తప్ప చర్చలకు రాబోమని కార్మికులు ఎప్పుడూ చెప్పలేదన్నారు. విలీన డిమాండ్ ఒక్కటే ప్రధానం కాదని చెప్పారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జారీచేసిన ఉత్తర్వుల్లో కూడా ఇదే విషయాన్ని ప్రస్తావించారు. దీంతో కార్మికులు విలీనం డిమాండ్ వదులుకున్నట్లయింది. కార్మికులు లేవనెత్తిన డిమాండ్లలో 21 అంశాలను పరిశీలించాలని కోర్టుకోరింది. కోర్టు ఆదేశాల మేరకు ఈ డిమాండ్లు పరిశీలించాలి. దానికోసం అధ్యయనం చేయండి' అని ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను ఆదేశించారు.

### వెంకటేశ్వరరావు అధ్యక్షుడిగా కమిటీ

ఆర్టీసీ ఎండీగా వ్యవహరిస్తున్న రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మ.. ముఖ్యమంత్రి ఆదేశాలతో ఆరుగురు అధికారులతో కమిటీవేశారు. అధ్యక్షుడిగా ఈడీ టీ వెంకటేశ్వర్‌రావు, సభ్యులుగా ఈడీలు ఏ పురుషోత్తం, సీ వినోద్‌కుమార్, ఈ యాదగిరి, వీ వెంకటేశ్వర్లు, ఆర్థికసలహాదారు ఎన్ రమేశ్ ఉంటారు. హైకోర్టు సూచించిన 21 అంశాలను పరిశీలించి, ఒకట్రెండురోజుల్లో కమిటీ తన నివేదికను ఆర్టీసీ ఎండీకి అందిస్తుంది. ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రయాణికులకు ఇబ్బంది కలుగకుండా చేసిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ముఖ్యమంత్రి కేసీఆర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తక్షణం వెయ్యి బస్సులను అద్దెకు తీసుకోవడానికి నోటిఫికేషన్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు.

### చట్టవ్యతిరేక సమ్మెకు మద్దతు అనైతికం

ఆర్టీసీ కార్మికసంఘాల ప్రోద్బలంతో చట్టవ్యతిరేకంగా జరుగుతున్న సమ్మెకు కాంగ్రెస్, బీజేపీ మద్దతు పలుకడం అనైతికమని ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. తెలంగాణలో కార్మికులు చేస్తున్న డిమాండ్లను కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలుచేస్తున్నారా? అని ప్రశ్నించారు. 'ఆర్టీసీ విషయంలో కాంగ్రెస్, బీజేపీ వాదనలు విచిత్రంగా ఉన్నాయి. రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఆర్టీసీ), రూట్లను ప్రైవేటు పరం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి అధికారం, అవకాశం కల్పిస్తూ నరేంద్రమోదీ ప్రభుత్వం చట్టంచేసింది. దానికి వ్యతిరేకంగా ఇక్కడి బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారు. మధ్యప్రదేశ్‌లో దిగ్విజయ్‌సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీని మూసేసింది. కానీ ఆ పార్టీలు తెలంగాణ విషయంలో మాత్రం విచిత్రంగా, విభిన్నంగా మాట్లాడుతున్నాయి' అని ముఖ్యమంత్రి అన్నారు.

### ప్రైవేట్‌కు అవకాశమిచ్చిందే మోదీ

'1950లో జవహర్‌లాల్‌నెహ్రూ ప్రధానిగా ఉన్నప్పుడు మోటర్ వెహికిల్ చట్టం రూపొందించారు. దాని ప్రకారమే రాష్ట్రాల్లో ఆర్టీసీలు ఏర్పడ్డాయి. ఆర్టీసీ వాహనాలు నడిచే రూట్లలో ప్రైవేటువాహనాలకు పర్మిట్లు ఇవ్వవద్దని కూడా ఆ చట్టంలో పేర్కొన్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఆ చట్టంలోని 3వ సెక్షన్‌లో సవరణలు చేస్తూ 2019 బడ్జెట్ సమావేశాల్లో సవరణ బిల్లు ఆమోదించి, చట్టంచేసింది. 'మోటర్ వెహికిల్ (సవరణ) చట్టం- 2019' పేరిట అమలవుతున్న చట్టంలో ఆర్టీసీలో ప్రైవేటురంగానికి అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించడానికి రాష్ట్రప్రభుత్వాలు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ చట్టంలో పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సౌకర్యం అందించడానికి, తక్కువ ధరల్లో ప్రయాణం సాగించడానికి పోటీ అనివార్యమని కూడా కేంద్రం పేర్కొన్నది. మొబైల్ రంగంలో, విమానయానరంగంలో ప్రైవేటుకు అవకాశం కల్పించడంవల్ల ఆయారంగాల్లో రేట్లు తగ్గాయని, సౌకర్యాలు పెరిగాయని కేంద్రం ప్రకటించింది. ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడులు ఉపసంహరించుకోవడం ద్వారా నిధులు సమకూర్చుకుంటామని కేంద్ర బడ్జెట్లోనే చెప్పారు. అలాంటిది బీజేపీ నాయకులు తెలంగాణలో మాత్రం ఆర్టీసీ విషయంలో విచిత్రమైన ఆరోపణలు చేస్తున్నారు' అని సీఎం కేసీఆర్ అన్నారు. కేంద్రం తెచ్చిన చట్టాన్నే అమలుచేయడానికి తాము ప్రయత్నిస్తుంటే, స్థానిక బీజేపీ నాయకులు రాద్ధాంతం చేస్తున్న విషయంపై ప్రధానికి, కేంద్ర ఉపరితల రవాణాశాఖ మంత్రికి లేఖరాయాలనే విషయం కూడా సమీక్షలో చర్చకు వచ్చింది. ఈ సమావేశంలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ముఖ్యకార్యదర్శులు సునీల్‌శర్మ, నర్సింగ్‌రావు, ప్రభుత్వసలహాదారులు రాజీవ్‌శర్మ, అనురాగ్‌శర్మ, రవాణాకమిషనర్ సందీప్ సుల్తానియా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.

# మళ్లీ ఎన్నికల సందడి

■ 131 పట్టణ స్థానికసంస్థల ఎన్నికలకు లైన్‌క్లియర్
■ తుది నిర్ణయం తీసుకోనున్న సర్కార్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైకోర్టు తీర్పు నేపథ్యంలో రాష్ట్రంలో సుమారు 121 మున్సిపాలిటీలు, 10 కార్పొరేషన్లలో ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం అయింది. వీటిలో దాదాపు 3,149 దాకా వార్డులున్నాయి. సుమారు అరవై మున్సిపాలిటీలకు సంబంధించి వార్డుల విభజనపై సింగిల్ జడ్జి ధర్మాసనంలో కేసులుండగా, వాటిని సరిచేయాలని న్యాయస్థానం సూచించింది. ఇందుకు సంబంధించి ఎలా ముందుకెళ్లాలనే విషయంపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. అయితే.. కరీంనగర్, రామగుండం, నిజామాబాద్, బోడుప్పల్, పీర్జాదిగూడ, బడంగ్‌పేట, నిజాంపేట, బండ్లగూడ, మీర్‌పేట, జవహర్‌నగర్ కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం కార్పొరేషన్ల కాలపరిమితి ఇంకా పూర్తికాలేదు. దీంతో వీటికి ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. సిద్దిపేట, అచ్చంపేట మున్సిపాలిటీల కాలపరిమితి పూర్తవ్వలేదు. పాల్వంచ, మందమర్రి, మణుగూరు వంటివాటిలో సాంకేతిక కారణాలతో ఎన్నికలు జరుపడం లేదు. జడ్చర్ల, నకిరేకల్ వంటి మున్సిపాలిటీల్లో గ్రామాల విలీన ప్రక్రియ పూర్తికాలేదు. జీహెచ్ఎంసీ, వరంగల్, ఖమ్మం వంటివి మినహాయిస్తే.. మిగతా పది కార్పొరేషన్లలో దాదాపు 385 వార్డులు, 121 మున్సిపాలిటీల్లో 2,764 వార్డుల్లో ఎన్నికలు జరిగే అవకాశాలున్నాయని సమాచారం. మొత్తంగా ఎన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఎన్నికలు నిర్వహించాలనే విషయంలో ఒకట్రెండు రోజుల్లో స్పష్టత వచ్చే అవకాశమున్నదని పురపాలకశాఖ అంచనా వేస్తున్నది. ఆగస్టు 15 లోపు ఎన్నికల ప్రక్రియను పూర్తిచేయాలని ప్రభుత్వం తొలుత భావించినా.. వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు వంటి అంశాలపై కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగింది. ప్రస్తుతం హైకోర్టు పచ్చజెండా ఊపడంతో రాష్ట్రంలో పురపాలక ఎన్నికల సందడి మొదలుకానున్నది.

## పట్టణ బీసీ ఓటర్లు 61.12 లక్షలు

■ మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో బీసీ ఓటర్ల జాబితా
■ తీర్పు కాపీ అందిన తర్వాతే తుది నిర్ణయం
■ 20 రోజుల్లో ఎన్నికల ప్రక్రియ పూర్తికి కసరత్తు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో మొత్తం 128 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 61,12,799 మంది బీసీ ఓటర్లున్నట్టు లెక్క తేలింది. మున్సిపల్ ఎన్నికలపై హైకోర్టు తీర్పు నేపథ్యంలో బీసీ ఓటర్ల వివరాలను ప్రభుత్వానికి అందించారు. మున్సిపల్ ఎన్నికల కోసం ఆగస్టు నుంచే ఏర్పాట్లు చేయగా.. బీసీ ఓటర్ల జాబితాను సైతం సవరించి పూర్తిచేశారు. బీసీ రిజర్వేషన్లు ఓటరు జాబితా ప్రకారం, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన చేయనున్నారు. ఈ రిజర్వేషన్ల ప్రక్రియను కూడా మొదలుపెట్టనున్నారు. మున్సిపాలిటీల్లో ఎస్టీ, ఎస్సీ, బీసీ, మహిళా రిజర్వేషన్ల జాబితా ప్రభుత్వం నుంచి అందగానే ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు. మొత్తం 20 రోజుల వ్యవధిలోనే మున్సిపల్ ఎన్నికల పూర్తికి ఎస్ఈసీ కసరత్తు చేస్తున్నది. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన 16 రోజుల్లోనే ఎన్నికల నిర్వహణ, ఫలితాల ప్రకటనకు కార్యాచరణ రూపొందిస్తున్నది.

**కోర్టు తీర్పు కాపీ అందిన తర్వాతే**

ఎన్నికల నిర్వహణపై హైకోర్టు ఇచ్చిన తీర్పు కాపీ అందిన తర్వాత అందులోని అంశాలు పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఎస్ఈసీ కార్యదర్శి అశోక్‌కుమార్ తెలిపారు. మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లకు గతంలోనే అవసరమైన కసరత్తు పూర్తిచేసినందున ఎన్నికలకు ఎస్ఈసీ సిద్ధంగా ఉన్నదన్నారు. రిజర్వేషన్ల జాబితా అందగా నే ఎన్నికల పనుల్లో నిమగ్నమవుతామని చెప్పారు.

## ఎన్నికలు ఏవైనా గెలుపు టీఆర్‌ఎస్‌దే

■ మున్సిపల్ ఎన్నికలపై హైకోర్టు తీర్పును ఆహ్వానిస్తున్నాం
■ వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఎన్నికలు ఏవైనా గెలుపు టీఆర్ఎస్ పార్టీదేనని.. మున్సిపల్ ఎన్నికల్లోనూ గులాబీ జెండా ఎగురవేస్తామని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. మున్సిపల్ ఎన్నికలపై హైకోర్టు ఇచ్చిన తీర్పును ఆహ్వానిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రాజెక్టులను అడ్డుకునే ప్రయత్నమైనా, సచివాలయ నిర్మాణమైనా, మున్సిపల్ ఎన్నికలైనా.. విపక్షాలు ఉద్దేశపూర్వకంగా అడ్డంకులు కల్పిస్తున్నాయని విమర్శించారు. దుర్బుద్ధితో తప్పుడు పిటిషన్లు వేసి అభాసుపాలయ్యారని, ప్రభుత్వ సమయాన్ని వృథా చేయగలిగారేతప్ప సాధించిందేమీలేదని తెలిపారు. ప్రాజెక్టులను కేసులతో అడ్డుకోవాలని ప్రయత్నించారని, ప్రజలు, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోకుండా తాము చేయలేనది మరెవరూ చేయకూడదన్న రీతిలో విపక్షాలు వ్యవహరించాయని విమర్శించారు. చనిపోయినవారి పేరుతో కేసులు వేయించడం విపక్షాల తీరుకు పరాకాష్ఠ అని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికలను అడ్డుకునే విపక్షాల కుట్రలకు హైకోర్టు తీర్పుతో చెక్ పడిందని అన్నారు. ప్రజల కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వంపై ప్రజలు అభిమానంతో ఉన్నారని, కల్యాణ లక్ష్మి, షాదీముబారక్, అమ్మఒడి, కేసీఆర్ కిట్, రైతుబంధు, రైతుబీమా, ఆసరా పింఛన్లు, వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరంట్, గురుకులాల ఏర్పాటు, వసతిగృహాల్లో సన్నబియ్యం అన్నం పథకాలతో కేసీఆర్‌పై ప్రజలు విశ్వాసం పెంచుకున్నారని చెప్పారు. 60 ఏండ్లు పాలించినవారు కనీసం అన్ని గ్రామాలకు కరంటు ఇవ్వలేకపోయారని, గత పాలకుల హయాం లో పడ్డ ఇబ్బందులు ప్రజల జ్ఞాపకాల నుంచి చెదిరిపోలేదని మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు.

## మున్సిపోల్స్‌కు పచ్చజెండా

▶ మొదటిపేజీ తరువాయి...

గుర్తించారని ఏ ఒక్క ఓటరు కోర్టుకు రాలేదన్న విషయాన్ని గుర్తించాలని పేర్కొన్నది. ఎన్నికల జాబితాల ఖరారు అంశం గురించి ప్రస్తావిస్తూ.. తెలంగాణ మున్సిపాలిటీస్ యాక్ట్ సెక్షన్ 11 ప్రకారం ఓటర్ల జాబితాల ను రాష్ట్ర ఎన్నికల సంఘం(ఎస్ఈసీ) ఎలక్షన్ క్యాలెండర్ ఇచ్చే ముందు ఖరారుచేస్తుందని, ఈమేరకు ఎస్ఈసీకి అధికారం ఉందని తెలిపింది. నిబంధనల ప్రకారం అసెంబ్లీ ఎ న్నికలకు సిద్ధంచేసిన ఓటర్ల జాబితాల ఆధారంగానే మున్సిపల్ ఎన్నికల ఓటర్ల జాబితాలను ఎస్ఈసీ సిద్ధంచేస్తుందని పేర్కొన్నది. పిటిషనర్లు ఏ ఒక్క ఆరోపణను నిరూపించలేకపోయినందున పిటిషన్లను కొట్టేస్తున్నామని ప్రకటించింది. ఈ సందర్భంగా సింగిల్ జడ్జి ధర్మాసనం వద్ద పెండింగ్‌లో ఉన్న పలు మున్సిపాలిటీల పిటిషన్ల అంశాన్ని ఏఏజీ జే రామచంద్రరావు ద్విసభ్య ధర్మాసనం ఎదుట ప్రస్తావించారు. వాటిని అక్కడే ప్రస్తావిం చి.. సింగిల్ జడ్జి ఆదేశాల మేరకు వ్యవహరించాలని ధర్మాసనం పేర్కొన్నది. వార్డుల విభజన సక్రమంగా లేదని ఆయా మున్సిపాలిటీలకు చెందినవారు గతంలో వేర్వేరు రిట్ పిటిషన్లు దాఖలు చేశారు. నిబంధనల ప్రకారం వార్డుల విభజనలో పొరపాట్లు ఉంటే సరిచేసుకొని, నిర్దేశిత ప్రక్రియ ప్రకారం ముందుకు వెళ్లొచ్చని సింగిల్ జడ్జి ధర్మాసనం గతంలో ఆదేశాలు జారీచేసింది. ద్విసభ్య ధర్మాసనం ఎదుట ఉన్న కేసులలో తీర్పు వెలువడిన నేపథ్యంలో సింగిల్ జడ్జి వద్ద కేసులు త్వరలో విచారణకు రానున్నాయి.

### ఎన్నికల నిర్వహణకు 20 రోజులు..

వార్డుల విభజన, ఓటర్ల జాబితాల ప్రకటన, వార్డులవారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళా ఓటర్ల గుర్తింపు, పోలింగ్‌స్టేషన్ల గుర్తింపు, ఎన్నికల సామగ్రి పంపిణీ, ఎన్నికల సిబ్బంది కేటాయింపు- శిక్షణ, బ్యాలెట్ బాక్సుల సేకరణ వంటి అన్ని ప్రక్రియలు పూర్తికాగా, వార్డులవారీ, చైర్‌పర్సన్ల రిజర్వేషన్ల ఖరారు చేయాల్సి ఉన్నదని ప్రభుత్వం గతంలో వాదనల సందర్భంగా పేర్కొన్న విషయం తెలిసిందే. ఎన్నికల నిర్వహణకు తాము కట్టుబడి ఉన్నామని, ఓటర్ల జాబితా ప్రకటనకు ఏడు రోజులు, ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్లు, ఉపసంహరణ వంటి ప్రక్రియలకు కలిపి 20రోజులు సమయం కావాలని ఎస్ఈసీ పేర్కొన్నది.

# ప్రగతిచక్రం పరుగు

సమ్మెలోనూ ఆగని బస్సు ■ ఫలించిన ప్రభుత్వ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

■ రవాణా, పోలీసు, రెవెన్యూ, ఆర్టీసీ సమన్వయం
■ సీఎం కేసీఆర్ ఆదేశాలతో యంత్రాంగం అప్రమత్తం
■ మంత్రి పువ్వాడ, ఉన్నతాధికారుల నిరంతర సమీక్షలు
■ ప్రయాణికులకు తొలిగిన రవాణా ఇబ్బందులు



మంగళవారం జగిత్యాల జిల్లా కొండగట్టులో ఆర్టీసీ బస్సులో టికెట్లను తనిఖీ చేస్తున్న కలెక్టర్ శరత్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** చిత్తశుద్ధి, సమన్వయం ఉంటే ఎలాంటి సమస్యలనైనా ఎదుర్కొనవచ్చని నిరూపించింది తెలంగాణ ప్రభుత్వం. ఆర్టీసీసంఘాల సమ్మె నేపథ్యంలో ప్రయాణికులు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా తీసుకున్న చర్యలు సత్ఫలితాలిచ్చాయి. దసరా పండుగ నుంచి విద్యాసంస్థలు ప్రారంభమైననాటి వరకు ప్రజారవాణా వ్యవస్థను సాధారణ స్థితికి తెచ్చే క్రమంలో ప్రభుత్వం చూపిన చొరవ ప్రశంసలు పొందుతున్నది. శాఖలు వేరైనా సమన్వయంతో ముందుకు వెళ్లి పనిచేయడం వల్లే ఇది సాధ్యమైందని అధికారులు చెప్తున్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు వందశాతం సేవలు అందించాలనే లక్ష్యంతో రాత్రి పగలు తేడా లేకుండా పనిచేస్తున్నామని అంటున్నారు. రోజురోజుకీ రవాణా ఏర్పాట్లు మెరుగుపడుతుండటంతో అధికారులు ఉత్సాహంగా పనిచేస్తున్నారు. వందశాతం ఆర్టీసీ బస్సులు నడిపేందుకు వీలుగా చర్యలను ముమ్మరం చేశారు. మంగళవారం సాయంత్రం ఆరు గంటల వరకు 3888 ఆర్టీసీ, 1433 అద్దె బస్సులు కలిపి మొత్తం 5,321 బస్సులు నడిచాయని ఆర్టీసీ ప్రకటించింది. 3,888 మంది ప్రైవేట్ డ్రైవర్లు, 5,321 ప్రైవేట్ కండక్టర్లు విధులు నిర్వహించారని తెలిపింది.

### పండుగ పూట మొదలైన సమ్మె...

ఆర్టీసీ సంఘాలు సమ్మె ప్రకటించడంతో పండుగకు ఊళ్లకు ఎలా వెళ్లాలో తెలియక ప్రజలు ఆందోళన చెందారు. పరిస్థితులను ముందుగానే గమనించిన ప్రభుత్వం.. అందుకు అనుగుణంగా మందస్తు చర్యలకు ఉపక్రమించింది. సాధ్యమైనన్ని ఆర్టీసీ బస్సులను తిప్పడంతోపాటు, ప్రైవేటు వాహనాలకు తాత్కాలిక అనుమతులిచ్చింది. సీఎం కేసీఆర్ పరిస్థితిని సమీక్షిస్తూ ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా తక్షణ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఆర్టీసీ ఇంచార్జి ఎండీ సునీల్‌శర్మ, ఇతర అధికారుల సమన్వయంతో విధులు నిర్వర్తించారు. డిపోల్లో ప్రత్యేకంగా నోడల్ అధికారులను నియమించింది. ప్రతి ఆర్టీవో కార్యాలయ పరిధిలో కంట్రోల్‌రూంలు ఏర్పాటుచేసి ప్రయాణికుల రద్దీ ప్రకారం బస్సులను అధికారులు ఏర్పాటుచేశారు. డిపోల్లో ఉన్న బస్సులకు అదనపు సిబ్బందిని అందుబాటులో ఉంచారు. జిల్లాలవారీగా కలెక్టర్లు పరిస్థితులను పర్యవేక్షించారు. డీఆర్వో లేదా ఆర్డీవోలు డిపోకు ఒకరు చొప్పు న నోడల్ అధికారులుగా వ్యవహరించారు. సమ్మె నేపథ్యంలో ఎలాంటి ఘటనలు జరుగకుండా పోలీసుశాఖ పూర్తిస్థాయిలో పర్యవేక్షించింది. డిపోలవారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటుచేయడంతోపాటు, బంద్ రోజున ఎలాంటి ఘటనలు జరుగకుండా సంయమనంతో వ్యవహరించింది. దీంతో విద్యాసంస్థలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా రవాణా వ్యవస్థ కొనసాగుతున్నది. రవాణా, ఆర్టీసీ, రెవెన్యూ, పోలీసు అధికారుల సమన్వయంతో దాదాపుగా సాధారణ స్థితికి చేరుకున్నదని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

### అద్దెబస్సుల టెండర్లపై స్టేకు నిరాకరణ

ఆర్టీసీలోకి అద్దె బస్సులను తీసుకునేందుకు సంస్థ యాజమాన్యం చేపట్టిన టెండర్ల ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. 'హైర్‌పథకం' కింద 1,035 బస్సులకు యాజమాన్యం నోటిఫికేషన్ విడుదలచేసిందని, సమ్మె కొనసాగుతుండటంతోపాటు కోర్టు కేసులు పెండింగ్‌లో ఉండగా నోటిఫికేషన్ జారీచేయడం తగదని టీఎస్‌ఆర్టీసీ కార్మికసంఘ్ పిటిషన్ దాఖలుచేసింది. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. టెండర్ల ప్రక్రియ కొనసాగించుకోవచ్చని తెలిపింది. ఈ పిటిషన్‌ను ప్రధాన పిటిషన్లకు కలుపాలని రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది.

# అధికారికంగా సర్దార్ పాపన్న ఉత్సవాలు

■ గౌడన్నల అలయ్- బలయ్‌లో ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్



గౌడన్నల అలయ్-బలయ్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్. చిత్రంలో శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్, ముఠా గోపాల్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ ఉన్నారు

**కాచిగూడ:** తెలంగాణ రాష్ట్రంలోనే కుల వృత్తుల ఎదుగుదల సాధ్యమవుతున్నదని, గౌడ కులస్తులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం త్వరలో నీరా పాలసీని తీసుకురానున్నదని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతికశాఖల మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. వచ్చే ఏడాది సర్దార్ పాపన్న ఉత్సవాలను అధికారికంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగోని బాల్‌రాజ్‌గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం బర్కత్‌పురలోని తెలంగాణ యువతి మండలిలో అలయ్-బలయ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ నీరా దుకాణాన్ని ముందుగా ట్యాంక్‌బండ్‌పై, తర్వాత 33 జిల్లాల కేంద్రాల్లో ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. నీరాపై మరింతగా అధ్యయనం చేసేందుకు కేరళ, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో పర్యటించనున్నట్టు చెప్పారు. గౌడ కులస్తులందరూ ఒకే తాటిపైకి వచ్చి అలయ్-బలయ్ కార్యక్రమాన్ని జరుపుకోవడం అభినందనీయమన్నారు. శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో అలయ్-బలయ్ కార్యక్రమాన్ని తెలంగాణలోని అన్ని గ్రామాల్లో నిర్వహించేందుకు ప్రతి గౌడ కులస్తుడు ముందుకురావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యేలు ప్రకాశ్‌గౌడ్,ముఠా గోపాల్, మాజీ ఎమ్మెల్యేలు బిక్షమయ్యగౌడ్, సత్యనారాయణగౌడ్, పల్లె రవి, ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజేశం తదితరులు పాల్గొన్నారు.

**అన్ని జిల్లాల్లో శిక్షణా కేంద్రాలు**

నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సెట్విన్, స్టెప్ ద్వారా శిక్షణ ఇప్పిస్తున్నామని, త్వరలో అన్ని జిల్లాల్లో శిక్షణా కేంద్రాలు ఏర్పాటుచేసేందుకు కార్యాచరణ రూపొందించాలని పర్యాటకశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పర్యాటకభవన్‌లో యువజనసర్వీసుల శాఖపై మంత్రి సమీక్ష నిర్వహించారు.

## లోకం పోకడ




వెళ్దాం రమ్మంటే రానంటున్నాడు.. ఆ అవగాహనా తరగతులు సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తే

## ముహూర్తం

సూర్యోదయం: 6.12 గంటలకు

సూర్యాస్తమయం: 5.45 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, కృష్ణపక్షం, దశమి అర్ధరాత్రి 1.08 వరకు, నక్షత్రం: ఆశ్లేషా మధ్యాహ్నం 3.12 వరకు, తదుపరి మఖ, అమృత ఘడియలు: మధ్యాహ్నం 1.42 నుంచి 3.12 వరకు, రాహుకాలం: ఉదయం 11.58 నుంచి మధ్యాహ్నం 1.25 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 11.35 నుంచి మధ్యాహ్నం 12.22 వరకు, వర్జ్యం: అర్ధరాత్రి 2.14 నుంచి తె.జా. 3.43 (తెల్లవారితే గురువారం) వరకు.

# రైళ్లలో పోటెత్తిన జనం

■ ఒకేరోజు 11.5 లక్షల మంది ప్రయాణం
■ ఎంఎంటీఎస్‌లోనే 2.2 లక్షల మంది రవాణా
■ ఆర్టీసీ సమ్మె, పాఠశాలల ప్రారంభంతో పెరిగిన రద్దీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్టీసీ సమ్మె, విద్యాసంస్థలు తిరిగి ప్రారంభం కావడంతో రైల్వేకు ప్రయాణికులు పోటెత్తారు. దీంతో దక్షిణ మధ్య రైల్వే చరిత్రలో సరికొత్త రికార్డు నమోదైంది. సోమవారం ఒక్కరోజే 11.5 లక్షల మంది అన్‌రిజర్వుడులో ప్రయాణించారని, ఎంఎంటీఎస్‌లోనే 2.2 లక్షల మంది వెళ్లారని రైల్వే విభాగం ప్రకటించింది. సాధారణ రోజుల్లో 1.6 లక్షల మంది ప్రయాణికులతోపాటు 9.2 లక్షల మంది అన్‌రిజర్వుడు ప్రయాణికులు ఉంటారని, సోమవారం ఆ సంఖ్య భారీగా పెరిగినట్టు తెలిపింది. కాచిగూడ- నిజామాబాద్, కాచిగూడ- కర్నూల్ సిటీ మధ్య 4 ప్రత్యేక జన్ సాధారణ్ రైళ్లను నడపడమేకాకుండా రద్దీకి అనుగుణంగా రోజువారి ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు 14 అదనపు కోచ్‌లను జతచేసినట్టు పేర్కొన్నది. ముందస్తు అంచనాలతో ఏర్పాట్లుచేశామని దక్షిణ మధ్య రైల్వే జీఎం గజానన్ మాల్యా తెలిపారు. రికార్డు స్థాయిలో ప్రయాణికులకు సేవలందించడం సంతోషంగా ఉన్నదని అన్నారు. అధికారుల కృషిని ఆయన ప్రశంసించారు.

### అదనపు కోచ్‌ల ఏర్పాటు

ప్రయాణికుల రద్దీ పెరుగటంతో పలు రైళ్లకు అదనపు కోచ్‌లు ఏర్పాటుచేశారు. సికింద్రాబాద్- గుంటూరు గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌కు 3, సికింద్రాబాద్- బల్లార్షా భాగ్యనగర్ ఎక్స్‌ప్రెస్‌కు 3, గుంటూరు-వికారాబాద్ పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు 1, వికారాబాద్- గుంటూరు పల్నాడు ఎక్స్‌ప్రెస్‌కు 1, హైదరాబాద్- సిర్‌పూర్ కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌కు 2, సిర్‌పూర్ కాగజ్‌నగర్- హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌కు 2, సికింద్రాబాద్- బీదర్ ఎక్స్‌ప్రెస్‌కు 2 కోచ్‌లు ఏర్పాటు చేసినట్టు రైల్వే అధికారులు తెలిపారు.



మంగళవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల రద్దీ

# పుప్పాలగూడ విజయం

మొదటిపేజీ తరువాయి...

రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సూచనలు చేశారు. సుప్రీంకోర్టులో వాదనలు బలంగా వినిపించేందుకు సీనియర్ న్యాయవాదులను నియమించుకునేందుకు అనుమతులు ఇచ్చారు. ఏజీ, డీజీలు రెవెన్యూ అధికారులతో కలిసి రిపోర్టులు రూపొందించి కోర్టుకు సమర్పించారు. ఫలితంగా సర్కారుకు అనుకూలంగా తీర్పు వచ్చింది.

### కేటాయించినా సరిపోలేదని..

దేశవిభజన సందర్భంగా ఆస్తులు కోల్పోయి పాకిస్థాన్ నుంచి వచ్చిన శరణార్థుల (కాందిశీకులు)కు పరిహారం చెల్లించడానికి కేంద్రం నిర్వాసితుల (పరిహారం, పునరావాసం) (డీపీసీఆర్) చట్టం- 1954, నిర్వాసితుల భూమి పాలన చట్టం- 1950 తీసుకువచ్చింది. వీటి ప్రకారం కొందరు దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో పశ్చిమ పాకిస్థాన్ నుంచి వచ్చిన పరశురాం రామచంద్‌మలాని అనే వ్యక్తికి 1952లోనే బాటసింగారం, బోయినపల్లి గ్రామాల్లో 323.10 ఎకరాలను కేటాయించారు. తర్వాత ఆయన దాన్ని అమ్మేశారు. 1988లో చనిపోయారు. 13 ఏండ్ల తర్వాత పరశురాం రామచంద్ మలానీ వారసులుగా చెప్పుకొన్నవారు పాకిస్థాన్‌లో ఆయన వదిలేసుకున్న భూమికి సరిసమానమైన భూమి ఇవ్వలేదని, మళ్లీ తమకు హైదరాబాద్ జిల్లాలోనే 200 ఎకరాలను కేటాయించాలని దరఖాస్తు చేసుకున్నారు. ఆ మేరకు ఎస్ఈపీ 3/19/2001, తేదీ.26.2.2003 ఉత్తర్వుల ప్రకారం పుప్పాలగూడలో 148.30 ఎకరాలను కేటాయించారు. నిజానికి పాకిస్థాన్ నుంచి వచ్చిన శరణార్థులకు అక్కడ కోల్పోయిన భూమికి సరిపడా భూమి మాత్రమే ఇవ్వాలి. కానీ భారత ప్రభుత్వం మలానీకి దాదాపు నాలుగింతలు.. అంటే 323.10 ఎకరాలు కేటాయించడం విశేషం. అయినా కేటాయించిన భూమి సరిపోదంటూ వారసులు దరఖాస్తు చేసుకోగానే అప్పటి ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వంలోని కొందరి పెద్దల జోక్యంతో రెవెన్యూ అధికారులు పుప్పాలగూడలో భూములు కేటాయించారు. మలానీ మృతిచెందిన తర్వాత హక్కుల బదలాయించాలని ఆయన వారసులు ప్రభుత్వాన్ని కోరారు. దీనికి అనుకూలంగా 2003 ఫిబ్రవరి 26న సీసీఎల్ఏ ఉత్తర్వులు జారీచేసింది. కేటాయింపులను సమర్థిస్తూ 2006 జూన్ 28న రెవెన్యూ కార్యదర్శి ఉత్తర్వులు ఇచ్చారు. వాటిని సవాలుచేస్తూ ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్లపై హైకోర్టు విచారణ చేపట్టింది. అసలైన నిర్వాసితుడు 1988లోనే మృతిచెందారని ప్రభుత్వం వాదించింది. మలానీ వారసులమని చెప్పుకొంటున్నవారు అందుకు తగిన ఆధారాలను చూపించడం లేదని పేర్కొన్నది. వాదనలు విన్న హైకోర్టు ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. పరశురాం వారసులుగా పేర్కొంటున్నవారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై సోమవారం విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. సదరు భూమి ప్రభుత్వానికే చెందుతుందని తుదితీర్పును వెలువరించినట్లు రాజేంద్రనగర్ ఆర్డీవో కే చంద్రకళ 'నమస్తే తెలంగాణ'కు వివరించారు. ఈ భూమిని గతంలోనే హెచ్ఎండీఏకు కేటాయించారు.

### కేటాయించిందే ఎక్కువ

వాస్తవానికి మలానీకి పాకిస్థాన్‌లో పోగొట్టుకున్న భూమికి నాలుగురెట్లు అధికంగా కేటాయించారు. దానిని కొంతకాలం అనుభవించి, ఆ తర్వాత అమ్మేసుకున్నారు. కానీ.. దాదాపు 34 ఏండ్ల తర్వాత ఆయన వారసులమని, సరిపడా భూమి కేటాయించలేదని కొందరు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవడం, ఆ వెంటనే అదృశ్యశక్తుల మాయాజాలంతో అప్పటి రెవెన్యూ అధికారులు చకచకా ఉత్తర్వులు జారీచేయడం గమనార్హం. పైగా కేంద్ర ప్రభుత్వం ఈ కేటాయింపులు చేయాల్సి ఉన్నా.. సీసీఎల్ఏ ద్వారా చేశారు. అంతకుమించి ఎవాక్యూ ప్రాపర్టీ కేటాయింపులన్నింటినీ ప్యాకేజీ డీల్‌గానే కేంద్రప్రభుత్వం కొనసాగించింది. అంతే తప్ప అక్కడ కోల్పోయిన దానికి సమానంగానో, అంతకు ఇన్నిరెట్లుగానో ఇవ్వాలని చట్టంలో ఎక్కడాలేదని అధికారులు చెప్తున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ ఆవిర్భావం తర్వాత గుర్తించారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన శేషాద్రి, రజత్ కుమార్, రఘునందన్‌రావు హయాంలో కేటాయింపులను రద్దుచేశారు. ఆ తర్వాత హైకోర్టులోనూ వాదనలు వినిపించి విజయం సాధించారు. సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా కూడా ఆ కేసు పూర్వాపరాలను వెలికితీసి అన్ని ఆధారాలను కలెక్టర్ హరీశ్, ఆర్డీవో కే చంద్రకళ సమర్పించారు. దాంతో అత్యంత ఖరీదైన భూమి ప్రభుత్వపరమైంది.

### క్రయ విక్రయాలు

పుప్పాలగూడలో సర్వే నం.310, 311, 318 నుంచి 323, 337 భూములపై వివాదం ఉన్నదని తెలిసీ కొందరు తక్కువధరకు వస్తున్నాయని కొనుగోలుచేశారు. మరికొందరు అత్యుత్సాహంతో ఏమవుతుందిలే అని కొన్నారు. అక్రమాలకు చట్టబద్ధత సాధించేందుకు కొందరు ప్రయత్నాలు చేశారు. ఆయాస్థలాల్లో ఎలాంటి లేఅవుట్లు లేవు. కానీ గ్రామపంచాయతీ అనుమతులు తీసుకున్నట్లు పత్రాలు తయారు చేసుకున్నారని సమాచారం. గతంలో హైకోర్టు తీర్పు వెలువడిననాటినుంచే అధికారులు తదుపరి అక్రమాలు సాగకుండా పకడ్బందీ కార్యాచరణను అమలుచేశారు. దాంతో సరికొత్త నిర్మాణాలు ఏవీ రాలేదు.

#### సీఎం కృత నిశ్చయంతోనే విజయం



పుప్పాలగూడ భూములపై సుప్రీంకోర్టులోనూ విజయం సాధించడం ఎంతో సంతోషంగా ఉన్నది. ఈ కేసులో సీఎం కేసీఆర్ నిరంతర పర్యవేక్షణ, సమీక్షలు, కృతనిశ్చయం ఫలితాన్నిచ్చాయి. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన రఘునందన్‌రావు ఎంతో కృషిచేశారు. రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఉన్నతాధికారుల సూచనలు తీసుకున్నాం. హెచ్ఎండీఏ, టీఎస్ఐఐసీ అధికారుల కృషి కూడా ఉన్నది. ప్రధాన ప్రాంతంలో ఉన్న అత్యంత ఖరీదైన భూమిని కాపాడటం తృప్తిగా ఉన్నది.

– హరీశ్, కలెక్టర్, రంగారెడ్డి జిల్లా

#### బంజారాభవన్ నుంచే మొదలైంది



నేను హైదరాబాద్‌జిల్లాలో ఉన్నప్పుడే బంజారాభవన్ స్థలంపై ఇదే వివాదం ఉన్నది. సీఎం కేసీఆర్ బంజారాభవన్‌కు స్థలం కేటాయించాలనుకున్నప్పుడు ఈ కేసు విషయం చెప్పాం. అప్పుడే ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ నాలుగెకరాల కేసు గెలిచాం. ఇప్పుడు 148.30 ఎకరాలపైన. సీఎం సీరియస్‌గా తీసుకోవడం వల్లే చేయగలిగాం. ఏజీ, డీజీలు, హెచ్ఎండీఏ అధికారులు సహకరించారు. అక్రమాలకు తెరపడింది. ప్రభుత్వ సహకారంతో మిగతా కేసుల్లోనూ విజయం సాధిస్తాం.

– కే చంద్రకళ, ఆర్డీవో, రాజేంద్రనగర్



మంగళవారం గోదావరి ఒడ్డుకు చేరిన రాయల్ వశిష్ఠ బోటు



ఆనందంలో బోటు వెలికితీతలో పాల్గొన్న సిబ్బంది

# గోదావరిలో బోటు వెలికితీత

- 38 రోజుల తర్వాత ఒడ్డుకు..
- ఫలించిన ధర్మాడి సత్యం బృందం కృషి
- పడవలో ఎనిమిది మృతదేహాలు లభ్యం
- కుళ్లిపోయి, ఎముకలు తేలి దుర్వాసన
- 47కు చేరిన మృతుల సంఖ్య

**అమరావతి/ మడికొండ(వరంగల్), నమస్తే తెలంగాణ:** గోదావరిలో మునిగిన రాయల్ వశిష్ఠ బోటు మంగళవారం ఒడ్డుకు చేరింది. ధర్మాడి సత్యం బృందం చేసిన ప్రయత్నం ఫలించింది. 38 రోజులపాటు నీటిలోనే ఉండిపోయిన బోటులో కుళ్లిపోయిన ఎనిమిది మృతదేహాలు బయటపడ్డాయి. ఎముకలు బయటకొచ్చి దుర్వాసన వస్తూ.. కనీసం గుర్తుపట్టలేని స్థితికి చేరాయి. ఇప్పటికీ మరో నలుగురి ఆచూకీ లభించలేదు. ఏపీలోని పాపికొండలకు వెళ్తున్న రాయల్ వశిష్ఠ బోటు తూర్పుగోదావరి జిల్లా దేవీపట్నం మండలం కచ్చులూరు మండం వద్ద గోదావరి నదిలో సెప్టెంబర్ 15వ తేదీన మునిగిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన సమయంలో పడవలో మొత్తం 77 మంది ప్రయాణిస్తుండగా, 39 మంది మృతిచెందారు. మరో 26 మంది సురక్షితంగా బయటపడగా, మిగిలిన 12 మంది ఆచూకీ లభించలేదు. గోదావరిలో నీటి ప్రవాహం ఉద్ధృతంగా ఉండటంతో నేవీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు బోటు వెలికితీసేందుకు యత్నించి విఫలమయ్యాయి. తర్వాత ఈ బాధ్యతను ఏపీ రాష్ట్ర ప్రభుత్వం కాకినాడకు చెందిన ధర్మాడి సత్యం బృందానికి అప్పగించింది. సెప్టెంబర్ 28న ఆపరేషన్ మొదలుపెట్టిన ఈ బృందం.. గోదావరిలో వరద పోటెత్తడంతో ఈ నెల 3న ఆపరేషన్ నిలిపేసింది. మళ్లీ ఈ నెల 16న పనులను ముమ్మరం చేసింది. విశాఖకు చెందిన స్కూబా డైవర్ల సాయంతో నది గర్భంలో ఇసుకలో కూరుకుపోయిన బోటుకు ఐరన్ రోప్‌లు, లంగర్లను కట్టి.. పొక్లెయినర్ సాయంతో బయటకు తీసుకొచ్చింది. బోటు పూర్తిగా ధ్వంసమైంది. బయటపడ్డ ఎనిమిది మృతదేహాలతో కలిపి ఈ ప్రమాదంలో ఇప్పటివరకు మృతిచెందిన వారిసంఖ్య 47కు చేరింది.

### మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు

ఒడ్డుకు చేరిన బోటులో లభ్యమైన ఎనిమిది మృతదేహాల్లో ఓ మహిళ, మరోపాప, ఆరుగురు పురుషులు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. డీఎన్ఏ పరీక్షలు చేస్తేనే మృతులు ఎవరనేది తెలుస్తుందని వారు తెలిపారు. మృతదేహాల నుంచి డీఎన్ఏ సేకరించి.. బాధిత కుటుంబసభ్యుల డీఎన్ఏతో పోల్చి శవాలను అప్పగిస్తామని చెప్పారు. బోటు వద్ద దుర్వాసన వస్తుండటంతో అక్కడకు వెళ్లేందుకు ఎవరూ సాహసించడంలేదు.

### కడిపికొండకు చెందిన ముగ్గురెక్కడ?

ప్రమాద సమయంలో బోటులో వరంగల్ అర్బన్ జిల్లా కాజీపేట మండలం కడిపికొండకు చెందిన 14 మంది ఉండగా, వారిలో ఐదుగురు మృతిచెందారు. ఆరుగురు సురక్షితంగా బయటపడ్డారు. ముగ్గురు రాజ్‌కుమా ర్, రవి, ధర్మరాజు ఆచూకీ లభించలేదు. ప్రస్తుతం దొరికిన శవాల్లో.. తమవారు ఉండొచ్చని, అంత్యక్రియలు చేసే అవకాశమైనా ఉంటుందని బాధిత కుటుంబీకులు ఎదురుచూస్తున్నారు.

# ఆర్టిజన్లకు అన్నిరకాల అలవెన్సులు

- రివైజ్డ్ పే స్కేళ్లతో భారీగా పెరుగనున్న జీతభత్యాలు
- విద్యుత్ యాజమాన్యాల ఉత్తర్వు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యుత్ కార్మికులకు అన్నిరకాల అలవెన్సులు వర్తింపజేస్తూ విద్యుత్ సంస్థల యాజమాన్యాలు మంగళవారం ఉత్తర్వులు జారీచేశాయి. కార్మికసంఘాలతో చర్చలు సామరస్యంగా ముగిసిన రెండు రోజుల్లోనే ఆర్టిజన్స్‌కు లాభం కలిగించేలా ఉత్తర్వులు జారీచేయడం గమనార్హం. వేలమంది విద్యుత్ కార్మికులకు ఆర్థికపరమైన, ఇతర లాభాలు కల్గించేలా విధివిధానాలు ఖరారుచేస్తూ ఉత్తర్వులు జారీచేయడంపై తెలంగాణ విద్యుత్ కార్మిక సంఘం (టీఆర్వీకేఎస్)తో సహా సంఘాలన్నీ హర్షం వ్యక్తంచేశాయి. ఉత్తర్వులు జారీచేసిన ట్రాన్స్ కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావు, ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డి, ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావుకు కృతజ్ఞతలు తెలిపాయి. కార్మికశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు స్టాండింగ్ ఆర్డర్స్‌ను ఆర్టిజన్స్ సర్వీస్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్‌గా మార్పుచేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మిగతా ఉద్యోగుల మాదిరిగానే పేస్కేలు, డీఏ, మెడికల్, హెచ్ఆర్, సీసీఏ, కార్పొరేట్, కన్వీనియెన్స్, ఇతర అలవెన్సులు కూడా ఆర్టిజన్లకు వర్తించనున్నాయి. 1.10.2019 నుంచి రివైజ్డ్ పేస్కేల్‌ను అమలుచేస్తున్నట్టు తెలిపారు. ఆర్టిజన్లకు సర్వీసు రిజిస్టర్లను తెరిచి.. పే ఫిక్సేషన్, ఇతర అంశాలను అందులో రికార్డు చేస్తారు. ప్రతినెలా పేస్లిప్ ఇస్తారు. 29.7.2017 నుంచి అర్హులైన ఆర్టిజన్లకు ఆర్జిత సెలవులు అనుమతిస్తారు. 4.12.2016 తర్వాత ఉద్యోగం చేస్తూ మరణించిన ఆర్టిజన్ల కుటుంబసభ్యుల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తారు. అలా మరణించినవారికి అంత్యక్రియల కోసం రూ.20 వేల చొప్పున చెల్లిస్తారు. వచ్చే వేతనసవరణ నుంచి ఆర్టిజన్లకు వేతన సవరణ అమలుచేస్తారు. 13 అంశాలను పేర్కొంటూ.. ఉత్తర్వులిచ్చారు.

### గ్రేడ్-1 కార్మికులకు రూ.30 వేలు

ఉన్న వేతనాలను సవరించి ఇతర అలవెన్సులను కలుపడంతో ఆర్టిజన్ల వేతనాలు భారీగా పెరిగాయి. 1.10.2019 నుంచి కొత్త బేసిక్‌పే కూడా ఈ ఉత్తర్వుల్లో నిర్ధారించారు. గ్రేడ్-1 కార్మికులకు ఇకపై రూ.29,743 , గ్రేడ్-2 ఆర్టిజన్లకు రూ.25,042, గ్రేడ్-3కి రూ.21,719, గ్రేడ్-4కు రూ.19,548 స్థూల వేతనంగా లభించనున్నది. ఇందులో డీఏ 8.866%, హెచ్ఆర్ఏ 30%, కన్వీనియెన్స్ అలవెన్స్, మెడికల్, కార్పొరేట్, సీసీఏ పర్సనల్ పే తదితరాలన్నింటినీ పొందుపర్చారు.

# కృత్రిమ మేధస్సు అభివృద్ధిలో ఐఐటీ



చిప్ రూపకల్పనలో ఐఐటీ హైదరాబాద్ పరిశోధకులు

- లో పవర్ చిప్‌ల తయారీలో ముందడుగు

**సంగారెడ్డి చౌరస్తా:** డిజిటల్ ఇండియా వంటి అనేక సాంకేతిక కార్యక్రమాల్లో కీలకపాత్ర వహిస్తున్న కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అభివృద్ధిలో ఐఐటీ హైదరాబాద్ పరిశోధకులు ముందడుగు వేశారు. సమాచార నిర్వహణతోపాటు ఆ సమాచారాన్ని నిల్వ చేసేందుకు పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా కృత్రిమ మేధస్సు యంత్రాలను డిజైన్ చేసేందుకు తక్కువశక్తి కలిగిన చిప్‌లను అభివృద్ధిపరిచారు. అంకగణిత సర్క్యూట్లకు సంబంధించి మాగ్నెటిక్ క్వాంటమ్-డాట్ సెల్యూలార్ ఆటోమెటా (ఎంక్యూసీఏ) ఆధారిత నానో మాగ్నెటిక్ లాజిక్ ఆర్కిటెక్చరల్ డిజైన్ మెథడాలజీని రూపొందించారు. అతి తక్కువశక్తి పోర్టబిలిటీ కలిగిన కృత్రిమ మేధస్సు అనువర్తనాలపై ఐఐటీ పరిశోధకులు దృష్టిసారించారు. ముఖ్యంగా ప్రసంగం, ముఖ గుర్తింపు, రిమోట్ హెల్త్ వంటి ఆధునిక వ్యవస్థలకు అధికగణన శక్తి, న్యూరల్ నెట్‌వర్క్‌లు చాలా అవసరం. చేతితో పట్టుకునే పరికరాల్లో ఇలాంటి గణనలను చేయడం ఆచరించేందుకు సరళంగా ఉండేది కాదు. ఈ నేపథ్యంలో పరిశోధకులు లోపవర్ చిప్‌లను అభివృద్ధి చేశారు. వచ్చేతరం రీబూటింగ్ కంప్యూటింగ్ ప్లాట్‌ఫామ్ కోసం ఎంక్యూసీఏ ఆధారిత నానో మాగ్నెటిక్ లాజిక్ ఆర్కిటెక్చరల్ డిజైన్ల పరిశోధన చేపట్టామని ఐఐటీ పరిశోధకులు అసోసియేట్ ప్రొఫెసర్, డాక్టర్ అమిత్ ఆచార్య, పీహెచ్‌డీ స్కాలర్ సంతోష్ శివసుబ్రమణి, డాక్టర్ చంద్రజిత్‌పాల్ పేర్కొన్నారు.




**Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office:** Commercial Complex II, Sector - 49-50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; **Website:** www.honda2wheelersindia.com; **Customer Care:** customercare@honda2wheelersindia.com

^Conditions apply, Rs 8,900 Savings calculated against the general market finance scheme considering the certain loan amount & may vary on the actual condition. ##Honda Joy Club Program is a paid loyalty program and only members can avail mentioned benefits with respect to program terms and conditions. For further details visit www.hondajoyclub.com or call 1800-532-2555 (Monday to Friday 9.30 am to 6.30 pm). #Benefits up to Rs 11,000 is the sum total of the savings on the finance scheme in row one and the Joy Club Benefits. *Rs 1,100 Low Down Payment Scheme is subject to financier policy and is available through preferred Finance partners at their sole discretion. ^^Paytm cashback offer is subject to Paytm and respective dealers terms and conditions at their sole discretion. +Contact your local HMSI dealership for details on EMI on leading credit & debit cards Powered by Pine Labs. The same is subject to availability at select dealerships. Multiple schemes & offers cannot be clubbed together, all the attached schemes and offers are applicable for a limited time period and can be withdrawn from the market without prior notice. All the schemes and offers are applicable on selected models or their variants. All the schemes and offers are available on selected dealerships. All disputes arising due to above shall be subject to exclusive jurisdiction of Gurugram, Haryana. Product shown in the picture may vary from the actual product available in the market. Accessories shown in the picture are not a part of the standard fitment. **Conditions Apply.

**Honda Exclusive Authorized Dealerships: KARIMNAGAR:** Samrat Honda - 0878-2277299; 9441333665; Srikanth Honda - 0878-2224555, 7799946632; **KARIMNAGAR INTERCITY BRANCH, VAVILALA RAMREDDY NAGAR:** Samrat Honda - 0878 2954514; 9849252091; **JAGATIAL:** Samrat Honda - 9701200045, 9704500045; **HUZURABAD:** Samrat Honda - 8099979050; **SIRCILLA:** Srikanth Honda - 08723-233336, 7799700245; **VEMULAWADA:** Srikanth Honda - 9177662757; **METPALLY:** Saanvi Honda - 9581295818; **JAMMIKUNTA:** Srikanth Honda - 7799700263; **HUSANABAD:** Laxmi Honda - 08019138142; **RAMAGUNDAM:** Sai Ram Krishna Honda - 8100779999; **PEDDAPALLY:** Sairam Krishna Honda - 9100044414; **SULTANABAD:** Aradhana Honda - 9849885862; **DHARMARAM:** Sairam Honda - 7799146669; 08728-270950; **MANCHERIAL:** Jagadamba Honda - 08736-259303, 9849113133; **BELLAMPALLY:** Thirumala Honda - 08735225975; 9059979909; **ASIFABAD:** Jagadamba Honda - 9849113133; **KAGAZNAGAR:** Jagadamba Honda - 9849113133; **ADILABAD:** Sree Mahalakshmi Honda - 9010977757; **NIRMAL:** Sree Mahalakshmi Honda - 9010977757; **KHANAPUR:** Sri Ganesh Honda - 9010977757; **BHAINSA:** Sree Mahalakshmi Honda - 9010977757; **ICHODA:** Sree Mahalakshmi Honda - 9010977757; **UTNOOR:** Mahalakshmi Motors - 9010977757; **BOATH:** Ajay Motors - 9010977757; **ADILABAD INTERCITY NEAR BUSSTAND:** Sree Mahalakshmi Honda - 9010977757; **NIZAMABAD:** Sairam Honda - 243434, 9052116500; Sai SRK Honda - 08462- 239966, 7095911666, **KAMAREDDY:** Sairam Honda - 220034, 9951426969; **BODHAN:** Sairam Honda - 225588, 8886022883; **ARMOOR:** Sairam Honda - 9052416222; **BANASWADA:** Sai Srk Honda - 9908393269; **BHEEMAGAL:** Druva Honda - 08463238888, 9912151515; **PITLAM:** Sai Krishna Honda - 08466-271372, 9949812751; **BALKONDA:** Sai SRK Honda - 9666887700; **YELLAREDDY:** Mahalaxmi Honda - 9948313766; **DICHPALLY:** Sairam Honda - 9154166343; **NANDIPET:** Sairam Honda - 9052112384; **WARANGAL:** Nagarjuna Honda - 9704377444, 9000477444; Borra Honda - 9849486292, 9100441821; **HANAMKONDA:** Sri Srinivasa Honda - 0870-2531111, 8374357999; **STATION GHANPUR:** Sri Srinivasa Honda - 8143498979; **JANGAON:** Sri Srinivasa Honda - 9951203333, 8340042555; **MAHABUBABAD:** Nagarjuna Honda - 9441933789; **BHUPALPALLY:** Nagarjuna Honda - 9052190444; **THORRUR:** Gajalakshmi Honda - 9441770871; **PARKAL:** Sri Sai Honda - 8686477444, 8341776222; **NARSAMPET:** Sneha Honda - 08718-231310, 9393982174; **NAIMNAGAR:** Sri Srinivasa Honda - 9160414222; **CHERYAL:** Sri Vigneshwara Honda - 8464806750, 9550697460; **MULUGU:** Borra Honda - 9100441825, 8803912345; **ETTURNAGARAM:** Taj Honda - 9441933582.
**For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com**



నోబెల్ పురస్కారాన్ని అందుకున్నందుకు అభిజిత్ బెనర్జీనిని నేను అభినందిస్తున్నాను. కానీ మీకందరికి ఆయన ఆలోచనా విధానం గురించి తెలుసు. అతని ఆలోచనావిధానం వామపక్ష భావజాలం. న్యాయ్ పథకంపై ఆయన భారీ ప్రశంసలు కురిపించారు. కానీ దేశ ప్రజలంతా ఆయన ఆలోచనావిధానాన్ని తిరస్కరించారు.

**పీయూష్ గోయల్, కేంద్రమంత్రి**

అభిజిత్ బెనర్జీ వామపక్ష భావాలున్న వ్యక్తి. అయితే అది నేరమా! ప్రభుత్వం పేదల పట్ల మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలకు మాత్రం పన్ను రద్దు చేశారు. ప్రభుత్వం పేదలపక్షాన నిలువాలి కదా, ఎవరి పక్షాన ఉన్నదో తెలిసిపోతూనే ఉన్నది. పేదలు ఎవరూ పట్టించుకోని అనాథలయ్యారు.

**కపిల్ సిబల్, సీనియర్ కాంగ్రెస్ నేత**



**చరిత్రలో నేడు**



**1998**
ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూతో శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకున్న యాసర్ అరాఫత్.

**2001**
ఐపాడ్‌ను విడుదల చేసిన ఆపిల్ కంపెనీ.





**2018**
ప్రపంచంలోనే అతిపొడవైన వంతెన హాంకాంగ్ 'మకువా జూహై' వంతెనను ప్రారంభించిన జిన్‌పింగ్.

నేపాల్‌లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ఫీజు మరింత పెంచాలని ప్రైవేట్ వైద్య కళాశాలలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ కళాశాలల యాజమాన్యాల విజ్ఞప్తి మేరకు ఇప్పటికే ఫీజులు పెంచినప్పటికీ అవి సరిపోవని అంటున్నారు. వైద్య కళాశాలలు పాత ఫీజుతోనే 65 శాతం లాభాలు పొందుతున్నాయని ఒక కమిటీ వెల్లడించింది. వైద్య కళాశాలలు మానవుల ప్రాణాలకు సంబంధించినవి. ఈ వృత్తిని సామాజిక సేవగా భావించాలే తప్ప వ్యాపారంగా కాదు. ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టి లబ్ధి పొందడానికి ప్రయత్నించకూడదు.

**ది హిమాలయన్ టైమ్స్**

ఢాకా నీటి సరఫరా, మురుగునీటి పారుదల సంస్థ (డ్వాసా)ను నిలదీసినందుకు పార్లమెంటరీ స్థాయీ సంఘాన్ని అభినందించాలె. ఈ సంస్థ వైఫల్యంపై ఎంతో కాలంగా విమర్శలున్నాయి. నగరం రహదారులపై మురికి నీరు ప్రవహిస్తుంటుంది. మరోవైపు ప్రజలకు మంచినీళ్లను సరఫరా చేయడం లేదు. 90 శాతానికి పైగా ఢాకా వాసులు నీటిని వేడి చేసుకొని తాగవలసి వస్తున్నదని, ఇందు వల్ల ఏటా 332 కోట్ల సహజవాయువు ఉపయోగించవలసి వస్తున్నదని ఒక సంస్థ వెల్లడించడంతో ఈ అంశం ముందుకు వచ్చింది. ఇప్పటికైనా సంస్థ జవాబుదారీగా ఉండటట్టు చూడాలె.

**ది డైలీ స్టార్**



# ఎదురులేని భారత్

క్రికెట్ క్రీడారంగంలో అవినీతిని రాజకీయ జోక్యాన్ని అంతమొందించి, పాలక వ్యవస్థను ప్రక్షాళన చేయాలని సుప్రీంకోర్టు చొరవతో పెద్ద ప్రయత్నమే జరిగింది. అయినా రాజకీయ జోక్యం అంతం కావడం లేదు. క్రికెట్ పాలక మండలి ఎట్లా ఉన్నా ఆటగాళ్ళు మాత్రం వచ్చిన అవకాశాలను ఉపయోగించుకొని దేశం పేరు నిలబెడుతున్నారు. ఆరేండ్ల నుంచి టెస్టుల్లో టీమ్ఇండియా సాధిస్తున్న వరుస విజయాలే దీనికి తార్కాణం. కొద్దికాలంగా భారత క్రికెట్ జట్టు సొంత ఇలాఖాలో ఫార్మాట్ ఏదైనా ప్రత్యర్థి ఎవరైనా గెలుపే లక్ష్యంగా విజయాలు సాధిస్తుండటం విశేషం. 2012లో ఇంగ్లండ్ చేతిలో టెస్టు సిరీస్ ఓటమి తర్వాత భారత్ వెనుదిరిగి చూసింది లేదు. ధోనీ, విరాట్ కోహ్లీ నాయకత్వంలో వరుసగా 11 టెస్టు సిరీస్‌లను గెలిచి సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఫ్రీడమ్ సిరీస్‌లో భాగంగా దక్షిణాఫ్రికాతో మూడు మ్యాచ్‌లను క్లీన్‌స్వీప్ చేయడం ద్వారా కోహ్లీ సేన కొత్త చరిత్ర సృష్టించింది. సఫారీలను తొలిసారి తుడిచిపెట్టిన అరుదైన రికార్డును టీమ్ఇండియా అందుకుంది. ఇలా దక్షిణాఫ్రికాపై పూర్తి ఆధిపత్యం చెలాయించిన భారత్ ప్రస్తుత ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో ఎవరికీ అందనంత రీతిలో 'టాప్' గేర్‌లో దూసుకుపోతున్నది. ఐసీసీ నూతనంగా ప్రవేశపెట్టిన టెస్టు చాంపియన్‌షిప్ మొదలు పెట్టినప్పటి నుంచి ఓటమి ఎరుగని కోహ్లీ సేన ప్రత్యర్థి జట్లకు సింహస్వప్నంలా మారింది.

గతేడాది తమకు ఎదురైన పరాజయానికి కోహ్లీసేన ప్రతీకారం తీర్చుకుంది. స్పిన్‌కు పెట్టని కోట లాంటి స్వదేశీ పిచ్‌లపై స్పిన్, పేస్ మేళవింపుతో దక్షిణాఫ్రికాను కోలుకోలేని దెబ్బకొట్టారు. ఏబీ డివిలీయర్స్, హషీమ్ ఆమ్లా, స్టెయిన్ లాంటి దిగ్గజాల గైర్హాజరీలో యువ క్రికెటర్లతో భారత పర్యటనకు వచ్చిన దక్షిణాఫ్రికా స్థాయికి తగ్గ ఆటతీరును కనబరుచలేకపోయింది. విశాఖపట్నంలో మొదలైన మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భారత్ అదిరిపోయే బోణీ కొట్టింది. టెస్టుల్లో తొలిసారి ఓపెనర్‌గా అడుగుపెట్టిన హిట్‌మ్యాన్ రోహిత్‌శర్మ అద్భుతంగా ఆడి వరుసగా రెండు ఇన్నింగ్స్‌లో రెండు సెంచరీలు సాధించాడు. ఇతడికి మయాంక్ అగర్వాల్ డబుల్ సెంచరీ తోడవ్వడంతో సఫారీలు చేష్టలు డిగిపోయారు. ఓవైపు భారీ స్కోర్లు బాదేస్తే తామేం తక్కువ కాదన్నట్లు బౌలర్లు విజృంభించడంతో కోహ్లీసేన గెలుపు నల్లేరుపై నడకే అయ్యింది. తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లతో అశ్విన్ దెబ్బకొడితే మలి ఇన్నింగ్స్‌లో షమీ పాంచ్ పటాకాతో సఫారీల ఓటమిని శాసించాడు. వైజాగ్ విజయమిచ్చిన ఆత్మవిశ్వాసంతో పుణె బరిలో దిగిన భారత్ ఇన్నింగ్స్ విజయంతో సిరీస్‌ను ఖాతాలో వేసుకుంది. తనదైన ఫామ్‌ను కొనసాగిస్తూ మయాంక్ అగర్వాల్ సెంచరీతో ఆకట్టుకోగా, కెప్టెన్ విరాట్ కోహ్లీ ఏడో డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. పిచ్ పరిస్థితులను సద్వినియోగం చేసుకుంటూ అటు స్పిన్నర్లు, పేసర్లు ముప్పేట దాడికి పాల్పడటంతో సఫారీల దగ్గర సరైన సమాధానం లేకపోయింది. రోహిత్ డబుల్ సెంచరీకి తోడు రహానే శతకంతో నాలుగు వందల పైచిలుకు స్కోరు చేసిన టీమ్ఇండియా రెండు ఇన్నింగ్స్‌లో సఫారీలను స్వల్ప స్కోర్లకే పరిమితం చేసింది. ఉమేశ్, షమీ పేస్ ద్వయానికి షాబాజ్ నదీమ్, అశ్విన్, జడేజా స్పిన్ త్రయం చెలరేగడంతో నాలుగు రోజుల్లోనే భారత్ 'రాంచీ'ని దక్కించుకుని ఫ్రీడమ్ సిరీస్‌ను సగర్వంగా అందుకుంది.

> **బ్యాటింగ్, బౌలింగ్ వరకే పరిమితం కాకుండా కండ్లు చెదిరే ఫీల్డింగ్‌తో ప్రత్యర్థికి మనోళ్లు దడపుట్టించారు. ప్రస్తుత భారత బౌలింగ్ దళం ఒకప్పటి వెస్టిండీస్‌ను గుర్తుకు తెస్తుందంటూ దిగ్గజ క్రికెటర్ బ్రియాన్ లారా అన్నాడంటే మనోళ్ల ప్రదర్శన ఎలా ఉందో తెలుస్తుంది. రానున్న సిరీస్‌ల్లోనూ ఇదే దూకుడు కొనసాగిస్తూ భారత్ అప్రతిహత విజయాలతో దూసుకెళ్లాలని ఆశిద్దాం. అర్హులకు అవకాశాలు కల్పించి ప్రోత్సహిస్తే, మన దేశం నుంచి అనేక మంది మెరికల్లాంటి ఆటగాళ్ళు పుట్టకొస్తారనడానికి ఈ వరుస విజయాలే నిదర్శనం.**

మొత్తంగా భారత జట్టు ప్రదర్శన చూస్తే ఫార్మాట్ ఫార్మాట్‌కు స్పష్టమైన తేడా కనిపిస్తున్నది. పరిమిత ఓవర్ల ఫార్మాట్‌లో కుర్రాళ్లకు చాన్స్ ఇస్తూ వస్తున్న సెలెక్టర్లు టెస్టులో అనుభవానికి పెద్ద పీట వేస్తూ దేశవాళీలో నిలకడగా రాణిస్తున్న వారికి అవకాశం ఇవ్వడం కలిసి వస్తున్నది. దక్షిణాఫ్రికాతో టెస్టు సిరీస్ ద్వారా ఇన్నాళ్లు సందిగ్ధంలో ఉన్న ఓపెనింగ్ సమస్య తీరడంతో పాటు సీనియర్ వృద్ధిమాన్ సాహా రూపంలో వికెట్ కీపింగ్ గాడిలో పడింది. దీనికితోడు జట్టులో ప్రతి ఒక్క ఆటగాడు పరిస్థితులకు అనుగుణంగా తమ ఆటతీరును మార్చుకుంటూ రాణించడం మన వరుస విజయాలకు కారణమని చెప్పొచ్చు. అందివచ్చిన అవకశాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుంటూ జట్టు విజయాల్లో పాలుపంచుకోవడం మన ఆటతీరుకు అద్దం పడుతున్నది. బ్యాటింగ్‌లో మయాంక్ అగర్వాల్, రోహిత్ శర్మ, కోహ్లీ శతకాలతో చెలరేగితే బౌలర్ల సమిష్టి ప్రదర్శన టీమ్ఇండియాను పైచేయిలో నిలిపింది. సిరీస్ మొత్తంగా చూస్తే మనోళ్లు ఒక్కసారి కూడా ఆలౌట్ కాకపోవడం మన బ్యాటింగ్ బలమేంటో చాటిచెబుతున్నది. గతంలో ఎన్నడూలేని విధంగా స్వదేశీ పిచ్‌లపై స్పిన్నర్లకే కాక పేసర్లు విజృంభించడం బౌలింగ్ బలాన్ని తెలియజేస్తున్నది. బ్యాటింగ్, బౌలింగ్ వరకే పరిమితం కాకుండా కండ్లు చెదిరే ఫీల్డింగ్‌తో ప్రత్యర్థికి మనోళ్లు దడపుట్టించారు. ప్రస్తుత భారత బౌలింగ్ దళం ఒకప్పటి వెస్టిండీస్‌ను గుర్తుకు తెస్తుందంటూ దిగ్గజ క్రికెటర్ బ్రియాన్ లారా అన్నాడంటే మనోళ్ల ప్రదర్శన ఎలా ఉందో తెలుస్తుంది. రానున్న సిరీస్‌ల్లోనూ ఇదే దూకుడు కొనసాగిస్తూ భారత్ అప్రతిహత విజయాలతో దూసుకెళ్లాలని ఆశిద్దాం. అర్హులకు అవకాశాలు కల్పించి ప్రోత్సహిస్తే, మన దేశం నుంచి అనేక మంది మెరికల్లాంటి ఆటగాళ్ళు పుట్టకొస్తారనడానికి ఈ వరుస విజయాలే నిదర్శనం.

## జనగళం

### అవగాహన కల్పించాలి

ఇటీవల పడిన వానలకు గ్రామాల్లో, మున్సిపాలిటీ ప్రాంతాల్లోని పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. వాన నీళ్లు ఎక్కువగా నిల్వటం వల్ల వాటిపై దోమలు వాలుతున్నాయి. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోకపోతే వ్యాధుల బారిన పడుతాం. దీని గురించి అవగాహన కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన జాగ్రత్తలు ప్రజలకు సూచించింది. అయితే ఆరోగ్యశాఖ కూడా అప్రమత్తమై జ్వరాలు రాకుండా ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేయాలి. క్రమం తప్పకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లాలి. ఫాగింగ్ ద్వారా దోమలను నివారించాలి. ప్రజలు కూడా అన్నీ ప్రభుత్వమే చేయాలనుకోకుండా తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

**-షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్**

### నిబంధనలు అతిక్రమిస్తున్నారు

రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్నారు. ఫ్రీ లెఫ్ట్ ఉన్న చోట కూడా ఆ ప్రాంతాన్ని బ్లాక్ చేస్తున్నారు. దీనివల్ల ట్రాఫిక్ సమస్య ఎక్కువ అవుతున్నది. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వారిపై భారీ జరిమానా విధిస్తామన్న హెచ్చరికలను చాలామంది వాహనదారులు సీరియస్‌గా పట్టించుకోవడం లేదు. ఇలాంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలి.

**-పి. రాజేందర్, పెద్దపల్లి**

### నిత్యం తనిఖీలు చేయాలి

హోటళ్లలో మిగిలిన పదార్థాలను తిరిగి ఫ్రై చేసి వినియోగదారులకు సప్లై చేస్తున్నారనే వార్తలు కలరపెడుతున్నాయి. ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే ఇలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దు. అధికారులు ఈ విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నా హోటల్ యజమానుల తీరు మారకపోవడం దారుణం. ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే ఇలాంటి చర్యలను సీరియస్‌గా తీసుకోవాలి. క్రమం తప్పకుండా హోటళ్లను తనిఖీ చేయాలి.

**- జి. అశోక్‌రెడ్డి, హైదరాబాద్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

**జాతీయం**



**మానస్ ఫిరఖ్ భట్టాచార్జీ**

# మనుషుల ఉనికి ప్రశ్నార్థకం

రక్తపాతం లేకుండానే మనుషులను హత్యచేసే వివక్ష అనే గొప్ప సామాజిక ఆయుధాన్ని సమాజం కనుగొన్నది.
**-హన్నా అరెంట్ ('మేం శరణార్థులం' జనవరి 1943)**

అస్సాంలోని విదేశీ ట్రిబ్యునల్ 65 ఏండ్ల దులాల్ చంద్రపాల్‌ను చట్టవిరుద్ధ నివాసిగా ప్రకటించింది. అనారోగ్య కారణాలతో గౌహతి మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో 2019 సెప్టెంబర్ 28న చేరి, ఆరోగ్యం క్షీణించి 2019 అక్టోబర్ 13న చనిపోయాడు. పాల్ రెండేండ్లుగా అస్సాంలోని నిర్బంధ శిబిరంలో ఉన్నాడు. దులాల్ లాగానే అస్సాంలోని ఆరు నిర్బంధ శిబిరాల్లో వెయ్యిమంది చట్టవిరుద్ధ విదేశీయులుగా ఉంచబడినారు. ఈ నిర్బంధ శిబిరాల్లో గత మూడేండ్లలో 24 మంది చనిపోయారు. ఈ మరణాలకు అనారోగ్యమే కారణమని చెప్పుకొస్తున్నారు. నిజానికి ఈ మరణాలకు అనారోగ్యమే కారణమని చెప్పలేం. అనారోగ్యం అనేది సహజ కారణం. కానీ నిర్బంధ శిబిరాల్లో అనారోగ్యం అనేది ఈ మరణాలకు సహజ కారణం ఎంత మాత్రం కాదు. నేడు అస్సాంలో 'విదేశీయుడు' అనేదే సహజం కాదు. ఇది ఇప్పుడు ఒక రాజకీయ, న్యాయబద్ధ విషయమైపోయింది. అస్సాంలో 1979 నుంచి విదేశీ వ్యతిరేక ఉద్యమం ప్రారంభమైనప్పటి నుంచి విదేశీ అనేది ఒక రాజకీయ ఆరోపణగా స్థిరపడిపోయింది. అస్సాంలో విదేశీ అంటే పౌరసత్వంలేని రాజకీయ న్యాయసమ్మతి లేని ఉనికి అని అర్థం. ఎప్పుడైతే పౌరసత్వం అనేది సందిగ్ధంలో పడిపోతుందో, విదేశీ అనేది ముందుకు వచ్చి, న్యాయసంబంధ సంక్షోభంగా మారిపోతుంది.

ఒక వ్యక్తి విదేశీగా ముద్రపడి నిర్బంధ శిబిరాల్లోకి చేరిన తర్వాత అది నైతిక సంబంధ విషయంగా మారిపోతున్నది. ఎప్పుడైతే ఒక వ్యక్తి సహజహక్కులకు దూరం చేయబడుతాడో అతని ఆస్తి, స్వేచ్ఛ, జీవితం అగమ్యగోచరమవుతుంది. ఈ క్రమంలో అతను సర్వం కోల్పోవటంతో పాటు అన్నిహక్కులకు దూరమై మనుగడనే ప్రశ్నార్థకం అవుతుంది. దులాల్ ఎప్పుడైతే విదేశీయుడుగా తేల్చబడ్డాడో, అప్పడు అతను రాజకీయంగా అన్నిహక్కులకు దూరమయ్యాడు. దులాల్ చట్టవ్యతిరేక విదేశీయుడుగా ముద్రపడ్డాడో, దేశం విడిచి వెళ్లేదాకా అతడు నిర్బంధ శిబిరంలో ఉండటానికే అర్హుడయ్యాడు. హన్నా అరెంట్ ప్రకారం.. ఒక వ్యక్తి పౌరసత్వానికి దూరం చేయబడితే అతను అన్నిరకాల మానవ హక్కుల నుంచి దూరం చేయబడుతాడు. ఒకవేళ నీవు నిర్దిష్ట సమాజంలో పౌరుడవు కావని తేలితే, సంబంధిత రాజ్యాంగం నిన్ను చట్టపరంగా మనిషిగానే గుర్తించదు. పౌరసత్వంలేని మనిషి ఇంకెంత మాత్రం చట్టబద్ధ మనిషిగా పరిగణింపబడజాలడు. దులాల్ ఈ క్రమంలోంచే చట్టసమ్మతి, గుర్తింపులేని మనిషిగా నిర్బంధ శిబిరంలోకి నెట్టబడినాడు. అప్పుడతడు విభిన్న జాతిగా పరిగణింపబడ్డాడు, అదే చట్టవ్యతిరేక విదేశీయుడు.

ఈ నిర్బంధ శిబిరాల్లో అక్కడ మనుషులు మరొక విభిన్న జీవజాతిగా పరిగణింపబడుతున్నారు. అన్నిరకాల చట్టాలకు దూరం చేయబడి పౌరసత్వ రక్షణల నుంచి దూరంగా విసిరివేయబడినారు. దులాల్ అల్లుడు సాధన్ పాల్, అతని కుటుంబసభ్యులు కూడా జాతీయ పౌర రిజిస్టర్‌లో పేర్లు నమోదు కాక నిర్బంధ శిబిరాలకు చేరారు. ఆయన ముగ్గురు కొడుకులు పౌర రిజిస్టర్‌లో పేర్లు ఉండటంతో వారు ఈ ఏడాది ఆగస్టు 31న విడుదలయ్యారు. దీన్నిబట్టి పౌరుల జాతీయత, పౌరసత్వాన్ని నిర్ధారించటంలో, విదేశీయులుగా గుర్తించటంలో కచ్చితమైన నియమ నిబంధనలులేక వివక్షకు గురయ్యారని అర్థం అవుతున్నది. అస్సాంలో ఒక కుటుంబంలోనే పౌరసత్వ చట్ట సమ్మతిని నిర్ధారించటంలో పూర్తిగా అన్యాయపూరితమైన కృత్రిమత్వాన్ని పాటించారని తేలిపోతున్నది.

దులాల్ కుటుంబ ఉదంతం అస్సాంలో చేపట్టిన పౌరపట్టిక ప్రక్రియ ఎంతటి చిక్కుముడిగా ఉన్నదో, ఎంతటి అనైతిక విధానమో తేటతెల్లం చేస్తున్నది. దులాల్ కుటుంబసభ్యులు చట్టపరంగా తలెత్తే సమస్యలను, ప్రశ్నల నుంచి తప్పించుకోవటానికి అతని శవాన్ని కూడా తీసుకోవటానికి నిరాకరించారు. దులాల్ కుటుంబసభ్యుడైన సాధన్‌పాల్ 'హిందుస్థాన్ టైమ్స్'తో మాట్లాడుతూ ఒక చట్ట వ్యతిరేక వ్యక్తి శవాన్ని మేం ఎలా తీసుకోగలమని వాపోయాడు. దులాల్ భారత పౌరుడినే అని చెప్పే పత్రాలను చూపిన తర్వాత కూడా విదేశీయుడిగా పరిగణింపబడిన ఉదంతాన్ని చెప్పుకొచ్చాడు. ఒకరకంగా దులాల్ కుటుంబసభ్యుల నిర్ణయం మన ప్రభుత్వ అధికారులకు, చేపడుతున్న విధానాలకు జవాబుగా భావించవచ్చు. దీంతోనైనా మన విధానకర్తలకు కనువిప్పు కలుగాలి.

దులాల్ పార్థివ శరీరాన్ని అవసరమైన పత్రాలపై సంతకాలు చేసి కుటుంబసభ్యులు తీసుకోవాలని అధికారులు కోరారు. అప్పుడు వారు విదేశీయుడుగా గుర్తింపబడిన వ్యక్తిని తమ వాడిగా ఒప్పుకొని అతని శవాన్ని తీసుకుంటే తాము కూడా న్యాయసంబంధమైన చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తుందని కుటుంబసభ్యులు భయపడ్డారు. ఎప్పుడైతే విదేశీయుడుగా ముద్రపడుతాడో అతన్ని ఎవరూ తమవానిగా ఒప్పుకునే పరిస్థితి ఉండదు. ఎందుకంటే వారి పౌరసత్వం, ఉనికి కూడా అప్పుడు ప్రశ్నార్థకంగా మారిపోతుంది. సోనిత్‌పూర్ జిల్లా డిప్యూటీ కమిషనర్ మానవేంద్ర ప్రతాప్ సింగ్ చెప్పిన దాని ప్రకారం.. దులాల్ అక్కడి స్థానికుడు. అతడు అతని కుటుంబసభ్యులతో స్థానికంగా నివసించాడు. కానీ అతను భారత పౌరుడు కాదని తేలిన తర్వాత అతని దహన సంస్కారాలు కూడా జరిపించలేమని తేల్చి చెప్పటం గమనార్హం. కానీ అతని కుటుంబం అతని శవాన్ని తీసుకోవాల్సిన అవసరం ఉండిందని చెప్పుకురావటం గమనించదగినది. ఇప్పుడు దులాల్ శవం కుటుంబం, రాష్ట్ర ప్రభుత్వం మధ్య న్యాయపరమైన చిక్కు సమస్యల మధ్య చిక్కుకొని ఉన్నది. ఎవరూ అతని శరీరాన్ని తీసుకోవటానికి ముందుకు రావటం లేదు. ఇది.. ఎన్ఆర్‌సీ పేరట పౌరసత్వాన్ని నిర్ధారిస్తూ, విదేశీయులను గుర్తించే ప్రక్రియతో ప్రభుత్వాలు చేపట్టిన చర్యల కారణంగా తలెత్తిన మానవీయతకు సంబంధించిన సంక్లిష్ట సంక్షుభిత సమస్య.

> ఇప్పుడు దులాల్ కూడా దేశంలేని మనిషి అయిపోయాడు. మతిలేని పౌరసత్వ నిరూపణ పర్వంలో ఎంతోమంది మనుషులు తమ ఉనికి ప్రశ్నార్థకమై నరకం అనుభవిస్తున్నారు. మానసికంగా కుంగిపోయి రోగగ్రస్తులవుతున్నారు. సరిహద్దుల పేరిట మనుషుల ఉనికి ప్రశ్నార్థకం అవుతున్న దుస్థితి నుంచి బయటపడే మార్గం ఏమీ లేదా? పౌరగణన పేరుతో దేశంలో మనుషుల్లో అనిశ్చితిని సృష్టించటం కన్నా ఉత్తమమైన మార్గం మరొకటి అనుసరించాలి.

ఈ వైపరీత్యం కారణంగా జాతీయ సరిహద్దుల లోపల పౌరుల జననాన్ని కూడా సందిగ్ధంలో పడేసింది. పౌరసత్వ గుర్తింపుకు అవసరమైన పత్రాలు లేని వారు మనుషులుగా గుర్తింపబడని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో సరిహద్దులు అనేవి మానవుల సహజ హక్కులు, నైతికతలను బలి తీసుకుంటాయా? నైతిక మానవహక్కుల దృక్పథం ప్రశ్నార్థకం చేయటం సరైనదేనా అన్నది ప్రధానమైనది.

సోనిపూర్ పోలీస్ సూపరింటెండెంట్ చెప్పిన దాని ప్రకారం దులాల్ పౌరసత్వ విషయం కోర్టుకు సంబంధించిన విషయం. కానీ దులాల్ కుటుంబం అతని శవాన్ని తీసుకొని దహన సంస్కారాలు చేయవలసిన అవసరం ఉన్నదని తేల్చిచెప్పాడు. చట్టపరంగా అతన్ని అతని కుటుంబ సభ్యులకు అప్పచెప్పటం జరిగింది. వారు దాన్ని స్వీకరించటం వారి నైతిక బాధ్యత. ఇక్కడే నైతికత, చట్టం మధ్య వైరుధ్యం ఉన్నది. ప్రభుత్వం అతన్ని బతికి ఉన్నప్పుడు గుర్తించి చట్టవిరుద్ధమైన వ్యక్తిగా నిర్బంధించింది. కుటుంబం మాత్రం చనిపోయిన తర్వాత అతని శవానికి బాధ్యత వహించాలి. దులాల్ సోనిత్‌పూర్ జిల్లాలోని ధేకియాజులి ప్రాంతానికి చెందిన వాడని ఎక్కడా అతనికి సంబంధించిన పత్రాలలో ప్రస్తావించలేదు. ఇక్కడే సంక్లిష్టత ఉన్నది. అతను బతికి ఉన్నప్పుడు నిర్దిష్ట ప్రాంతంలో ఉన్నాడన్న విషయాన్ని ప్రస్తావించకపోవటమే అసలు సమస్య. అతను ఏప్రాంతానికి చెందిన వాడన్నది ఎవరు చెప్పాలి? అతనికి ఏ విధమైన మానవ సహజ హక్కులు లేవా? ఒక వ్యక్తి పౌరసత్వ నిరూపణ పత్రాలు లేక విదేశీయుడిగా ముద్రపడితే అతని ఉనికే ప్రశ్నార్థకం కావటం ఎంత దారుణం. అతని కుటుంబ సభ్యులు దులాల్ కొంతకాలంగా మానసికంగా సరైన స్థితిలో లేడని చెబుతున్నారు. మానసికంగా ఆరోగ్యంగాలేని వ్యక్తిని ఎలా నిర్బంధించారు? ఒక వ్యక్తిని నాలుగుగోడల మధ్య నిర్బంధించిన తర్వాత అతని మానసిక ఆరోగ్యం గురించి ఎవరు పట్టించుకోవాలి? అనారోగ్య, మానసిక సమస్యలతో నిర్బంధ శిబిరాల్లో చనిపోతున్న వారి విషయాన్ని ఏవిధంగా చూడాలి. వీటి గురించి ఎవరు పట్టించుకోవాలన్నదే ఇప్పటి సమస్య.

ప్రఖ్యాత కథా రచయిత సాదత్ హసన్ మంటో రెండు సరిహద్దు ప్రాంతాల మధ్య పేరు లేని మనిషి మరణం గురించీ, అతని దైన్య స్థితి గురించి ఓ అద్భుత కథ రాశాడు. సరిగ్గా దులాల్ విషయంలో అదే జరుగుతున్నది. ఇప్పుడు దులాల్ కూడా దేశంలేని మనిషి అయిపోయాడు. మతిలేని పౌరసత్వ నిరూపణ పర్వంలో ఎంతోమంది మనుషులు తమ ఉనికి ప్రశ్నార్థకమై నరకం అనుభవిస్తున్నారు. మానసికంగా కుంగిపోయి రోగగ్రస్తులవుతున్నారు. సరిహద్దుల పేరిట మనుషుల ఉనికి ప్రశ్నార్థకం అవుతున్న దుస్థితి నుంచి బయటపడే మార్గం ఏమీ లేదా? పౌరగణన పేరుతో దేశంలో మనుషుల్లో అనిశ్చితిని సృష్టించటం కన్నా ఉత్తమమైన మార్గం మరొకటి అనుసరించాలి.

**(వ్యాసకర్త: రచయిత, 'లుకింగ్ ఫర్ ద నేషన్-టువార్డ్స్ అనదర్ ఐడియా ఆఫ్ ఇండియా' పుస్తక రచయిత)**

('ది వైర్' సౌజన్యంతో)

# మెరుగైన మత్స్య విధానం కావాలె

**విశ్లేషణ**



**పిట్టల రవీందర్**

దేశంలో మత్స్యపారిశ్రమ అభివృద్ధికి అవసరమైన మార్పులు, చేర్పులు తీసుకురావడం కోసం కేంద్ర ప్రభుత్వం పలు విధానపరమైన నిర్ణయాలను ప్రకటించింది. చేపల ఉత్పత్తిలో చైనా తర్వాత ప్రపంచంలోనే ద్వితీయ స్థానంలో నిలిచిన భారత్‌లో ప్రస్తుతం ఉన్న దేశీయ వార్షిక ఉత్పత్తి 12.61 మిలియన్ మెట్రిక్ టన్నుల(2017-18)నుంచి వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2020-21) నాటికి 15 మిలియన్ మెట్రిక్ టన్నులకు చేరుకోవాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నది. ఇందుకు అనుగుణంగానే కేంద్రం మత్స్యపరిశ్రమకు సంబంధించిన పలు కీలక నిర్ణయాలకు శ్రీకారం చుట్టింది. మత్స్యశాఖకు ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయడంతోపాటు, ఈ సంవత్సరం బడ్జెట్‌లో 804కోట్ల రూపాయల ప్రత్యేక నిధులను కేటాయించింది. వ్యవసాయరంగం మీద ఆధారపడిన రైతుల వార్షిక ఆదాయాన్ని రెట్టింపు చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా మత్స్యరంగం మీద ఆధారపడిన మత్స్యకారుల ఆదాయాన్ని కూడా రెట్టింపు చేయాలనే లక్ష్యాన్ని సాధించడానికి 'ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన' అనే ప్రత్యేక పథకాన్ని ఈ ఏడాది నుంచి అమలుచేయనున్నారు. అయితే ఈ ఆర్థిక సంవత్సరంతో కాలపరిమితిని పూర్తిచేసుకుంటున్న 'నీలి విప్లవం' పథకాన్ని కొనసాగించే విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇంకా స్పష్టత ఇవ్వాల్సి ఉన్నది.

అయితే దేశ మత్స్యపారిశ్రామికరంగం ఇటీవలికాలంలో అనేకమైన అవరోధాలనుఎదుర్కొంటున్నది. చేపల ఉత్పత్తిలో సింహభాగాన్ని జోడించే సముద్రజలాల చేపల ఉత్పత్తి గణనీయంగా పడిపోతున్నది. దీనికి తోడు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న 'ఆక్వాకల్చర్' రంగంలో మనదేశం ఇతర దేశాలతో పోటీపడలేకపోతున్నది. ఆక్వారంగంలో దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన ఆంధ్రప్రదేశ్ మినహా ఇతర రాష్ట్రాలలో ఆశించిన ప్రగతిని అందుకోలేకపోతున్నది.సముద్రజలాల నుంచి రోజురోజుకూ తగ్గుతున్న చేపల ఉత్పత్తి కారణంగా ఉపరితల జలవనరుల చేపల ఉత్పత్తిని పెంచుకునే లక్ష్యంతో ఈ రంగం మీద ప్రత్యేక దృష్టిని సారించింది. ఇందుకు అనుగుణంగానే 'నేషనల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్ 2019' పాలసీ పేరిట ఒక ముసాయిదా విధానాన్ని కేంద్ర ప్రభుత్వం గత ఫిబ్రవరిలో ప్రకటించింది. మెరైన్ ఫిషరీస్ పాలసీకి సంబంధించి రెండేండ్ల క్రితం రూపొందించిన ముసాయిదా విధానం ఇంకా కార్యరూపం దాల్చకముందే, ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ విధానాన్ని తెరమీదికి తీసుకురావడంతో ఒకే రంగానికి సంబంధించిన ఈ రెండు వేర్వేరు విధానాలు కార్యరూపం దాల్చి, అమలులోకి తీసుకురావడం విషయంలో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

కేంద్రం నూతనంగా తీసుకువస్తున్న ఈ రెండు మత్స్యపారిశ్రామిక విధానాలలో చాలా కీలకమైన మార్పులను వీటిల్లో ప్రతిపాదించారు. తరతరాలుగా మత్స్యపారిశ్రామిక రంగం మీద ఆధారపడిన సాంప్రదాయ మత్స్యకారుల కుటుంబాల భవిష్యత్తుకు భరోసా కల్పిస్తూనే మరోవైపు ఈ రంగంలోకి పెద్దయెత్తున ప్రైవేటు భాగస్వామ్యాన్ని అనుమతించే ప్రయత్నాలు ఈ రెండు విధాన ముసాయిదా ప్రతిపాదనల్లో ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. భారతదేశ మత్స్యపారిశ్రామిక రంగంలోకి విదేశీ పెట్టుబడులను అనుమతించడంప్రమాదకరమైన ప్రతిపాదన. దీంతో దేశీయ, స్థానిక చిన్న ఉత్పత్తిదారులు విదేశీ పెట్టుబడిదారులతో పోటీ పడలేక చితికిపోయే ప్రమాదమున్నది. అలాగే దేశంలో వ్యవసాయరంగానికి ప్రభుత్వపరంగా అందజేస్తున్న రాయితీలు, సౌకర్యాలు, అంతర్గత పెట్టుబడులు, సంస్థాగత ద్రవ్యనిధి ఏర్పాటు తదితర సానుకూలమైన ప్రతిపాదనలు మత్స్య రంగానికి ప్రయోజనకరంగా ఉంటాయని పరిశీలకులు భావిస్తున్నారు. సముద్రజలాల నుంచి నానాటికీ తగ్గుతున్న చేపల ఉత్పత్తి కారణంగా దేశీయంగా తలెత్తుతున్న కొరతను తట్టుకునేందుకు ప్రత్యామ్నాయంగా సాంప్రదాయ జలవనరులకంటే, ఆక్వాకల్చర్ రంగాన్ని మరింత వేగవంతంగా అభివృద్ధిపరుచాలనే ఆలోచన ఈ ముసాయిదా ప్రతిపాదనల్లో కనిపిస్తున్నది. చేపల ఉత్పత్తి, ఉత్పాదకతలను పెంచుకోవడంతోపాటుగా, ఫిష్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు, వాల్యూ ఆడిషన్, మార్కెటింగ్ సదుపాయాలను పెంచడం, రీసర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టం, కేజ్ కల్చర్ తదితర ఆధునిక చేపల పెంపకం పద్ధతులను ప్రాచుర్యంలోకి తీసుకురావడంలాంటి ప్రతిపాదనలూ ఈ ముసాయిదాలో ఉన్నాయి. సాంప్రదాయ జలవనరుల మీద స్థానిక మత్స్యసహకార సంఘాలకు చేపలు పెంచుకుని, ఉత్పత్తి చేసే హక్కులను కల్పిస్తూనే, రిజర్వాయర్లలో చేపల ఉత్పత్తికి సంబంధించిన ప్రత్యేక విధానాన్ని దేశంలోని ఆయా రాష్ట్రాలు అక్కడి పరిస్థితులకు అనుగుణంగా రూపొందించుకునే వెసులుబాటును ఈ ముసాయిదా ప్రతిపాదనల్లో సూచించారు. దేశంలో ఆక్వాకల్చర్‌ను వేగవంతంగా అభివృద్ధిపరిచేందుకు అవసరమైన సీడ్ (చేప విత్తనాలు), ఫీడ్ (చేపల దాణా) ఉత్పత్తులను ప్రోత్సహించాలని కూడా సూచించారు. పెరుగుతున్న చేపల డిమాండుకు అనుగుణంగా చేపల ఉత్పత్తిని వేగవంతంగా పెంచడానికి రిజర్వాయర్ల నీటివనరుల్లో 'కేజ్ కల్చర్' పద్ధతిలో చేపలను పెంపకమే అనువైన మార్గంగా ఈ ముసాయిదా ప్రతిపాదనల్లో అభిప్రాయపడ్డారు.

'సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ ఎడ్యుకేషన్' మాజీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ దిలీప్ కుమార్ ఛైర్మెన్‌గా ఉపరితల జల వనరుల చేపల ఉత్పత్తి (ఇన్‌ల్యాండ్ ఫిషరీస్) విధానముసాయిదా రూపకల్పన నేపథ్యంలో పరిశీలించిన ప్రధాన అంశాల్లో మన దేశ మత్స్యపారిశ్రామిక భవిష్యత్తుకు 'ఆక్వాకల్చర్' రంగానికి ప్రధాన పాత్రపోషించాలని నొక్కిచెప్పింది. ఈ పరిస్థితుల నేపథ్యంలో మన దేశంలోని ఉపరితల జలవనరుల్లో చేపల పెంపకానికి మరింతగా ప్రాధాన్యం పెరుగనున్నదనేది వాస్తవం.

అందువల్ల ఉపరితల జలవనరులు అధికంగా విస్తరించి ఉన్న నాలుగు రాష్ట్రాలలో మత్స్యపారిశ్రామిక రంగానికి మరింతగా ప్రాధాన్యం లభించనున్నది. ఉపరితల జలవనరుల్లో చేపల పెంపకానికి అనువైన విస్తీర్ణంలో మనదేశంలో ఒడిస్సా, కర్నాటక, తమిళనాడు, తెలంగాణ మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. అయితే ఈ నాలుగు రాష్ట్రాలలో కేవలం తెలంగాణ రాష్ట్రం మినహాయిస్తే, మిగిలిన మూడు రాష్ట్రాలు సముద్రతీరంతో అదనపు జల వనరులను కలిగిఉన్నాయి. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మనకు అందుబాటులో ఉన్న ఉపరితల జలవనరులను గరిష్ఠంగా వినియోగించుకుని, ఉత్పత్తి, ఉత్పాదకతలపై దృష్టి సారించాలి. అప్పుడే ఈ నాలుగు రాష్ట్రాలు భవిష్యత్తులో తమ స్థానాలను మత్స్యపారిశ్రామిక రంగంలోనూ స్థిరపరుచుకోగలుగుతాయి. ఇందుకు సాంప్రదాయ పద్ధతుల్లో చేపల ఉత్పత్తితోపాటు, ఆధునిక విధానాలను కలగలుపుకున్న అక్వాకల్చర్ రంగాన్ని అభివృద్ధిపరుచుకోవడం ఒక్కటే పరిష్కారం. అయితే కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న 'నేషనల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ అండ్ ఆక్వాకల్చర్ 2019' పాలసీకి అనువైన రీతిలో మెరుగైన మత్స్యపారిశ్రామిక విధానాలను ఆయారాష్ట్రాలు తమ పరిస్థితులకు తగినట్లుగా రూపొందించుకోవాల్సిన అవసరమున్నది.

> ఉపరితల జలవనరులు అధికంగా విస్తరించి ఉన్న నాలుగు రాష్ట్రాలలో మత్స్యపారిశ్రామికరంగానికి మరింతగా ప్రాధాన్యం లభించనున్నది. ఉపరితల జలవనరుల్లో చేపల పెంపకానికి అనువైన విస్తీర్ణంలో మనదేశంలో ఒడిస్సా, కర్నాటక, తమిళనాడు, తెలంగాణ మొదటి నాలుగు స్థానాల్లో ఉన్నాయి. అయితే ఈ నాలుగు రాష్ట్రాలలో కేవలం తెలంగాణ రాష్ట్రం మినహాయిస్తే, మిగిలిన మూడు రాష్ట్రాలు సముద్రతీరంతో అదనపు జల వనరులను కలిగిఉన్నాయి. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మనకు అందుబాటులో ఉన్న ఉపరితల జలవనరులను గరిష్ఠంగా వినియోగించుకుని, ఉత్పత్తి, ఉత్పాదకతలపై దృష్టి సారించాలి.

**(వ్యాసకర్త:'తెలంగాణ ఫిషరీస్ సొసైటీ' వ్యవస్థాపకులు)**

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

## మహా చేప.. రుచి వహ్వా!



**3 మీటర్ల** పొడవు, 200 కిలోల బరువుండే 'పిరారుకు' చేప రుచికి భోజన ప్రియులు క్యూ కడుతున్నారు. అమెజాన్‌లో దొరికే ఈ చేపను అతి పెద్ద మంచినీటి చేపగా చెబుతున్నారు. ఈ జాతి చేపలు అంతరించిపోయే స్థితికి చేరుకోవడంతో.. నిపుణులు వీటిని పెంచే ప్రక్రియను చేబట్టారు. ఇప్పుడు వీటి సంఖ్య గణనీయంగా పెరిగింది. అన్నట్టు పిరారుకు డిష్ ఒక ముక్క ఖరీదు రూ. 1190. తింటారా మరి?!

## గోవా ఆవులు.. మాంసాహారులు!



**గోవా:** ఆవులు శాకాహారులు. అయితే, ఈ వాదనను ఇకపై సమర్థించలేమేమో. దీనికి కారణం గోవాలోని కొన్ని ఆవులు మాంసాన్ని తింటున్నాయట. గోవాలో రోడ్లపై తిరుగుతున్న 76 ఆవులను అధికారులు గోశాలలోకి తరలించారు. మిగతా పశువులకు ఇచ్చినట్టే వాటికి గడ్డి వేశారు. అయితే, దాన్ని అవి తీసుకోలేదు. దీంతో వాటికి మాంసాన్ని పెట్టి చూశారు. చికెన్, మటన్, చేపలు వంటి మాంసాహార పదార్థాలను తినటానికి అవి మక్కువ చూపాయి. దీనికి కారణం ఏమిటని అధికారులు శోధించగా అసలు విషయం బయటపడింది. రోడ్లపై తిరుగుతున్నప్పుడు సదరు పశువులు ఏ ఆహారం దొరికితే అవి తినేవి. ఈ క్రమంలో హోటల్ నిర్వాహకులు తమ వద్ద మిగిలిపోగా బయటపడేసే మాంసాన్ని తిని గడ్డి తినడం మరిచిపోయాయని అధికారులు గుర్తించారు. చికిత్స సాయంతో గోవులను మళ్లీ శాకాహారులుగా మార్చడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు.

## హాని తలపెడితే తిప్పికొడ్తాం!

రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరిక



**న్యూఢిల్లీ, అక్టోబర్ 22:** భారత్ ఏనాడు దూకుడుగా వ్యవహరించదని, కానీ ఎవరైనా హాని తలపెడితే మాత్రం తమ సైనిక బలగాలు దీటుగా సమాధానం ఇస్తాయని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఢిల్లీలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు జరిగే నౌకాదళ కమాండర్ల సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ మీడియాతో మాట్లాడుతూ.. నౌకాదళం నిత్యం అప్రమత్తంగా వ్యవహరిస్తుందని, 26/11 దాడులను పునరావృతం కానివ్వబోదని చెప్పారు. 'ఏ దేశంపైనైనా దాడి చేయడం గానీ, ఏ దేశ భూభాగంలో అంగుళం స్థలాన్ని ఆక్రమించడం భారత్ అభిమతం కాదు. కానీ మాపై దాడికి కుట్ర పన్నిన వారికి మాత్రం దీటుగా సమాధానమిచ్చేందుకు మా సైనిక బలగాలకు శక్తి సామర్థ్యాలు ఉన్నాయి' అని అన్నారు. భారత నౌకాదళం చేతుల్లో సముద్ర తీరం సురక్షితంగా ఉందని రాజ్‌నాథ్ ధీమా వ్యక్తం చేశారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ 26/11 తరహా దాడిని పునరావృతం కానివ్వకుండా నౌకాదళం సముద్ర తీర ప్రాంతాలపై పటిష్ఠ నిఘా కొనసాగిస్తుందన్నారు. దేశీయంగా తయారైన రక్షణ వ్యవస్థలపైనే నౌకాదళం అత్యధికంగా ఆధారపడి ముందుకు సాగుతున్నదని తెలిపారు. త్రివిధ దళాలు రక్షణ దిగుమతులను తగ్గించుకోవాల్సిన అవసరంపై దృష్టి సారించాయని చెప్పారు. ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు సరైన టెక్నాలజీలను అందిపుచ్చుకోవాలన్నారు.



# ఎవరికి ఓటేసినా బీజేపీకే పడింది

- మహారాష్ట్రలో ఒక గ్రామంలో ఓటర్లు, నేతల ఆరోపణ



ముంబైలో ఈవీఎంలను భద్రపరచిన ఓ కేంద్రంవద్ద పోలీసుల కాపలా

**పుణె/చండీగఢ్, అక్టోబర్ 22:** మహారాష్ట్రలోని సతారా లోక్‌సభ నియోజకవర్గానికి సోమవారం జరిగిన ఉప ఎన్నిక సందర్భంగా ఒక గ్రామంలో ఎవరికి ఓటు వేసినా బీజేపీకే పడిందని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) నేత శశికాంత్ షిండే ఆరోపించారు. సతారా పరిధిలోని నావ్లేవాది గ్రామంలో ఈ ఘటన జరిగిందని చెప్పారు. 'గ్రామంలోని ఓటర్లు ఎవరికి ఓటు వేసినా అది బీజేపీకే పడింది. దీంతో మా పార్టీ కార్యకర్తలు, గ్రామస్థులు విషయాన్ని నా దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే నేను అక్కడికి వెళ్లి అధికారులతో మాట్లాడాను. అప్పటికే దాదాపు 293 ఓట్లు ఈ విధంగా బీజేపీకి పడ్డాయి. అధికారులను నిలదీయడంతో వారు అప్పటికప్పుడు ఆ ఈవీఎంను మార్చారు' అని తెలిపారు. తాను పోలింగ్ కేంద్రంలో ఉన్నప్పుడే ఒక వ్యక్తి ఓటు వేయడానికి అక్కడికి వచ్చారని, ఆయన తనకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేస్తే బీజేపీ ఎన్నికల గుర్తు కమలం వద్ద లైటు వెలిగిందని చెప్పారు. దీన్ని గుర్తించిన అధికారులు కూడా ఈవీఎం మెషిన్‌లో ఏదో లోపం ఉన్నదని అంగీకరించారని, దాని స్థానంలో మరోటి చేశారని పేర్కొన్నారు. పోలింగ్ అధికారిణి కీర్తి నలవాడే స్పందిస్తూ 'కొత్త ఈవీఎం మెషిన్‌ను ఏర్పాటు చేసింది వాస్తవమే. మెషిన్ బటన్‌లో సమస్య ఉండటం వల్లే మార్చాం' అని చెప్పారు. ఉదయం పోలింగ్ ప్రారంభానికి ముందు మాక్ పోలింగ్ నిర్వహించామని, అప్పుడు పోలింగ్ ఏజెంట్లు ఎలాంటి అభ్యంతరాలను లేవనెత్తలేదని పేర్కొన్నారు.

**హర్యానాలో పెరిగిన పోలింగ్ శాతం**

హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో 68.46 శాతం పోలింగ్ నమోదైంది. సోమవారం సాయంత్రం వరకు 65.75 శాతం ఉండగా.. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన సమాచారాన్ని అధికారులు క్రోడీకరించి 68.46 శాతం పోలింగ్ నమోదైందని తేల్చారు. ఇదే రాష్ట్రంలో 2014లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 76.54 శాతం పోలింగ్ నమోదు కాగా.. దానితో పోల్చితే ప్రస్తుతం పోలింగ్ శాతం తగ్గినట్టే. ఈ ఏడాదిలో జరిగిన లోక్‌సభ ఎన్నికల సందర్భంగా హర్యానాలోని మొత్తం 10 నియోజకవర్గాల్లో కలిపి 70.36 శాతం పోలింగ్ నమోదైంది.

## కథువా కేసులో మలుపు!

- ఆరుగురు సిట్ సభ్యులపై కేసు నమోదుకు కోర్టు ఆదేశం

**జమ్ము:** దేశవ్యాప్తంగా సంచలనం రేపిన కథువా సామూహిక లైంగికదాడి-హత్య కేసు అనూహ్య మలుపు తిరిగింది. తప్పుడు వాంగ్మూలాలు ఇచ్చేలా సాక్షులను వేధింపులకు గురిచేశారన్న ఆరోపణలపై కేసును దర్యాప్తు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందానికి (సిట్) చెందిన ఆరుగురు సభ్యులపై ఎఫ్ఐఆర్ నమోదుచేయాలని స్థానిక కోర్టు పోలీసులను ఆదేశించింది. ఇందుకు సంబంధించి తదుపరి విచారణ జరిగే నవంబర్ 11 నాటికి తమకు నివేదికను అందజేయాలని జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ప్రేమ్‌సాగర్ సోమవారం జమ్ము సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌ను ఆదేశించారు. ఈ కేసులో ముగ్గురు సాక్షులు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన జడ్జి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. 2018 జనవరి 10న జమ్ముకశ్మీర్ రాష్ట్రం కథువా జిల్లాలోని ఒక గ్రామంలో మైనార్టీ సంచార తెగకు చెందిన ఎనిమిదేండ్ల బాలికను కిడ్నాప్ చేసిన దుండగులు కొన్ని రోజులపాటు లైంగిక దాడికి పాల్పడి హత్య చేశారు. ఈ కేసులో ముగ్గురు ప్రధాన నిందితులకు జీవితఖైదు విధించిన డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు .. మరో ముగ్గురు నిందితులకు ఐదేండ్ల జైలు శిక్ష విధించింది.

# మోదీ గమనిస్తున్నారు



ఢిల్లీలో ప్రధాని మోదీతో సమావేశమైన అభిజిత్ బెనర్జీ

### మీడియాతో అభిజిత్ బెనర్జీ..

### భారత్‌కు క్షేత్రస్థాయి అధికారులు అవసరమని వ్యాఖ్య

### ప్రధానితో సమావేశమైన నోబెల్ విజేత

**న్యూఢిల్లీ, అక్టోబర్ 22:** తనకు సంబంధించి మీడియా ఏం చేయడానికి ప్రయత్నిస్తున్నదో ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని నోబెల్ బహుమతి విజేత అభిజిత్ బెనర్జీ పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం అభిజిత్ మీడియాతో మాట్లాడుతూ, ప్రధానితో తన సమావేశం ఒక జోక్‌తో ప్రారంభమైందన్నారు. భారత ఆర్థిక వ్యవస్థపై అభిప్రాయం వెల్లడించాలని విలేకరులు అడిగిన ప్రశ్నకు అభిజిత్ నేరుగా సమాధానం ఇవ్వకుండా 'మా సమావేశాన్ని మీడియాపై ఒక జోక్ వేయడం ద్వారా ప్రధాని ప్రారంభించారు. మీడియా నన్ను మోదీకి వ్యతిరేకంగా మాట్లాడేలా ఎలా వలలో వేసుకొనేందుకు ప్రయత్నిస్తున్నదో చెప్పారు. ఆయన టీవీ చూస్తారు. మీ అందరినీ గమనిస్తున్నారు. మీరు ఏం చేయడానికి ప్రయత్నిస్తున్నారో కూడా ఆయనకు తెలుసు. అందువల్ల ఇక ఆపేయండి' అని అభిజిత్ పేర్కొన్నారు. ప్రధానితో సమావేశం తనకు ఒక ప్రత్యేక అనుభవం అని చెప్పారు. నేలపై నివసించి, క్షేత్రస్థాయిలో జీవన విధానం ఎలా ఉందో తెలుసుకోవడం ద్వారా ఉత్తేజం పొందే అధికార వ్యవస్థ భారతదేశానికి ఎంతో అవసరమని అభిజిత్ బెనర్జీ పేర్కొన్నారు. అప్పుడే జవాబుదారీతనం గల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటారని, లేకపోతే ప్రభుత్వానికి ప్రజల సమస్యలు తెలిసే అవకాశం ఉండదని ఆయన అభిప్రాయపడ్డారు. ఉద్యోగిస్వామ్యాన్ని సంస్కరించేందుకు తన ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాల గురించి మోదీ తనకు వివరించారని తెలిపారు. ప్రజాభిప్రాయాలకు అనుగుణంగా స్పందించే విధంగా అధికార వ్యవస్థను తీర్చిదిద్దుతున్నట్టు చెప్పారని అన్నారు. దేశం గురించి తన ఆలోచనా విధానాలను వివరించేందుకు ప్రధాని తనకు ఎంతో సమయాన్ని కేటాయించి మాట్లాడారని అభిజిత్ తెలిపారు. భారత్ ఎంతో ప్రత్యేకమైనదని, ఇక్కడ చాలామంది విధానాల గురించి చెప్తారు తప్ప, వాటి వెనుకనున్న ఆలోచనల గురించి మాట్లాడరన్నారు. 'పరిపాలనా వ్యవస్థను ఆయన (మోదీ) ఎలా చూస్తారో చెప్పారు. కొందరు ప్రజల అపనమ్మకం.. పాలనపై ఎటువంటి రంగులు వేస్తుందో తెలిపారు. పాలనా ప్రక్రియపై పట్టు కలిగి ఉండే వ్యవస్థలు ఎలా ఆవిర్భవిస్తాయో చెప్పారు. అది ప్రజల సమస్యలపై స్పందించే ప్రభుత్వం కాదన్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొనే అలవాటు అధికారులకు రావాలంటే.. వారిని క్షేత్రస్థాయిలోని వాస్తవాలకు దగ్గరగా ఉంచాలి' అని బెనర్జీ తెలిపారు. క్షేత్రస్థాయిలో పనిచేసే అధికార వ్యవస్థ నేడు భారత్‌కు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

**అభిజిత్ భారత్‌కు గర్వకారణం: మోదీ**

అభిజిత్ బెనర్జీతో తన భేటీకి సంబంధించిన ఫొటోను ప్రధాని తన ట్విట్టర్ ఖాతాలో పోస్ట్ చేశారు. 'నోబెల్ బహుమతి విజేత అభిజిత్ బెనర్జీతో సమావేశం అద్భుతంగా జరిగింది. మానవ సాధికారత పట్ల ఆయన అభిప్రాయాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. ఆయన సాధించిన విజయాల పట్ల భారత్ గర్విస్తున్నది' అని మోదీ ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

## తగ్గిన అల్లర్లు..

# పెరిగిన బాధితులు!



**దేశంలో 5 శాతం తగ్గిన ఘర్షణలు**

- 22 శాతం పెరిగిన బాధితులు
- బీహార్‌లో అత్యధిక అల్లర్లు
- మొత్తం నేరాల్లో యూపీ టాప్
- 2017లో నేరాలపై ఎన్సీఆర్బీ నివేదిక

**న్యూఢిల్లీ:** దేశంలో అల్లర్ల సంఖ్య తగ్గినప్పటికీ, బాధితుల సంఖ్య మాత్రం 22% పెరిగినట్లు జాతీయ నేర గణాంకాల సంస్థ (ఎన్సీఆర్బీ) నివేదికలో వెల్లడైంది. 2017లో దేశంలో చోటుచేసుకున్న నేరాలకు సంబంధించి ఎన్సీఆర్బీ దాదాపు ఏడాది ఆలస్యంగా సోమవారం నివేదికను విడుదల చేసింది. దీని ప్రకారం.. 2016తో పోలిస్తే 2017లో ఘర్షణల సంఖ్య 5% తగ్గినప్పటికీ, బాధితుల సంఖ్య మాత్రం ఏకంగా 22% పెరుగడం గమనార్హం. 2017లో దేశవ్యాప్తంగా 58,880 అల్లర్ల కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనల్లో 90,394 మంది బాధితులుగా ఉన్నారు. అల్లర్లు అంటే కేవలం మత సంబంధమైనవే కాదు.. ఆస్తి తగాదాలు, కుల వివాదాలు, రాజకీయ ఘర్షణలు, విద్యార్థులు నిరసనలనూ అల్లర్లుగా పరిగణించారు.

**మత ఘర్షణలు**

**దేశంలో** మత ఘర్షణలు 2016లో 869 చోటుచేసుకోగా, 2017లో 723 ఘటనలు సంభవించాయి. బాధితుల సంఖ్య కూడా 2016తో (1,139) పోలిస్తే 2017లో (1,092) తగ్గింది. 2017లో బీహార్‌లో అత్యధికంగా 163 మతఘర్షణలు జరుగగా, కర్ణాటక(92), ఒడిశా(91) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 2016లో హర్యానాలో 250 కేసులు నమోదుకాగా, 2017లో 25 మాత్రమే నమోదయ్యాయి.

**అల్లర్ల రాజధాని.. బీహార్**

11,698 కేసులతో బీహార్ దేశ అల్లర్ల రాజధానిగా నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో ఉత్తరప్రదేశ్ (8,990), మహారాష్ట్ర (7,743) ఉన్నాయి. 2016లో కూడా బీహార్ రాష్ట్రమే తొలిస్థానంలో నిలిచింది. కేసుల సంఖ్యలో బీహార్ మొదటి స్థానంలో ఉన్నప్పటికీ, బాధితుల సంఖ్యలో మాత్రం తమిళనాడు తొలి స్థానంలో ఉన్నది. 2017లో తమిళనాడులో 1,935 అల్లర్ల కేసులు నమోదవగా, బాధితులు మాత్రం 18,749 మంది ఉన్నారు. మరోవైపు, కేవలం ఒకేఒక్క కేసుతో పంజాబ్ అత్యంత ప్రశాంతమైన రాష్ట్రంగా నిలిచింది. కాగా, దేశంలో కుల వివాదాలకు సంబంధించిన అల్లర్లు 2016తో పోలిస్తే 2017లో 65 శాతం తగ్గాయి. కుల ఘర్షణల్లో ఉత్తరప్రదేశ్ (346 కేసులు) మొదటిస్థానంలో నిలిచింది.

**భూ/ఆస్తి తగాదాలే అత్యధికం**

దేశంలో నమోదైన అల్లర్ల కేసుల్లో భూమి/ఆస్తి తగాదాలే అత్యధికమని నివేదిక వెల్లడించింది. 2017లో దేశంలో చోటుచేసుకున్న మొత్తం అల్లర్ల ఘటనల్లో వీటి వాటా 22 శాతం. బాధితుల సంఖ్యలో 35%. భూమి/ఆస్తి తగాదాల్లో బీహార్ (7,030 కేసులు) మొదటి స్థానంలో ఉండగా, కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే బాధితుల సంఖ్యలో మాత్రం తమిళనాడు తొలి స్థానంలో ఉంది.

**10 శాతం నేరాలు ఉత్తరప్రదేశ్‌లోనే..**

**అల్లర్లు** మాత్రమేగాక దొంగతనాలు, హత్యలు, లైంగికదాడులు, అవినీతి తదితర అన్ని రకాల నేరాలకు సంబంధించి ఉత్తరప్రదేశ్ దేశంలోనే తొలిస్థానంలో ఉంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కేరళ, ఢిల్లీ ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. 2017లో దేశవ్యాప్తంగా మొత్తం 30,62,579 కేసులు నమోదయ్యాయి. అత్యధికంగా యూపీలో 3,10,084 కేసులు నమోదయ్యాయి. దేశంలోని మొత్తం కేసుల్లో ఇది 10.1%. ఆ రాష్ట్రంలో వరుసగా మూడో ఏడాది కూడా కేసుల సంఖ్య పెరుగడం గమనార్హం. ఢిల్లీ, యూపీ వంటి రాష్ట్రాలు వాహన దొంగతనాలు, ఇతర ఘటనలకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసే సౌకర్యాన్ని కల్పించాయని, ఈ కారణంగా ఇక్కడ కేసు నమోదు శాతం పెరిగి ఉండొచ్చని ఎన్సీఆర్బీ అభిప్రాయపడింది.

# మాలిక్‌కే ఎల్జీ బాధ్యతలు!

- జమ్ముకశ్మీర్, లఢక్‌ల లెఫ్టినెంట్ గవర్నర్‌గా ఆయననే నియమించే ఛాన్స్
- ప్రస్తుతం జమ్ముకశ్మీర్ గవర్నర్‌గా సత్యపాల్ మాలిక్



**శ్రీనగర్, అక్టోబర్ 22:** జమ్ముకశ్మీర్‌కు ప్రస్తుత గవర్నర్‌గా ఉన్న సత్యపాల్ మాలిక్‌ను.. అక్టోబర్ 31న ఏర్పడనున్న జమ్ముకశ్మీర్, లఢక్ కేంద్రపాలిత ప్రాంతాలకు లెఫ్టినెంట్ గవర్నర్‌గా (ఎల్జీ) ప్రభుత్వం నియమించే అవకాశాలు ఉన్నాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. అదే రోజున ఆయన పదవీబాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నాయి. ఈ పదవికి మరికొంత మంది పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయని, నిర్ణయం త్వరలోనే వెలువడవచ్చని తెలిపాయి. అయితే, జమ్ముకశ్మీర్‌కు గత ఏడాదిగా గవర్నర్‌గా సేవలందిస్తున్న మాలిక్‌కు అక్కడి పరిస్థితులపై మంచి అవగాహన ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు. ఎల్జీ పదవికి ఆయనే సరైన వ్యక్తి అని ప్రభుత్వం భావిస్తున్నట్టు వెల్లడించారు. ప్రస్తుతం గవర్నర్‌కి సలహాదారులుగా ఉన్న అధికారులు తమ తమ పదవుల్లో కొనసాగుతారో, లేదో ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఆర్టికల్ 370ను రద్దు చేశాక, జమ్ముకశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా(జమ్ముకశ్మీర్, లఢక్) విభజిస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొనడం తెలిసిందే. అక్టోబర్ 31 నుంచి ఆయా ప్రాంతాల్లో పునర్వ్యవస్థీకరణ చట్టం అమల్లోకి రానున్నది. దీంతో కేంద్రపాలిత ప్రాంతాలుగా మారిన జమ్ముకశ్మీర్, లఢక్‌లోని శాంతి భద్రతలు కేంద్రం పరిధిలోకి రానున్నాయి. ఎల్జీ ఆదేశాలను పోలీసులు పాటించనున్నారు.

**కశ్మీరీ యువకుల్ని బలి చేశారు!**

జమ్ముకశ్మీర్‌లోని వేర్పాటువాదులు, పార్టీ నాయకులు, మతాధిపతులు తమ బోధనలతో అమాయకులైన కశ్మీరీ పిల్లలను ప్రభావితం చేసి వాళ్ల జీవితాల్ని బలిగొంటున్నారని ఆ రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్ విరుచుకుపడ్డారు. అయితే, ఆయా నాయకుల కుటుంబాలు మాత్రం బాగుపడ్డాయని మండిపడ్డారు. జమ్ముకశ్మీర్‌లోని కత్రా పట్టణంలో ఉన్న మాతా వైష్ణోదేవి యూనివర్సిటీలో జరిగిన ఓ కార్యక్రమంలో మంగళవారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్‌లోని సంపన్న, శక్తివంతమైన కొన్ని కుటుంబాలు సాధారణ కశ్మీరీ యువకుల ఆకాంక్షలను చిదిమేసి, వాళ్ల ప్రాణాల్ని తీశాయన్నారు. అయితే వాళ్ల కొడుకులు, కుటుంబ సభ్యులు విదేశాల్లో ఉన్నత చదువులు చదువుకొని స్థిరపడ్డారని అన్నారు. ఉగ్రవాదంలోకి వాళ్ల పిల్లలెవరూ వెళ్లి ప్రాణాలు పోగొట్టుకోలేదని తెలిపారు. ఇప్పటికైనా కశ్మీరీ ప్రజలు నిజాల్ని అర్థం చేసుకొని, కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని గౌరవిస్తూ.. రాష్ట్రంలో శాంతి, అభివృద్ధి స్థాపనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కశ్మీరీ ముస్లింలకు రెండు స్వర్గాలు ఉన్నాయని మాలిక్ తెలిపారు. 'మీరు నివసిస్తున్న కశ్మీర్ ఒక స్వర్గం. నిజమైన ముస్లింగా చనిపోయాక ప్రాప్తించేది మరో స్వర్గం' అని అన్నారు. దేశంలో గవర్నర్ల పరిస్థితి చాలా బలహీనంగా ఉన్నదని ఆయన ఈ సందర్భంగా ఆవేదన వ్యక్తం చేశారు.

## భార్య హోదాను తొలిగించిన థాయ్‌లాండ్ రాజు

తన పట్ల అగౌరవంగా ప్రదర్శించినందుకు నిర్ణయం

**బాంకాగ్, అక్టోబర్ 22:** థాయ్‌లాండ్ రాజు మహా వజిరలాంగ్‌కోర్న్ తన భార్య సినీనత్ వాంగ్వజిరాపాక్డికి ఉన్న అన్ని అధికారాలను తొలిగించారు. ఇందులో అత్యంత కీలకమైన భార్య హోదా కూడా ఉన్నది. థాయ్‌లాండ్ మహారాణి హోదాను పొందడానికి వాంగ్వజిరాపాక్డి విశ్వ ప్రయత్నాలు చేశారని, అంతేగాక రాజు పట్ల గౌరవ ప్రదంగా ఉండటం లేదని రాజ కుటుంబం ఓ ప్రకటనలో తెలిపింది. అందుకే ఆమెకు ఉన్న సైనిక హోదాలు, బిరుదులతోపాటు 'ఛౌ ఖున్ ప్రా' (భార్య హోదా) ర్యాంకును తొలిగించినట్లు పేర్కొంది. రాజ కుటుంబ సంప్రదాయాలను అర్థం చేసుకోవడంలో ఆమె విఫలమయ్యారని తెలిపింది. ఆమె చర్యలు రాజ కుటుంబం గౌరవ ప్రతిష్ఠలను దిగజార్చేలా ఉన్నాయని వెల్లడించింది. కాగా తన బాడీగార్డ్ విభాగానికి ఉప అధిపతి అయిన వాంగ్వజిరాపాక్డిని మే నెలలో రాజు వజిరలాంగ్‌కోర్న్ వివాహమాడారు. ఆయనకు ఆమె నాలుగో భార్య. అయితే మహారాణి హోదా సాధించడంలో భాగంగా చేస్తున్న కుట్రల ఫలితంగా చివరికి ఆమె భార్య హోదానే కోల్పోవాల్సి వచ్చింది.

# గురి చూసి దాడి!

పక్కా సమాచారం, ఉపగ్రహ నిఘా సాయంతోనే టెర్రర్ లాంచ్‌ప్యాడ్లపై ఆర్మీ దాడులు



ఇటీవలి భారత్ దాడుల్లో ధ్వంసమైన ఓ ఉగ్రవాద శిబిరం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 22:** ఆర్టికల్ 370 రద్దు నేపథ్యంలో కశ్మీర్‌లోయలో అలజడి సృష్టించేందుకు ఉగ్రవాదులు సాగిస్తున్న చొరబాటు యత్నాలను నిరోధించేందుకు భారత సైన్యం ఆదివారం పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ఉగ్ర స్థావరాలపై జరిపిన దాడులు అత్యంత కీలకమైనవి. శీతాకాల సమయంలో సీమాంతర ఉగ్రవాద సంస్థలు సాధ్యమైనంత ఎక్కువ మంది ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు కుట్ర పన్నే అవకాశమున్న నేపథ్యంలో చొరబాట్లను ఎట్టిపరిస్థితుల్లోనూ అడ్డుకోవాలని నిఘా సంస్థల నుంచి స్పష్టమైన ఆదేశాలు అందినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. పీవోకేలోని నీలమ్ వ్యాలీలో ఉన్న మూడు ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేశామని, మరో శిబిరానికి గణనీయ నష్టం కలిగించామని భారత సైన్యాధిపతి బిపిన్ రావత్ ఆదివారం వెల్లడించిన విషయం తెలిసిందే. నియంత్రణ రేఖకు సమీపంలోని ఈ లాంచ్ ప్యాడ్‌లలో గత నెల కాలంలో నూతనంగా నియమించుకున్న క్యాడర్‌ను ఉగ్ర సంస్థలు మోహరించినట్లు సమాచారం. జైషే మహమ్మద్, లష్కరేతాయిబా, అల్ బదర్ ఉగ్రవాద సంస్థలకు చెందిన ఈ శిబిరాల్లో ఉగ్రవాదుల ఉనికి గురించి ఈ నెల మొదటివారంలో నిఘా సంస్థలు సమాచారం అందించాయని సైనిక వర్గాలు తెలిపాయి. ఈ టెర్రర్ లాంచ్ ప్యాడ్లకు సంబంధించిన జీపీఎస్ లొకేషన్‌ను గుర్తించి, వాటిని ఢిల్లీ, శ్రీనగర్‌లోని ఆర్మీ యూనిట్లకు పంపించినట్లు పేర్కొన్నాయి. జీపీఎస్ లొకేషన్ అందగానే, ఉపగ్రహాల సాయంతో ఆ శిబిరాలపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు ఉగ్రవాదుల కదలికలను ట్రాక్ చేసినట్లు వివరించాయి. పౌరులు, ఉగ్రవాదుల కదలికలు వేర్వేరుగా ఉంటాయని, దీన్ని బట్టి అక్కడ ఉన్నది ఉగ్రవాదులనే అన్నది నిర్ధారణ అయ్యిందని వెల్లడించాయి. సైన్యం జరిపిన దాడుల్లో 6-10 మంది పాక్ సైనికులు మరణించారని, హతమైన ఉగ్రవాదుల సంఖ్య అంతకంటే ఎక్కువనే ఉంటుందని రావత్ తెలిపారు. అయితే ఉగ్రవాదులు 18 మంది మరణించారని, పాక్ సైనికులు 12 మంది చనిపోయారని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. అలాగే ఆరుగురు పౌరులు మరణించినట్లు పేర్కొన్నాయి. అర్ధరాత్రి అంబులెన్సుల ద్వారా పాకిస్థాన్ ఆ ప్రాంతం నుంచి మృతదేహాలను తరలించినట్లు ఆ వర్గాలు తెలిపాయి. అయితే భారత వాదనలను పాక్ తోసిపుచ్చింది.

## జమ్ముకశ్మీర్, లడఖ్ ఉద్యోగులకు భారీగా పెరుగనున్న జీతాలు

ఏడో వేతన సంఘం సిఫారసుల అమలుకు కేంద్రం ఆదేశాలు

**ఢిల్లీ:** జమ్ముకశ్మీర్, లడఖ్ కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ ఉద్యోగులకు అక్టోబర్ 31 నుంచి జీతాలు, అలవెన్సులు భారీగా పెరుగనున్నాయి. ఏడో వేతన సంఘం సిఫారసుల మేరకు జీతాలు, ప్రయోజనాలు అందించనున్నట్టు కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మంగళవారం తెలిపారు. ఇక్కడి ప్రభుత్వ ఉద్యోగులందరికీ 7వ సీపీసీ అలవెన్సులు చెల్లించే ప్రతిపాదనను కేంద్ర హోంశాఖ ఆమోదించినట్టు అధికారులు ప్రకటించారు. ఆగస్టు 5న కేంద్రం ఆర్టికల్ 370ని ఉపసంహరించి జమ్ముకశ్మీర్ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా ప్రకటించడంతో ఇక్కడున్న 4.5 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగులకు రూ.4,800 కోట్ల మేర ప్రయోజనం కలుగనున్నది. ఇతర కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వ ఉద్యోగులకు లభించే విద్య, వైద్య, రవాణా, ఎల్టీసీ తదితర అన్ని అలవెన్సులు వారికీ లభించనున్నాయి.

## సమ్మెను విరమించండి!

హాల్ కార్మికులకు కర్ణాటక హైకోర్టు ఆదేశం

**బెంగుళూరు, అక్టోబర్ 22:** వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సమ్మెకు దిగిన హిందుస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) కార్మికులు వెంటనే తమ సమ్మెను విరమించి, విధుల్లోకి చేరాలని కర్ణాటక హైకోర్టు మంగళవారం ఆదేశించింది. ఈ నేపథ్యంలో 'చట్టప్రకారం హెచ్ఏఈఏ సమ్మెను విరమించాలి. లేకపోతే, కోర్టు ఆదేశాలు ధిక్కరించిన వారవుతారు' అని హెచ్ఏఎల్ ఓ ప్రకటనలో పేర్కొంది. వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 14 నుంచి హెచ్ఏఎల్ కార్మికులు సమ్మెకు దిగారు. దీంతో సంస్థ యాజమాన్యం సమ్మెకు వ్యతిరేకంగా హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

## అట్టుడుకుతున్న చిలీ



**చిలీ** అధ్యక్షుడు సెబాస్టియన్ పినెరా వైదొలుగాలని, ఆర్థిక అసమానతలను తొలిగించాలని డిమాండ్ చేస్తూ ఆ దేశ రాజధాని శాంటియాగోలో సోమవారం వేల మంది చేపట్టిన నిరసన ప్రదర్శన హింసాత్మకంగా మారింది. ఆందోళనకారులు దుకాణాలను దోచుకుని తర్వాత వాటికి నిప్పంటించారు. నిరసనకారులకు, భద్రతా బలగాలకు మధ్య జరిగిన ఘర్షణల్లో 11 మంది మరణించారు.

## మోకాళ్ల నొప్పులు శాశ్వతంగా పోవాలంటే...

తన కళ్ల ముందు నుంచి ఎవరైనా చకచకా నడిచిపోతుంటే, అప్పటికే మోకాళ్ల నొప్పులతో (ఆర్థరైటిస్) బాధపడుతున్న వాళ్లు కాస్తంత అసూయగానే చూస్తారు. మోకాళ్ల నొప్పులతో కుంటుతూ గెంటుతూ వెళ్లిన వాళ్లను చూసినా వారిని క్షణాల్లో మరిచిపోయి ప్రపంచంలో మరెవరికీ రాని సమస్య తనకే వచ్చినట్లు కుంగిపోతుంటారు. నిజానికి 40 ఏళ్లు దాటిన చాలా మంది ఎంతో కొంత ఈ సమస్యతో బాధపడుతూనే ఉన్నారు. ఎందుకిలా అంటే ఏం చెప్పగలం? ఒక్కొక్కరికి ఒక్కో కారణంతో కీళ్ల నొప్పులు వస్తుంటాయి. స్పష్టంగా చెప్పాలంటే, ఇన్‌ఫెక్షన్లు ఎన్ని రకాలో, కీళ్ల నొప్పులు అన్ని రకాలు. వంద వేరు వేరు రకాల ఇన్‌ఫెక్షన్లు ఉన్నట్లే, వంద వేరు వేరు రకాల కీళ్ల నొప్పులు ఉంటాయి. అందుకే చాలా సార్లు ఒకరి కీళ్ల నొప్పులకు ఫలితాన్ని ఇచ్చిన ఔషధాలు మరొకరికి ఫలితాన్ని ఇవ్వవు. నిజానికి మోకాళ్ల నొప్పుల తీరు కూడా ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. కొందరిలో ఈ నొప్పి ఎడతెగకుండా కొనసాగుతూనే ఉంటుంది. మరికొందరిలోనేమో ఉన్న చోటు నుంచి కదిలినప్పుడే నొప్పిగా ఉంటుంది. మిగతా సమయాల్లో మామూలుగానే ఉంటుంది. కొందరిలో ఈ నొప్పి మోకాలి దగ్గరలోని కండరాల్లోనే కాకుండా శరీరంలోని ఇతర భాగాల్లోకి పాకే అవకాశం కూడా ఉంది. అందుకే కీళ్ల నొప్పులైనా, మోకాళ్ల నొప్పులైనా కారణాలేమిటో ఒక్కొక్కరినీ విడివిడిగా పరిశీలించాల్సిందే. విడివిడిగా వైద్యం చేయాల్సిందే.! మొత్తంగా చూస్తే మోకాళ్ల నొప్పులు పలురకాలనే కాస్తంత అవగాహన ఏర్పడితే వైద్యులు అందించే భిన్నమైన వైద్యాల ప్రత్యేకత బోధపడుతుంది. వాటి వల్ల కలిగే ప్రయోజనాలు కూడా వెనువెంటనే తెలిసి వస్తాయి.

● కీళ్ల మధ్య ఉండే కార్టిలేజ్ అరగడం వల్లే మోకాళ్ల నొప్పులు వచ్చే మాట నిజమే అయినా, ఆ కార్టిలేజ్ అరుగుదల ఏ దశలో ఉందో తెలుసుకోవడం కూడా ఎంతో అవసరం. ఆ దశను బట్టే నొప్పి గానీ, ఇతర సమస్యలు గానీ ఉంటాయి. కార్టిలేజ్ కాస్త ఎక్కువగా అరిగితే, కీళ్ల ఆకృతి మారుతుంది. నడక చివరికి సాధారణ కదలికల తీరు కూడా మారుతుంది. పైగా ఒత్తిడి ఎక్కువకావడంతో మోకాలికి పైనా కిందా అంటే తొడ పిక్క, భాగాల్లోని కండరాలు బలహీనమవుతాయి. బిగుసుకుపోతాయి కూడా. కండరాలు బలహీనపడే కొద్దీ కీళ్ల కదలికలు మరింత కష్టమవుతాయి. ఆర్థరైటిస్ సమస్య ఏ కీళ్లలోనైనా రావచ్చు. కాకపోతే, శరీర భారాన్ని ఎక్కువగా మోసేది మోకాళ్లే కాబట్టి ఆ సమస్య బారిన పడేది ఎక్కువగా మోకాళ్లే.



డాక్టర్ టి. ఎల్. శ్రీనివాసరావు
సహజ ఆయుర్వేదిక్ హాస్పిటల్ అండ్ రీసెర్చ్ సెంటర్
హైదరాబాద్ : మలక్‌పేట్, విజయనగర్‌కాలనీ, బీరంగూడ(ఆనంద హాస్పిటల్‌లో)
బ్రాంచీలు : హన్మకొండ, రాజమండ్రి , విజయవాడ, అనంతపూర్, జోగిపేట్, తిరుపతి, నెల్లూరు
ఫోన్స్ : 9160994455, 9160994456



● వైద్యులు మోకాళ్లనొప్పులను మొదటి రకం, రెండవ రకం అంటూ విభజన చేస్తారు. మొదటి రకం మోకాళ్ల నొప్పులకు వయసు పైబడటం తప్ప ఇతర కారణాలేమీ కనిపించవు రెండవ రకం మోకాళ్ల నొప్పులకు మాత్రం అనేక కారణాలు కనిపిస్తాయి. వాటిల్లో ప్రధానంగా మోకాళ్ల పైన అధిక ఒత్తిడి పడటమే కారణంగా కనిపిస్తుంది. నిజానికి పురుషులతో పోలిస్తే, మోకాళ్ల నొప్పులతో బాధ పడేవాళ్లల్లో స్త్రీలే ఎక్కువ మంది. దీనికి పని ఒత్తిడి ఒక కారణమైతే, వ్యాయామాలు లేకపోవడం మరో కారణం. రోజుకు అనేక సార్లు మెట్లు ఎక్కుతూ దిగుతూ ఉండడం గానీ, ఎక్కువ గంటలు నిలుచుని ఉండడం గానీ, రోజంతా చేసే వాళ్లు ఈ సమస్యకు ఎక్కువగా గురవుతుంటారు.

● నిజానికి మోకాళ్ల నొప్పుల అసలు సమస్య అంతా వాటిని ఎక్కువ కాలం నిర్లక్ష్యం చేయడంలోనే ఉంది. అలా నిర్లక్ష్యం చేయడానికి కారణాలు లేకపోలేదు. వాటిల్లో ముఖ్యంగా తాము రోగగ్రస్తులమైపోయామన్న భావన ఉండదు. శరీరం కృశించిపోతున్నట్లు అనిపించదు. ఆకలి తగ్గడమో, జ్వరం రావడమో ఉండదు. అందుకే ఎక్కువ కాలం నిర్లక్ష్యం చేస్తారు.

**ఆయుర్వేద చికిత్స**

ఎవరైతే ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా ఆయుర్వేద వైద్య చికిత్సలు తీసుకుంటారో వాళ్లు సమస్య నుంచి త్వరలోనే బయటపడతారు. అలా కాకుండా పెయిన్ కిల్లర్లు వేసుకుంటూ కాలయాపన చేస్తే ఒక దశలో కాలు కదపలేని స్థితికి చేరుకుంటారు. ఎందుకంటే పెయిన్ కిల్లర్లు నొప్పి తెలియకుండా కీళ్లను మొద్దుబారేలా చేస్తాయే తప్ప కీళ్ల నొప్పిని తగ్గించవు. కీళ్ల నొప్పులకు మూల కారణమైన దోషాలను తొలగించవు. అందువల్ల మోకాళ్ల నొప్పుల నుంచి శాశ్వత విముక్తి పొందాలంటే ఆయుర్వేద చికిత్సలు తప్ప మరో మార్గం లేదు.

పోస్టల్ సదుపాయం కలదు

## పాఠశాల విద్యాశాఖలో ఇద్దరు అధికారుల బదిలీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పాఠశాల విద్యాశాఖలో ఇద్దరు అధికారులను మంగళవారం ప్రభుత్వం బదిలీ చేసింది. విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో అదనపు డైరెక్టర్ (కోఆర్డినేషన్) ఏ రామకృష్ణరావును రామంతాపూర్‌లోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ టెక్నాలజీ (ఎస్ఐఈటీ) డైరెక్టర్‌గా, అక్కడ పనిచేస్తున్న సీహెచ్ రమణకుమార్‌ను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయానికి అదనపు కమిషనర్‌గా బదిలీ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ బీ జనార్దన్‌రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

## గిరిజన వర్సిటీపై కేంద్రాన్ని ఒప్పిస్తా

- త్వరలో గిరిజన తండాల్లో పర్యటిస్తా
- గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ములుగులో గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కేంద్రం నుంచి ఆమోదం లభించేలా కృషిచేస్తానని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ తెలిపారు. తెలంగాణలో గిరిజనుల సంస్కృతి, వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు త్వరలో తండాల్లో పర్యటిస్తానని వెల్లడించారు. గిరిజన సంక్షేమశాఖ అధికారులతో మంగళవారం రాజ్‌భవన్‌లో ప్రత్యేకంగా సమావేశమైన గవర్నర్.. ఆ శాఖపై సమీక్ష జరిపారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి అధికారులు వెంటవెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. సమీక్షలో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి బెనహర్ మహేశ్ దత్ ఎక్కా, కమిషనర్ క్రిస్టినా, ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ గిరిజన మహిళలతో కలిసి సంప్రదాయ నృత్యం చేశారు.



మంగళవారం రాజ్‌భవన్‌లో గిరిజనులతో కలిసి నృత్యం చేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

## డిసెంబర్ 28న హెచ్‌ఎం అకౌంట్ పరీక్ష

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రధానోపాధ్యాయులకు అకౌంట్ టెస్ట్-2019 పరీక్ష డిసెంబర్ 28న జరుగుతుందని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ బీ సుధాకర్ ప్రకటించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండో పేపర్ పరీక్ష నిర్వహిస్తారు. నవంబర్ 11 వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని, రూ.60 అపరాధ రుసుంతో 18 వరకు గడువు ఇచ్చింది. రెండు పేపర్లకు రూ.150, ఒకపేపర్‌కు 100 ఫీజు చెల్లించాలని, దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి ద్వారా హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ (డీజీఈ) కార్యాలయంలో నవంబర్ 20లోగా అందజేయాలని తెలిపారు.





వ్యవసాయవర్సిటీలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో మంచి ఆలోచనలు కనబరచిన వారికి బహుమతులు అందజేస్తున్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, సీఎస్ జోషి

## సేద్యాన్ని లాభసాటిగా మార్చాలి

- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్
- వ్యవసాయ వర్సిటీలో అగ్రిహబ్‌ను ఏర్పాటుచేయాలి
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి సూచన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం ద్వారా యువతను పెద్దఎత్తున ఈ రంగంవైపు ఆకర్షించవచ్చని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ముమ్మందు వ్యవసాయరంగంలో తెలంగాణ ప్రధాన రాష్ట్రంగా మారుతుందని ఆయన విశ్వాసం వ్యక్తంచేశారు. మంగళవారం ఆయన రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో 'యూత్ యాజ్ టార్చ్‌బేరర్స్ ఆఫ్ బిజినెస్ ఓరియెంటెడ్ అగ్రికల్చర్ ఇన్ సౌత్ ఇండియా' వర్క్‌షాప్ ముగింపు సదస్సులో ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ.. గోదావరి, కృష్ణా నదులతోపాటు సారవంతమైన భూములున్నప్పటికీ గతంలో తెలంగాణ ప్రాంతం చాలా నిర్లక్ష్యానికి గురైందని, అందుకే ప్రొఫెసర్ జయశంకర్ లాంటి మేధావులంతా కలిసి 'నీళ్లు, నిధులు, నియామకాలు' అనే ప్రధాన నినాదంతో 14 ఏండ్లపాటు పోరాడి ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని సాధించగలిగారని వివరించారు. ఉద్యమనేత అయిన సీఎం కేసీఆర్ వ్యవసాయమే ప్రధాన ఎజెండాగా గత ఐదేండ్ల నుంచి రాష్ట్రంలో అనేక పథకాలు అమలుచేయడంతోపాటు గోదావరి, కృష్ణ నదులపై అనేక ఎత్తిపోతల పథకాలు ప్రారంభించారని, 'మిషన్ కాకతీయ' ద్వారా చిన్ననీటి వనరులను పునరుద్ధరించగలిగారని తెలిపారు. అతిత్వరలోనే వీటి ద్వారా రాష్ట్రంలో కోటి ఎకరాలకు సాగునీరు అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ముమ్మందు రాష్ట్రంలో మరింత భారీగా జరిగే వ్యవసాయ ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం పెద్ద సవాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఇలాంటి వర్క్‌షాపులను జిల్లాస్థాయిలోనూ నిర్వహించడం ద్వారా యువతను వ్యవసాయం, వాల్యూఎడిషన్, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌వైపు ఆకర్షించే ప్రయత్నాలు ముమ్మరం చేయాలని వినోద్‌కుమార్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి మాట్లాడుతూ.. గత ఐదేండ్ల నుంచి తెలంగాణలో వరి దిగుబడి గణనీయంగా పెరుగుతున్నదని, వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతోపాటు రాష్ట్రంలో సాగునీటి సౌకర్యాలు మెరుగుపడటమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. వ్యవసాయ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వారిలో 10-15 శాతం మంది ఎంటర్‌ప్రెన్యూర్స్‌గా మారాలని, టీహబ్ మాదిరిగా, వ్యవసాయ వర్సిటీలో అగ్రిహబ్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సదస్సు నిర్వహించిన వ్యవసాయ వర్సిటీని, వీసీ ప్రవీణ్‌రావును జోషి ప్రత్యేకంగా అభినందించారు. రెండ్రోజులపాటు జరిగిన ఈ వర్క్‌షాప్‌లో మంచి చర్చలు జరిగాయని, ఉపయోగకరమైన సూచనలు వచ్చాయని వీసీ ప్రవీణ్‌రావు తెలిపారు. ఈ వర్క్‌షాపులో మంచి ఆలోచనలు కనబర్చినవారికి బహుమతులు అందజేశారు. తెలంగాణ నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ విజయ్‌కుమార్, ట్రస్ట్ ఫర్ అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ చైర్మన్ పరోడా, దక్షిణాది రాష్ట్రాల్లోని వివిధ వర్సిటీల వీసీలు, మాజీ వీసీలు, ఐసీఏఆర్ సంస్థల డైరెక్టర్లు, శాస్త్రవేత్తలు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అక్రమ కుబేర కల్కి!

- ఐటీ సోదాల్లో భారీగా ఆస్తులు జప్తు
- మూడోరోజు తనిఖీల్లో 93 కోట్ల సొత్తు స్వాధీనం
- అందులో రూ.5 కోట్ల విలువచేసే వజ్రాలు..
- 88 కిలోల బంగారం..
- రూ.40.39 కోట్ల నగదు, రూ. 18 కోట్ల విదేశీ కరెన్సీ



మీడియాకు విడుదల చేసిన వీడియోలో విజయ్‌కుమార్ దంపతులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కల్కి ఆశ్రమాల్లో కొనసాగుతున్న ఐటీ సోదాల్లో భారీగా ఆస్తులు బయటపడుతున్నాయి. భక్తి ముసుగులో వందల కోట్లు అక్రమంగా సంపాదించారన్న ఆరోపణలపై తమిళనాడులోని కల్కి ఆశ్రమం, ఆంధ్రప్రదేశ్‌లో చిత్తూరు జిల్లా వరదయ్యపాళెం మండలం బత్తలవలం గ్రామ సమీపంలోని కల్కి భగవాన్ ఆశ్రమంలో మంగళవారం తనిఖీలు చేసిన ఐటీ అధికారులు కోట్ల రూపాయల నగదు, పెద్ద సంఖ్యలో బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. రూ.5 కోట్ల విలువ గల వజ్రాలు, రూ.26 కోట్ల విలువచేసే 88 కిలోల బంగారం, రూ.40.39 కోట్ల నగదు, రూ.18 కోట్ల విదేశీకరెన్సీ సహా మొత్తం రూ.93 కోట్ల విలువ చేసే సొత్తును సీజ్ చేసినట్లు ఐటీ అధికారులు ప్రకటించారు. భూదందాలకు సంబంధించి 1182 డాక్యుమెంట్లు సీజ్‌చేశామని, రూ.409 కోట్లకు సంబంధించిన రసీదులపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

### మూడోరోజు సోదాలు..

కల్కి భగవాన్ ఆశ్రమంలో మూడోరోజు ఐటీ సోదాలు పూర్తయ్యాయి. వీటిలో ఇప్పటికే భారీగా అక్రమాస్తులున్నట్లు అధికారులు గుర్తించారు. కీలక పత్రాలు, హార్డ్ డిస్క్‌లు స్వాధీనం చేసుకున్నారు. కల్కి ఆశ్రమం వ్యవస్థాపకులు కల్కి భగవాన్ అలియాస్ విజయ్‌కుమార్, పద్మావతి.. సోదాలు మొదలైనప్పటినుంచి అజ్ఞాతంలోకి వెళ్లారు. అధికారుల తనిఖీల్లో క్యాంపస్-3లో భారీగా విదేశీ నగదు, బంగారాన్ని గుర్తించారు. ఈ మేరకు కల్కి కుమారుడు కృష్ణనాయుడు, కోడలు ప్రీతినాయుడు, ట్రస్ట్ నిర్వాహకులు లోకేశ్ దాసీజీని అధికారులు అదుపులోకి తీసుకుని విచారించారు. స్వదేశీ, విదేశీ భక్తుల ద్వారీ భారీఎత్తున విరాళాలు సేకరించి కోట్ల రూపాయలు విలువచేసే వందల ఎకరాల భూములు కొనుగోలు చేసినట్లు అధికారులు నిర్ధారించారు. రూ.93 కోట్ల బంగారం, నగదు స్వాధీనం చేసుకున్నప్పటికీ రూ.409 కోట్లకు సంబంధించి ఎలాంటి రశీదులు లేవు. భూదందాలకు సంబంధించి 1182 డాక్యుమెంట్లు సీజ్‌చేశారు. ఈ వ్యవహారంలో చాలా వరకు బినామీలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. విదేశాల్లో ఉన్న ఆస్తుల వివరాలు వెలుగులోకి రావాలంటే కల్కి వేలుముద్రలు పాస్‌వర్డ్‌గా ఉన్న హార్డ్‌డిస్క్‌లను తెరువాల్సి ఉంటుందని అధికారులు చెప్తున్నారు. సదరు హార్డ్‌డిస్క్‌లను సైతం స్వాధీనం చేసుకున్నారు.

### హైదరాబాద్‌లోనూ దోపిడీ!

ప్రచారానికి ఓ చానల్ కావాలనుకున్న కల్కి దంపతులు.. హైదరాబాద్‌లోని మణికొండలో పంచవటి కాలనీలో ఉన్న స్టూడియో ఎన్ చానల్‌ను కొనుగోలుచేశారు. ప్రముఖ హీరో జూనియర్ ఎన్టీఆర్‌కు పిల్లనిచ్చిన మామ నార్నే శ్రీనివాసరావు దగ్గర నుంచి 2014లో 'ఏకం కల్కి ఆధ్యాత్మిక' కేంద్రం నిర్వాహకుల పేరిట ఈ కొనుగోలు జరిగింది. దేశవ్యాప్తంగా ఏకం కల్కి ఆధ్యాత్రిక కేంద్రాలు, కార్యాలయాల్లో నిర్వహిస్తున్న ఐటీ సోదాల్లో భాగంగా స్టూడియో ఎన్‌లోనూ తనిఖీలు చేపట్టారు. చానల్‌ను కొనుగోలుచేసిన తర్వాత సీఈవో రూపంలో ఓ మహిళకు ఏకం కల్కి ఆధ్యాత్మిక కేంద్రం నిర్వాహకులు బాధ్యతలు అప్పగించారు. అయితే జర్నలిస్టులకు వేతనాలు ఇవ్వకుండా గెంటేశారు. కానీ.. ఆ పాత్రికేయులకు కోట్లలో వేతనాలు ఇచ్చినట్లు లెక్కల్లో మాత్రం పక్కాగా చూపారు. ఐటీ దాడుల సందర్భంగా ఈ విషయం వెలుగు చూసింది. ప్రస్తుతం ఈ చానల్ మూతపడింది. అయితే ఇక్కడ దోచిన సొత్తు నుంచి సదరు మహిళా సీఈవో బాగానే వెనకేసుకున్నట్టు అధికారులు చెప్తున్నారు.

### మేం మిమ్మల్ని వదిలిపోలేదు

మీడియాకు కల్కి దంపతుల వీడియో

ఐటీ సోదాల నేపథ్యంలో అజ్ఞాతంలోకి వెళ్లిన కల్కి ఆశ్రమ వ్యవస్థాపకులైన విజయ్‌కుమార్‌నాయుడు, పద్మావతినాయుడు తమిళనాడులో ఉంటున్నట్టు వెల్లడైంది. తమిళనాడులోని నేమమ్ ఆశ్రమంలోనే వారు అందుబాటులో ఉన్నారంటూ కల్కి ఆశ్రమం.. మీడియాకు ఓ వీడియోను విడుదలచేసింది. తమ ఆరోగ్యం బాగుందని, తమ గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ వీడియోలో విజయ్‌కుమార్ దంపతులు చెప్పారు. 'మేం మిమ్మల్ని వదిలిపోలేదు. మేం దేశం వదిలిపోలేదు. మేం నేమమ్ ఆశ్రమంలో ఉన్నాం. తరగతులు నిర్వహిస్తూ.. మీకు సహాయం చేస్తున్నాం' అని పేర్కొన్నారు. కల్కి ఆశ్రమ ప్రధాన కార్యాలయాల్లో యథావిధిగా కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. అయితే.. ఐటీ సోదాల గురించి ఒక్క ముక్క కూడా మాట్లాడకపోవడం విశేషం.

## ఏషియన్ సినిమా సంస్థల్లో ఐటీ సోదాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రముఖ సినీ నిర్మాణ, డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఏషియన్ సినిమా కార్యాలయాల్లో ఆదాయం పన్ను శాఖ అధికారులు మంగళవారం సోదాలు నిర్వహించారు. ఏషియన్ సినిమా అధినేతలు నారాయణదాస్, సునీల్ నారంగ్ ఇండ్లతోపాటు వారి సన్నిహితుల నివాసాల్లో తనిఖీలు చేస్తున్నారు. హైదరాబాద్ నగరంలోని ఏఎమ్‌బీ మాల్‌ను హీరో మహేశ్‌బాబుతో కలిసి ఏషియన్ సినిమా సంస్థ ఏర్పాటుచేసిన విషయం తెలిసిందే. త్వరలో మరో అగ్రహీరో అల్లు అర్జున్‌తో కలిసి మల్టీప్లెక్స్ నిర్మాణం చేపట్టేందుకు సిద్ధమైన ఈ సంస్థ.. నాగచైతన్య హీరోగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో ఒక సినిమా నిర్మిస్తున్నది. నైజాంలో భారీచిత్రాలను పంపిణీ చేయడంతోపాటు ఏషియన్ సినిమాస్ పేరిట చాలా థియేటర్లు ఉన్నాయి.





ఎల్బీ నగర్‌లోని షైన్ దవాఖానలో మంగళవారం ప్రాథమిక విచారణకు వచ్చిన బాలల హక్కుల కమిషన్ సభ్యులు అపర్ణ, బృందాధర్‌రావు, అంజన్‌రావు

## 'షైన్'ఘటనపై దర్యాప్తు ముమ్మరం

- ప్రమాదస్థలిని పరిశీలించిన దర్యాప్తు కమిటీ
- అన్ని విభాగాల నివేదికలు కోరిన పోలీసుశాఖ
- పూర్తిస్థాయి నివేదిక వచ్చాక కఠిన చర్యలు

**హైదరాబాద్ సిటీబ్యూరో/ఎల్బీనగర్, నమస్తే తెలంగాణ:** దవాఖాన నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించి ఐసీయూలో నాలుగు నెలల చిన్నారి మృతికి కారణమైన ఎల్బీనగర్ షైన్ చిల్డ్రన్ హాస్పిటల్ యాజమాన్యంపై కఠినచర్యలకు ప్రభుత్వం ఉపక్రమించింది. ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యుడు, వైద్యారోగ్యశాఖ అదనపు కార్యదర్శి రవీంద్రనాయక్ మంగళవారం దవాఖానను సందర్శించారు. ఎల్బీనగర్ డీసీపీ సన్‌ప్రీత్‌సింగ్, ఏసీపీ పృథ్వీధర్‌రావు, సీఐ అశోక్‌రెడ్డితో కలిసి అగ్ని ప్రమాదానికి కారణాలపై అధ్యయనం చేశారు. రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి సోమవారమే ప్రాథమిక రిపోర్టు సమర్పించారని, తదుపరి విచారణ కోసం దవాఖానకు వచ్చానని రవీంద్రనాయక్ తెలిపారు. ప్రమాదం సంభవించడానికి గల కారణాలపై అన్నిశాఖల నుంచి సమాచారం సేకరించి పూర్తిస్థాయి నివేదికను ప్రభుత్వానికి సమర్పిస్తామని తెలిపారు. ఈ ఘటనపై అన్నివిభాగాల నివేదికలు ఇవ్వాలని కోరామని ఏసీపీ పృథ్వీధర్‌రావు తెలిపారు. డీఎంహెచ్‌వో, జీహెచ్‌ఎంసీ, ఫైర్, విద్యుత్‌శాఖ అధికారుల నుంచి అగ్నిప్రమాదానికి గల కారణాలపై నివేదికలు అడిగామని, ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయలేదని స్పష్టంచేశారు. ప్రస్తుతం 304/ఏ ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదుచేసుకొన్న పోలీసులు, నివేదిక వచ్చాక యాజమాన్యంపై హత్యానేరం కింద కేసు నమోదుచేసే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు పొనుగోటి అంజన్‌రావు, బృందాధర్‌రావు, అపర్ణ సైతం ప్రమాదస్థలిని పరిశీలించారు.

### తొక్కిసలాట జరిగితే మరింత నష్టం

షైన్ దవాఖాన భవనానికి ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టిన దాఖలాలు కనిపించలేదు. ఎల్బీనగర్ ఇన్నర్ రింగ్‌రోడ్డులో రోడ్డుకంటే ఎత్తుగా ఉన్న భవనానికి ఒక పక్కన చిన్న మెట్లద్వారానే పైకి చేరుకోవాలి. సోమవారం తెల్లవారుజామున ప్రమాద సమయంలో దవాఖానలో సుమారు 70మంది ఉన్నట్టు సమాచారం. ఐసీయూలో ఉన్న కింది అంతస్థులో ఉన్నవాళ్లు ప్రమాదాన్ని గుర్తించి చాకచక్యంగా కిందికిదిగారు. అందరూ ఒకేసారి దిగేందుకు ప్రయత్నిస్తే తొక్కిసలాట జరిగి ప్రమాద తీవ్రత పెరిగేది.

## చిన్నారుల ఆహార నాణ్యతలో రాజీవద్దు

- అంగన్‌వాడీలకు జాప్యంలేకుండా సరుకులు
- టీఎస్ ఫుడ్స్ సంస్థ అధికారులతో మంత్రి సత్యవతి సమీక్ష



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అంగన్‌వాడీలకు పంపిణీచేసే బాలామృతం, పోషకాహారం, ఇతర ఆహార పదార్థాల నాణ్యతలో రాజీపడవద్దని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అధికారులకు స్పష్టంచేశారు. మంగళవారం ఆమె టీఎస్ ఫుడ్స్ సంస్థను పరిశీలించి ఆహార పదార్థాల తయారీ, ముడిసరుకుల నిల్వ విధానం, తయారైన ఉత్పత్తులను నిల్వచేయడంలో తీసుకుంటున్న జాగ్రత్తలు, కార్మికులకు కల్పించిన వసతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయా శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షలో మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. టీఎస్ ఫుడ్స్‌లో చేపట్టిన రెండు నూతన ప్రాజెక్టులను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని, బాలలకు మరింత నాణ్యమైన ఆహార పదార్థాలను అందించేందుకు కృషిచేయాలని సూచించారు. ఎలాంటి జాప్యం లేకుండా అంగన్‌వాడీలకు సకాలంలో సరుకులు అందేలా చూడాలని, అందుకు తగిన రవాణా వ్యవస్థను ఏర్పాటుచేసుకోవాలని అన్నారు. క్యాజువల్ కార్మికుల క్రమబద్ధీకరణ సమస్యను సీఎం కేసీఆర్‌కు వివరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ సమీక్షలో స్త్రీ, శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి జగదీశ్వర్, కమిషనర్ విజయేంద్రబోయి, నెక్ చైర్మన్ సంజీవ్, టీఎస్ ఫుడ్స్ మేనేజర్లు పాల్గొన్నారు.

## వరుస వర్షాలతో రైతుల్లో ఆందోళన

- కోత దశలో ఉన్న పంటలకు తీవ్రనష్టం
- ఏడువేల హెక్టార్లలో పంట దెబ్బతిన్నట్టు గుర్తింపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు రైతుల్లో గుబులుపుట్టిస్తున్నాయి. ప్రస్తుతం కోత దశలో ఉన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లుతున్నదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఐదు రోజులుగా కురుస్తున్న వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 7 వేల హెక్టార్లలో వివిధరకాల పంటలు దెబ్బతిన్నట్టు వ్యవసాయశాఖ గుర్తించింది. మరో ఐదురోజులు భారీవర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణశాఖ హెచ్చరించడంతో మరింత ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పటికే కొన్ని పంటల ఉత్పత్తులు మార్కెట్‌కు వస్తున్నాయి. మొక్కజొన్న, పెసర, సోయాబీన్ తదితర ఉత్పత్తులను రైతులు మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. వారం రోజుల్లో వరిధాన్యం కూడా రానున్నది. నిజామాబాద్ మార్కెట్‌కు ఇప్పటికే తడిసిన సోయాబీన్‌ను తీసుకొస్తున్నట్టు మార్కెటింగ్‌శాఖ అధికారులు పేర్కొన్నారు. పత్తి పంటకు కూడా ఈ వర్షాలతో తీవ్రనష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నదని చెపుతున్నారు. పలుజిల్లాల్లో పత్తి మొదటితీత కొనసాగుతున్నది. వరుస వర్షాల కారణంగా మొక్కమీదే పత్తి తడవడంతోపాటు, కాయలు కూడా నల్లబారిపోయి బూజుపడుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మహబూబ్‌నగర్ వ్యవసాయ మార్కెట్‌కు సుమారు 400 క్వింటాళ్ల మొక్కజొన్న, నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మార్కెట్ యార్డులో 300 క్వింటాళ్ల మొక్కజొన్న వర్షాలతో తడిసిపోయింది. రాష్ట్రవ్యాప్తంగా ఏడువేల హెక్టార్లలో వివిధ రకాల పంటలు నీటమునిగినట్టు వ్యవసాయాధికారులు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మహబూబ్‌నగర్, ఖమ్మం, వరంగల్, నల్లగొండ జిల్లాల్లో వరి, పత్తి పంటలు దెబ్బతిన్నట్టు పేర్కొన్నారు. ఇప్పటికే కోత దశకు వచ్చిన ధాన్యం తడిసి తేమశాతం ఎక్కువ ఉండి.. మద్దతు ధర తగ్గే అవకాశం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

తెలంగాణ ప్రభుత్వం
వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, తెలంగాణ
(వికలాంగుల సంక్షేమ భవనం, మలక్‌పేట్, హైదరాబాద్-36)
టెండరు ప్రకటన
సామాజిక న్యాయం మరియు సాధికారత మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం వారు వృద్ధాప్య గృహాలను నిర్వహిస్తున్న ఎన్జీఓలకు ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాం ఫర్ సీనియర్ సిటిజెన్స్ స్కీమ్ (ఐపిఎస్‌ఆర్సి) నుండి గ్రాంట్-ఇన్-ఎయిడ్ అందిస్తున్నారు. ఈ క్రింది జిల్లాల నుండి పేరున్న, రిజిస్టర్డ్ మరియు అనుభవమున్న ఎన్జీవోల నుండి గ్రాంట్-ఇన్- ఎయిడ్ కొరకై ప్రతిపాదనలు ఆహ్వానించబడుతున్నాయి. 1. భద్రాద్రి కొత్తగూడెం, 2. జగిత్యాల్, 3. జనగాం, 4. జయశంకర్ భూపాలపల్లి, 5. జోగులాంబ గద్వాల్, 6. కామారెడ్డి, 7. కరీంనగర్, 8. కొమురం భీమ్ ఆసిఫాబాద్, 9. మహబూబాబాద్, 10. మంచిర్యాల, 11. నిర్మల్, 12. పెద్దపల్లి, 13. రాజన్న సిరిసిల్ల, 14. సంగారెడ్డి, 15. సిద్దిపేట, 16. సూర్యాపేట, 17. వికారాబాద్, 18. వనపర్తి, 19. వరంగల్ రూరల్, 20. వరంగల్ అర్బన్, 21. యాదాద్రి భువనగిరి. 25 మంది వృద్ధులతో గత రెండేళ్ళ నుండి వృద్ధాప్య గృహాలను విజయవంతంగా నడుపుతున్న ఎన్జీఓల నుండి పైన పేర్కొన్న జిల్లాల్లో వృద్ధాప్య గృహాలను నడుపుటకు పై పథకం కింద గ్రాంట్ ఇన్ ఎయిడ్ పొందటానికి ఆసక్తి ఉన్నవారు తమ ప్రతిపాదనలను తేది: 25-10-2019న 5.00 గంటలలోపుగాని లేదా అంతకు ముందు గాని సంచాలకుల కార్యాలయము, తెలంగాణ ప్రభుత్వ వికలాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ, హైదరాబాద్ నందు సమర్పించవచ్చును. వివరణాత్మక మార్గదర్శకాలను వెబ్‌సైట్ http//www.socialjustice.nic.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు మరియు మరింత స్పష్టత కోసం శ్రీ జి.సుధాకర్, వయోవృద్ధుల కో-ఆర్డినేటర్, ఫోన్ నం. 7013150172ను సంప్రదించవచ్చు.
సం/- డైరెక్టర్, వికలాంగుల & వయో వృద్ధుల సంక్షేమ శాఖ
DIPR RO. No. 1436-DP/CL/Advt/1/2019-20, Dt: 22/10/2019

## అంధుల సమాఖ్య కార్యదర్శిగా చొక్కారావు ఎన్నిక



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అఖిలభారత అంధుల సమాఖ్య కార్యదర్శిగా నల్లగొండ వాసి పీ చొక్కారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఢిల్లీలో జరిగిన జాతీయ సదస్సులో ఈ ఎన్నిక జరిగింది. రాష్ట్రంలో అంధుల అభివృద్ధి, సంక్షేమ సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఆయన సేవలందిస్తున్నారు.

## 'ప్రతిపౌరుడు మొక్కలు నాటాలి'

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇగ్నైటింగ్ మైండ్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'గ్రీన్ చాలెంజ్'కు మంచి స్పందన లభిస్తున్నదని స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కమిషనర్ టీ చిరంజీవులు తెలిపారు. మంగళవారం ఆయన స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిపౌరుడు మొక్కలు నాటాలని చిరంజీవులు కోరారు.



మొక్కలు నాటుతున్న చిరంజీవులు



రామగిరి కొండపై బయల్పడిన రాళ్లకుప్ప సమాధులు

## సంస్కృతికి చిహ్నం.. రామగిరి!

తెలంగాణ చరిత్ర బృందం ప్రతినిధి రామోజు హరగోపాల్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రానికి సంబంధించిన చారిత్రక అంశాల్లో రామగిరి ఖిల్లా ప్రత్యేకమైనదని తెలంగాణ చరిత్ర బృందం ప్రతినిధి శ్రీరామోజు హరగోపాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ బృందం జరిపిన పరిశీలనలో పూర్వయుగ సంస్కృతికి ఆనవాలుగా నిలిచే అనేక అంశాలు వెలుగుచూశాయని ఆయన వెల్లడించారు. చరిత్ర పూర్వయుగం, తొలి చారిత్రక దశలు, సంస్కృతులను అధ్యయనం చేసేందుకు రామగిరి సరైన ప్రదేశమని పేర్కొన్నారు. రామగిరి ఖిల్లా ఎక్కడం మొదలుపెట్టి మొదటి దర్వాజకు చేరుకోగానే విరిగిన దర్వాజ, మొండికోట కనిపిస్తాయి. విరిగిన ద్వారానికి కుడి పక్కన క్రీ.శ.1478 నాటి తుమ్మీఖాన్ 10 వేల రూకలు ఖర్చుపెట్టి చేయించిన కోట దర్వాజ శాసనం ఉన్నది. ఎడమవైపు గొల్లభామల దిక్కు పోతే పెండ్లిబావి, దానికి 100 మీటర్ల దూరంలోని చిన్న గుహలో లింగం లేని పానవట్టం కనిపిస్తుంది. ఈ గుహలోనే ఎరుపు రంగులోని రాతిచిత్రాలు అగుపిస్తాయి. ఈ చిత్రాల్లో ఒక మనిషి, ఒక ఎద్దు, జంతువుల బొమ్మలు రెండు, మరొక మనిషి బొమ్మ కనిపిస్తాయి. బొద్దుగీతల్లో ఉన్న ఈ చిత్రాలు.. శైలిని, వస్తువును బట్టి దాల్కోలిథిక్ కాలానికి చెందినవని, 4, 5 వేల సంవత్సరాలకు పూర్వానివని తేలింది. ఈ గుహకు అవతలివైపు పదునైన మొన ఉన్న పరికరంతో చెక్కిన గీరబొమ్మలు (పెట్రోగ్లైఫ్స్) ఉన్నాయి. ఈ బొమ్మల్లో ఎడమచేతిలో త్రిశూలం పట్టుకొని నిలబడ్డ వేటగాడు, పక్కన పెద్దపక్షి కనిపిస్తాయి. ఇవి మధ్యరాతియుగం నాటి చిత్రాలు. రామగిరికొండ మీద విశేషమైన సూక్ష్మ రాతి పరికరాలు, అరుదైన రాళ్లకుప్ప సమాధులు.. వాటిలో ఎముకలు లభించినట్టు హరగోపాల్ వివరించారు.



అసోచామ్ అండ్ బీఈఈ అవార్డుతో వచ్చిన న్యాక్ బృందాన్ని అభినందిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి

## న్యాక్ బృందానికి మంత్రి అభినందనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్)కు ప్రతిష్ఠాత్మక నేషనల్ లీడర్‌షిప్ అవార్డు రావడానికి కారకులైన ఆ సంస్థ డైరెక్టర్ జనరల్ కే భిక్షపతితో పాటు, డైరెక్టర్లు, ఉద్యోగులను న్యాక్ వైస్ చైర్మన్, రాష్ట్ర ఆర్‌అండ్‌బీశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అభినందించారు. అసోచామ్ అండ్ బీఈఈ అవార్డుతో డీజీ భిక్షపతి, డైరెక్టర్ శాంతిశ్రీ మంగళవారం మంత్రి ప్రశాంత్‌రెడ్డిని ఆయన చాంబర్‌లో కలిశారు. నిర్మాణ రంగ అభివృద్ధితోపాటు నాణ్యమైన శిక్షణను అందిస్తున్న న్యాక్.. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించాక దాదాపు 74 వేలమందికి శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించినందుకు స్కిల్ డెవలప్‌మెంట్/ఒకేషనల్ ట్రైనింగ్ విభాగంలో సౌత్ అవార్డును కైవసం చేసుకున్నది. ఇటీవల బీహార్‌లోని పాట్నాలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును అందుకున్నది.

## ప్రతి పంచాయతీకి ట్రాక్టర్

- తడి,పొడి చెత్త కోసం రెండు అరలతో ట్రాలీ
- హరితహారం మొక్కల రక్షణకు ట్యాంకర్
- నవంబర్‌లోగా కొనుగోలుచేయాలి
- ఆదేశాలు జారీచేసిన పంచాయతీరాజ్‌శాఖ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పల్లె ప్రగతి ప్రణాళిక స్ఫూర్తి నిరంతరం కొనసాగాలని ప్రభుత్వం భావిస్తున్నది. పంచాయతీలకు ప్రతినెలా విడుదల చేసే రూ.339 కోట్లతో ట్రాక్టర్లను కొనుగోలు చేయాలన్న సీఎం కేసీఆర్ సూచన మేరకు వీలైనంత త్వరగా ట్రాక్టర్లను కొనుగోలు చేయాలని, నవంబర్‌లోగా ప్రతి పంచాయతీలో ట్రాక్టర్లు వినియోగంలో ఉండాలని పంచాయతీరాజ్‌శాఖ ఇటీవల మార్గదర్శకాలు విడుదల చేసింది. పారిశుద్ధ్య కార్మికులు, పంచాయతీ సిబ్బంది నియామకంలో ట్రాక్టర్ డ్రైవింగ్ వచ్చినవారు కచ్చితంగా ఉండాలని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. 500లోపు జనాభా ఉన్న పంచాయతీకి 15 హెచ్‌పీ, 501 నుంచి మూడువేలలోపు జనాభా ఉన్న పంచాయతీకి 20, 21 హెచ్‌పీ, మూడు వేలకుపైగా జనాభా కలిగిన పంచాయతీకి 35 హెచ్‌పీ నుంచి ఆపై కెపాసిటీ గల ట్రాక్టర్ ఉండాలని వెల్లడించారు. తడి చెత్త, పొడి చెత్త సేకరణకు వీలుగా ట్రాక్టర్ ట్రాలీని రెండు అరలుగా విభజించాలని సూచించారు. హరితహారం మొక్కల సంరక్షణకు వాటర్ ట్యాంకర్ కొనుగోలు చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో రహదారులపై గుంతల చదును, పిచ్చి మొక్కల తొలగింపునకు ట్రాక్టర్ బ్లేడ్‌ను కూడా కొనుగోలు చేయాలన్నారు. ట్రాక్టర్ల కొనుగోలు కోసం జిల్లాస్థాయి కమిటీ ఏర్పాటుచేయాలని, ఆ కమిటీకి కలెక్టర్ ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. కన్వీనర్‌గా జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో), డీఆర్‌డీవో, జిల్లా పరిశ్రమల అధికారి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఈ జిల్లా స్థాయి కమిటీలో సభ్యులుగా ఉంటారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఏ పంచాయతీకి ప్రభుత్వం సూచించిన ట్రాక్టర్లు ఎంత కెపాసిటీవి అవసరమో గుర్తించేపనిలో పంచాయతీశాఖ అధికారులు నిమగ్నమయ్యారు. పంచాయతీ పాలకవర్గం, కార్యదర్శులతో సమావేశమై ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ట్రాక్టర్ కొనుగోలుకు పంచాయతీనిధులు ఉన్నాయా? లేకుంటే బ్యాంకు నుంచి అప్పు తీసుకొని తిరిగి చెల్లింపులు జరుపడంపై సమాలోచనలు చేస్తున్నారు. వీటిపై పంచాయతీల నుంచి నివేదిక అందాక ట్రాక్టర్ల కొనుగోలుపై బ్యాంకర్లతో కలెక్టర్ సమావేశమై నిర్ణయం తీసుకోనున్నారు.

# గోదావరి జలాలతో రైతుల కల సాకారం

■ విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం భక్తళాపురం గ్రామ శివారులో డీబీఎం-71 కాల్వ వద్ద గోదావరి జలాలకు పూజలు చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, చిత్రంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్

**పెన్‌పహాడ్:** గోదావరి జలాల రాకతో సూర్యాపేట జిల్లా రైతుల దశాబ్దాల కల నెరవేరిందని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడితే 'మన నీళ్లలో మన వాటా దక్కుతుంది.. ప్రతి నీటి బొట్టును మనం వినియోగించుకుంటాం' అని సీఎం కేసీఆర్ కన్న కలలు నేడు నిజమవుతున్నాయని చెప్పారు. మంగళవారం సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం భక్తళపురం శివారులోని ఎస్సారెస్పీ స్టేజ్-2, డీబీఎం-71 కాల్వ వద్ద జిల్లాకు చేరిన గోదావరి జలాలకు ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌తో కలిసి మంత్రి పూజలు చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు కాంట్రాక్టుల కోసమే కాల్వలు తవ్వాయి తప్ప రైతు సమస్యలు పట్టించుకోలేదని ఆరోపించారు. అందుకు ఉదాహరణ భక్తళాపురం శివారులో డీబీఎం-71 కాల్వ వద్ద అసంపూర్తిగా..అడ్డుగా ఉన్న గెయిల్, హెచ్‌పీసీఎల్ పైపులైన్ పనులేనన్నారు. తాను 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు సొంత ఖర్చులతో కాల్వకు మరమ్మతు చేయించి గోదావరి జలాలు తీసుకొచ్చానని స్పష్టంచేశారు. సూర్యాపేట జిల్లాను సస్యశ్యామలం చేయాలన్నదే కేసీఆర్ సంకల్పమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, సూర్యాపేట రూరల్ జెడ్పీటీసీ జీడి భిక్షం తదితరులు పాల్గొన్నారు.



మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం గుడిరేవు గోదావరి తీరంలోని పద్మల్‌పురి కాకో ఆలయంలో దండారి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్‌తోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. గుస్సాడీ బృందాల ప్రదర్శనలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. అనంతరం అమ్మవారికి పెసర్లు, మినుములు, బబ్బెర గారెలను నైవేద్యంగా సమర్పించి, సామూహిక భోజనాలు చేశారు. - దండేపల్లి



# ఊరూరికి బస్సులు

## విద్యార్థుల కోసం ప్రత్యేక సర్వీసులు

గ్రామాలకు నైట్‌హాల్ట్ బస్సులు

90 శాతానికిపైగా తిరుగుతున్న వాహనాలు

ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో ఇబ్బందులు దూరం

పలుచోట్ల తాత్కాలిక సిబ్బందిపై దాడులు



బస్సులతో కిటకిటలాడుతున్న భువనగిరి బస్‌స్టేషన్

**నమస్తేతెలంగాణ నెట్‌వర్క్:** ఆర్టీసీ ప్రగతిచక్రం ఆగకుండా పరుగులు తీస్తున్నది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడంతో ప్రజా రవాణా ఆటంకం లేకుండా సాగుతున్నది. సమ్మె ప్రభావమే కనబడకుండా బస్సులు యథావిధిగా తిరుగుతున్నాయి. పట్టణాలతోపాటు మారుమూల పల్లెలకు సర్వీసులు నడుస్తుండటంతోపాటు విద్యార్థుల సౌకర్యార్థం నైట్‌హాల్ట్ బస్సులు గ్రామాలకు వెళ్తున్నాయి. 90 శాతానికిపైగా బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేస్తున్నాయి. జనగామ జిల్లాలో బస్సును ఆపివేసేందుకు ప్రయత్నించిన ఆర్టీసీ కార్మికులపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పలుచోట్ల ఆర్టీసీ కార్మికులు తాత్కాలిక డ్రైవర్లు, కండక్టర్లపై దాడులకు దిగడం ఉద్రిక్తంగా మారింది.

✦ కరీంనగర్ రీజియన్ పరిధిలోని నాలుగు జిల్లాల్లో 84.45 శాతం బస్సులు నడిచాయి. రీజియన్‌లో 656 బస్సులు నడవాల్సి ఉండగా 366 ఆర్టీసీ, 188 అద్దె బస్సులు కలిపి మొత్తం 554 బస్సులు తిరిగాయి. 469 బస్సుల్లో టిమ్స్, 85 బస్సుల్లో టికెట్ల ద్వారా చార్జీలు వసూలు చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో 394 బస్సులు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాయి. 313 ఆర్టీసీ బస్సులు, 81 అద్దె బస్సులు తిరిగాయి. వరంగల్ రీజియన్‌లోని 9 డిపోల పరిధిలో 866 బస్సులుండగా, మంగళవారం 611 బస్సులు నడిచాయి.

✦ జనగామ జిల్లాలో మంగళవారం వంద శాతం బస్సులు ప్రయాణికులను చేరవేశాయి. 37 రూట్లలో 109 బస్సులు నడిచాయి. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి జనగామ బస్టాండ్‌లో తనిఖీ చేశారు. ఖమ్మం, సత్తుపల్లి, మధిర డిపోల్లో బస్సులు యథావిధిగా నడిచాయి. ఖమ్మం డిపోలో 17 ఆర్టీసీ, 58 అద్దె బస్సులు, మధిర డిపోలో 11ఆర్టీసీ, 11 అద్దె బస్సులు, సత్తుపల్లి డిపోలో 67 ఆర్టీసీ, 34 అద్దె బస్సులు వివిధ రూట్లలో తిరిగాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అన్ని పట్టణాలతోపాటు మారుమూల పల్లెలకు బస్సులు తిరిగాయి. కొత్తగూడెం డిపోలో 45 ఆర్టీసీ, 22 అద్దె బస్సులు, భద్రాచలంలో 46 ఆర్టీసీ, 23 అద్దె బస్సులు, మణుగూరు డిపోలో 44 ఆర్టీసీ, 21 అద్దె బస్సు సర్వీసులు నడిచాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో 69 ఆర్టీసీ, 31 అద్దె బస్సులు దాదాపు 18 వేల మంది ప్రయాణికులను వివిధ ప్రాంతాలకు చేర్చాయి. జోగుళాంబ గద్వాల జిల్లాలో 74 ఆర్టీసీ, 20 అద్దె బస్సులు, నారాయణపేట జిల్లాలో 35 ఆర్టీసీ, 21 అద్దె బస్సులు, వనపర్తి డిపో పరిధిలో 77 ఆర్టీసీ బస్సులు, 23 అద్దె బస్సులను ఆయా రూట్లలో నడిపించారు. నల్లగొండ జిల్లాలోని బస్టాండులు ప్రయాణికులతో కిటకిటలాడాయి. అన్ని రూట్లలో బస్సులు తిరుగుతున్నాయి. 166 బస్సులు ప్రజలను గమ్యస్థానాలకు చేర్చాయి. సూర్యాపేట డిపోలో 40 ఆర్టీసీ బస్సులు, 10 అద్దె బస్సులు వివిధ రూట్లలో నడిచాయి. కోదాడ డిపో పరిధిలో 45 బస్సులు, యాదగిరిగుట్ట డిపో పరిధిలో 66 బస్సులు ప్రయాణికులకు సేవలందించాయి. వికారాబాద్, తాండూరు, పరిగి డిపోల నుంచి మంగళవారం 166 బస్సులు వివిధ ప్రదేశాలకు ప్రయాణికులను చేరవేశాయి. వికారాబాద్ డిపోలో 82 బస్సులు ఉండగా 29 బస్సులు, తాండూరు డిపోలో 93 బస్సులుండగా 72 బస్సులు, పరిగి డిపోలో 87 బస్సులుండగా 65 బస్సులు వివిధ ప్రాంతాలకు నడిచాయి. జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టు దిగువన ఆర్టీసీ బస్సులను కలెక్టర్ శరత్ తనిఖీ చేశారు. ప్రయాణికులతో మాట్లాడి పలు వివరాలు తెలుసుకున్నారు. టిక్కెట్ చార్జీలు ఎక్కువ వసూలు చేస్తున్నారా? టికెట్లను ఇస్తున్నారా? అని ఆరాతీశారు. కార్మికులు సమ్మె వీడి విధుల్లో చేరాలని మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

**జనగామలో కార్మికులకు చేదు అనుభవం**

ఆర్టీసీ కార్మికులకు జనగామ బస్టాండ్‌లో చేదు అనుభవం ఎదురైంది. బస్టాండ్‌లో తాత్కాలిక డ్రైవర్, కండక్టర్లతోపాటు ప్రయాణికులకు గులాబీ పువ్వులు ఇచ్చి నిరసన వ్యక్తం చేస్తున్న క్రమంలో ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత కారణాలతో సమ్మె చేస్తున్నారని.. పండుగ పూటనే చేయాలా అంటూ మండిపడ్డారు. ఇరువర్గాల మధ్య వాదనలు వేడెక్కడంతో పోలీసులు అక్కడి నుంచి కార్మికులను పంపించారు.

**ఆర్టీసీ తాత్కాలిక డ్రైవర్లపై దాడులు**

జగిత్యాల డిపోలో తాత్కాలిక డ్రైవర్‌గా పని చేస్తున్న వెల్గటూర్ మండలం రాజరాంపల్లెకు చెందిన వెంకటేశ్‌పై ఆర్టీసీ కార్మికులు దాడికి దిగారు. డిపో నుంచి బస్‌ను బయటకు తీసుకువస్తుండగా కార్మికులు బస్సునుఆపి తాత్కాలిక డ్రైవర్, కండక్టర్‌తో వాదనకుదిగి ఆర్టీసీ కండక్టర్ కడారి అంజిరెడ్డి తాత్కాలిక డ్రైవర్ వెంకటేశ్‌పై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు టౌన్ సీఐ జ యేశ్‌రెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో సమ్మెలో ఉన్న ఆర్టీసీ కార్మికులు ఏపీ 29 జెడ్ 0121 నంబర్ బస్సును ఆపి తాత్కాలిక డ్రైవర్‌పై దాడికి యత్నించారు. బస్సు అద్దాన్ని ధ్వంసం చేశారు.



కరీంనగర్ బస్టాండ్‌లో వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న బస్సులు



వికారాబాద్ బస్టాండ్‌లో బస్సుఎక్కుతున్న ప్రయాణికులు



నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల తిరుపతి దేవాలయంలో నిర్మించిన కల్యాణమండపాన్ని మంగళవారం త్రిదండి చినజీయర్‌స్వామి ప్రారంభించారు. కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ప్రముఖ సినీ నిర్మాత దిల్‌రాజు, జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, జడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు. - మోపాల్

## ఆయుష్ కళాశాలల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్

**పోచమ్మమైదాన్ (వరంగల్ అర్బన్):** రాష్ట్రంలోని ఆయుష్ కళాశాలల్లో కన్వీనర్ కోటా సీట్ల భర్తీ కి 23, 24 తేదీల్లో వెబ్ ఆప్షన్లు (అడిషనల్ మాప్ ఆఫ్ కౌన్సెలింగ్) కు వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు హెల్త్‌వర్సిటీ అధికారులు మంగళవారం రాత్రి నోటిఫికేషన్ జారీచేశారు. ఆయుష్ కళాశాలల్లో బీఏఎంఎస్, బీహెచ్ఎంఎస్, బీయూఎంఎస్, బీఎన్‌వైసీ కోర్సుల్లో మిగిలిన క్యాటగిరీ ఏ సీట్లను భర్తీ చేయనున్నట్టు తెలిపారు. ఖాళీ వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు తెలిపారు. ఆయుష్ కళాశాలల్లో యాజమాన్య కోటా లో సీట్ల భర్తీకి ఈనెల 25న వెబ్ కౌన్సెలింగ్‌కు నోటిఫికేషన్ విడుదల చేశారు. తుది మెరిట్ జాబితాలోని అర్హులైన అభ్యర్థులు 25న ప్రొ ఫెసర్ జీ రాంరెడ్డి దూర విద్య కేంద్రం ఉస్మానియా యూనివర్సిటీ క్యాం పస్ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన సెంటర్‌కు హాజరు కావాలని వారు వివరించారు. పూర్తివివరాలకు www.knruhs.in చూడాలని పేర్కొన్నారు.



కామారెడ్డి జిల్లా మైలారంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ పోచారం

## కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర

స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

**నస్రుల్లాబాద్:** రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం మైలారం ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. స్పీకర్‌మాట్లాడుతూ.. జిల్లాలో 223 కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందన్నారు. ఈఏడాది సుమారు 2 లక్షల ఎకరాల్లో వరిని రైతులు సాగు చేస్తున్నారని, 4.40 లక్షల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశాలు ఉన్నాయని ఆయన తెలిపారు.

## లాటరీ పేరిట టోకరా

■ రూ.4 కోట్లు వచ్చాయంటూ రూ.15 లక్షలకు టోపీ

**జగిత్యాలక్రైం:** లాటరీలో రూ.4 కోట్లు వచ్చాయని, ఆ సొమ్ము మీ ఖాతాలో పడాలంటే కొంతట్యాక్స్ చెల్లించాలంటూ అపరిచిత వ్యక్తి రూ.15 లక్షలు తమ ఖాతాల్లో జమ చేయించుకున్న ఘటన జగిత్యాలలో చోటు చేసుకున్నది. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం నక్కలపేటకు చెందిన సుతారి కారి రాజశేఖర్, జమున జిల్లాకేంద్రంలోని అరవింద్‌నగర్‌లో నివాసముంటున్నారు. వీరికి ఇటీవల రూ.4 కోట్ల లాటరీ తగిలిందంటూ డెస్మాండ్ డేనియల్ అనే వ్యక్తి 85068 94207 నంబర్ నుంచి ఫోన్‌చేశాడు. లాటరీని నగదుగా మార్చుకొనేందుకు ట్యాక్స్ చెల్లించాల్సి ఉంటుందని నమ్మించాడు. జమున వారికి విడతలవారీగా రూ. 15,42,670 జమచేశారు. మరి కొంత జమచేయాలని చెప్పడంతో అనుమానం వచ్చి ఫోన్ చేయగా ఫోన్లు ఎత్తకపోవడంతో మోసపోయామని గ్రహించి బాధితులు సోమవారం పోలీసులను ఆశ్రయించారు.

# కృష్ణమ్మకు మళ్లీ పోటెత్తిన వరద

జూరాలకు 2.65 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

28 గేట్ల ద్వారా దిగువకు విడుదల

శ్రీశైలానికి 3.36 లక్షల క్యూసెక్కులు

శ్రీరాంసాగర్‌కు స్థిరంగా వరద



మంగళ వారం జూరాల నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/నెట్‌వర్క్:** కృష్ణా బేసిన్‌కు మళ్లీ వరద పోటెత్తింది. ఎగువన ఆల్మట్టి మొదలు నాగార్జున సాగర్ దాకా లక్షలాది క్యూసెక్కుల నీరు పరవళ్లు తొక్కుతున్నది. మంగళవారం వరద ఉధృతి మరింత పెరగగా, మరోసారి గేట్లు ఎత్తేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మంగళవారం ఆల్మట్టి జలాశయానికి 1.85 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా అధికారులు 2.50 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. నారాయణపుర జలాశయానికి ఇన్‌ఫ్లో 2.30 లక్షలకు పెరిగింది. అవుట్‌ఫ్లో 2.57 లక్షల క్యూసెక్కుల వరకు నమోదవుతుండగా.. ఉజ్జయిని నుంచి 10 వేల క్యూసెక్కుల వరద ప్రధాన కృష్ణాలోకి చేరుతున్నది. జూరాల జలాశయం వద్ద మంగళవారం రాత్రి 9 గంటలకు 2.65 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. జూరాల అవుట్‌ఫ్లో 2.92 లక్షలకుతోడు తుంగభద్ర నుంచి 1.50 లక్షల పైచిలుకు అవుట్‌ఫ్లో వస్తుండటంతో శ్రీశైలం జలాశయంలో భారీగా వరద చేరుతున్నది. మంగళవారం సాయంత్రం ఆరు గంటల సమయానికి శ్రీశైలం ఇన్‌ఫ్లో 3.36 లక్షల క్యూసెక్కులు ఉండటం విశేషం. నాగార్జునసాగర్ జలాశయానికి ఇన్‌ఫ్లో 70వేల క్యూసెక్కులున్నది.

**శ్రీరాంసాగర్‌కు కొనసాగుతున్న వరద**

గోదావరి బేసిన్‌లోని శ్రీరాంసాగర్ జలాశయానికి వరద స్థిరంగా కొనసాగుతుంది. జలాశయం నిండుకుండలా మారిన దరిమిలా ఎగువ నుంచి వస్తున్న 45వేల పైచిలుకు క్యూసెక్కుల వరదను వచ్చినట్లుగా అవుట్‌ఫ్లోగా పంపుతున్నారు. శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఇన్‌ఫ్లో 1,798 క్యూసెక్కులుగా ఉండగా... లోయర్ మానేరు డ్యాంకు 4,774 క్యూసెక్కుల వరద వస్తున్నది. కడెంకు 1,143 క్యూసెక్కులు, ఎల్లంపల్లికి 80 వేల క్యూసెక్కుల వరద వస్తుండటంతో 15 గేట్లు ఎత్తి 82 వేల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

**సరస్వతీ బరాజ్‌లో 15 గేట్లు ఎత్తివేత**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన సరస్వతి (అన్నారం) బరాజ్‌లో ఇంజినీర్లు మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఇన్ ఫ్లో 56,500 క్యూసెక్కులు రాగా 10 గేట్లు ఎత్తి 45వేల క్యూసెక్కులు నీటిని దిగువకు వదిలారు. రాత్రి ఏడు గంటలకు ఇన్ ఫ్లో 1.20 లక్షలకు పెరగడంతో 15 గేట్లు ఎత్తి 1.25 లక్షలు క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం 9.85 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్టు ఇంజినీర్లు తెలిపారు.



కరీంనగర్ మార్కెట్ కమిటీ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న గంగుల

## ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సిద్ధం

■ మంత్రి గంగుల కమలాకర్

**కరీంనగర్ రూరల్:** ధాన్యం కొనుగోలు చేసేందుకు రాష్ట్రప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని బీసీ సంక్షేమ మంత్రి గంగుల కమలాకర్ పేర్కొన్నారు. మంగళవారం కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ యార్డులో కరీంనగర్ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతం పరిశీలించి, ఎలక్ట్రానిక్ యంత్రంపై ధాన్యం తూకం వేశారు. 24 శాతం తేమ రావడంతో కల్లాల వద్దనే ఆరబెట్టి తీసుకురావాలని రైతులకు సూచించారు. క్వింటాల్‌కు మద్దతు ధర రూ.1835 దేశంలో ఒక్క తెలంగాణలోనే ఇస్తుందని చెప్పారు. ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, జేసీ జీవీ శ్యామ్‌ప్రసాద్‌లాల్, జిల్లా మార్కెటింగ్ డీడీ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# రానున్న మూడ్రోజులు భారీ వర్షాలు

■ బంగాళాఖాతంలో అల్పపీడనం

■ ఏపీ, తెలంగాణలో భారీ నుంచి అతిభారీ వానలు



నల్లగొండ పట్టణంలో రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీరు



సూర్యాపేట జిల్లా వల్లభాపురంలో రోడ్డుపై మోకాలిలోతు నీరు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉత్తర తమిళనాడు-దక్షిణ కోస్తాంధ్ర తీరాలకు దగ్గరలో పశ్చిమ మధ్య బంగాళాఖాతం దానిని ఆనుకుని ఉన్న నైరుతీ బంగాళాఖాతం ప్రాంతంలో మంగళవారం ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా రానున్న మూడ్రోజులు ఏపీ, తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నదని వాతావరణశాఖ తెలిపింది. మరో 24 గంటల్లో అది మరింత తీవ్రమై ఉత్తర వాయువ్యదిశగా ఆంధ్రప్రదేశ్ తీరం వైపునకు పయనించే అవకాశమున్నదన్నారు. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 5.8 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని, దాని ప్రభావంతో కోస్తా, ఉత్తరాంధ్రతోపాటు రాయలసీమ, తెలంగాణ జిల్లాల్లోనూ ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించారు. బుధ, గురువారాల్లో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవవచ్చని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఇదిలా ఉండగా సోమవారం రాత్రి నుంచి మంగళవారం రాత్రి వరకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, వికారాబాద్ జిల్లాలతోపాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిశాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచే రాయలసీమ, ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి.

**'గ్రేటర్'కు వర్షసూచన**

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ :** ఉపరితల ద్రోణి ప్రభావంతో రాగల మరో మూడు రోజులు గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బుధ, గురువారంలో పలు చోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. మంగళవారం గ్రేటర్ వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడింది. బీహెచ్ఈఎల్ ఫ్యాక్టరీ వద్ద 28.5 మిల్లీ మీటర్లు, మైలార్‌దేవర పల్లిలో 23.0మి.మీ., చార్మినార్ కిలావల్ కమ్యూనిటీ హాల్ 22.5 మి.మీ., సైదాబాద్ వినయ్ నగర్ 21.3మి.మీ., బండ్లగూడ లలిత్‌బాగ్ 20.3మి.మీ., గచ్చిబౌలి రాయదుర్గంలో 16.8మి.మీ., అల్వాల్ వెంకటాపురంలో 16.3మి.మీ., సంతోష్‌నగర్‌లో 16.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా రాజేంద్రనగర్, పటాన్‌చెరు, గండిపేట, బహదూర్‌పుర, సికింద్రాబాద్, హిమాయత్ నగర్, కుత్బుల్లాపూర్‌లో చిరుజల్లులు కురిశాయి.

**పిడుగుపాటుకు వ్యక్తి మృతి, ముగ్గురికి గాయాలు**

**రాయికోడ్:** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని ఖాన్‌జమాల్‌పూర్ శివారులో వ్యవసాయ కూలీ పనులు చేస్తున్న మాటూర్ గ్రామానికి చెందిన ఆశయ్య(40) పిడుగుపాటుతో మృతి చెందారు. మంగళవారం సాయంత్రం వర్షం కురువడంతో చెట్టు కిందకు వెళ్లగా.. పిడుగుపడటంతో ఆశయ్య అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.



సిద్దిపేటలో ప్రజాప్రతినిధులకు నిధుల మంజూరు పత్రాలను అందజేస్తున్న మంత్రి హరీశ్‌రావు

## చింతమడకను ఆదర్శంగా నిలుపుదాం

■ సీఎం కేసీఆర్ లక్ష్యాన్ని సాధిద్దాం

■ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

**సిద్దిపేట కలెక్టరేట్, నమస్తే తెలంగాణ:** సీఎం కేసీఆర్ స్వగ్రామం చింతమడకను అన్నిరంగాల్లో అభివృద్ధిచేసి ఆదర్శంగా నిలుపుదామని మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. మంగళవారం సిద్దిపేట కలెక్టరేట్‌లో చింతమడక, సీతారాంపల్లి, మాచాపూర్ గ్రామాల సమగ్రాభివృద్ధిపై కలెక్టర్ వెంకట్రామ్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్షించారు. సిద్దిపేట మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. 542 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు, 22 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను, నారాయణరావుపేట మండలంలోని 10 గ్రామాల అభివృద్ధి కోసం కేసీఆర్ ప్రకటించిన రూ.5 కోట్ల నిధులకు సంబంధించి మంజూరుపత్రాలను అందించారు. జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.








**11 నిమిషాలు.. 12 బంతులు..**

**సొంతగడ్డపై అప్రతిహత విజయాలతో దూసుకెళ్తున్న భారత్ ఖాతాలో మరో విజయం చేరింది. మూడో రోజు విజయం ముంగిట నిలిచిన టీమ్ఇండియా లాంఛనం పూర్తిచేసింది. నాలుగో రోజు రెండు ఓవర్లలోనే మిగిలిన రెండు వికెట్లు కూల్చిన కోహ్లీసేన.. దక్షిణాఫ్రికాపై తొలిసారి సిరీస్ క్లీన్‌స్వీప్ చేసింది. దీంతో పాటు స్వదేశంలో వరుసగా 11వ సిరీస్‌ను ఒడిసిపట్టి ఆస్ట్రేలియాను తోసిరాజని అగ్రస్థానానికి చేరింది. పనిలోపనిగా ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ లోనూ 240 పాయింట్లతో ఎవరికీ అందనంత ఎత్తులో నిలిచింది. మూడు మ్యాచ్‌ల్లోనూ పైచేయి కనబర్చిన విరాట్ సేన.. సఫారీలను ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగించిందనడం అతిశయోక్తి కాదేమో..!**

**దక్షిణాఫ్రికాపై టెస్టు సిరీస్ క్లీన్ స్వీప్ చేయడం భారత్‌కు ఇదే తొలిసారి. గత పర్యటనలో ఓ టెస్టు 'డ్రా' చేసుకొని మూడింట ఓడిన సఫారీలు.. ఈ సారి వైట్‌వాష్‌కు గురయ్యారు.**

**1**

**ప్రపంచ టెస్టు చాంపియన్ షిప్‌లో భారత్ స్థానం. రెండు సిరీస్‌లు క్లీన్‌స్వీప్ చేసిన కోహ్లీసేన 240 పాయింట్లతో టాప్‌లో ఉంది.**

**దక్షిణాఫ్రికాపై భారత్‌కిదే అతిపెద్ద విజయం. ఇదే సిరీస్ రెండో టెస్టులో ఇన్నింగ్స్ 137 పరుగుల గెలుపు రెండో స్థానానికి చేరింది.**

**1935-36 తర్వాత దక్షిణాఫ్రికా వరుస టెస్టుల్లో ఇన్నింగ్స్ తేడాతో ఓడటం ఇదే తొలిసారి.**

# సఫా చేశారు

## రాంచీ టెస్టులో భారత్ ఘన విజయం

## 3-0తో సిరీస్ క్లీన్‌స్వీప్

## సఫారీలకు వైట్‌వాష్

**రాంచీ:** ప్రహసనం పూర్తైంది. ప్రతిష్ఠాత్మక ఫ్రీడమ్ సిరీస్ భారత్ వశమైంది. మూడో టెస్టు నాలుగోరోజు మిగిలిన రెండు వికెట్లను రెండు ఓవర్లలోనే పడగొట్టిన టీమ్ఇండియా ఇన్నింగ్స్ 202 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. మూడు టెస్టుల్లోనూ సంపూర్ణ ఆధిపత్యం ప్రదర్శించిన కోహ్లీసేన 3-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ చేస్తే.. దక్షిణాఫ్రికా తొలిసారి భారత్ చేతిలో వైట్‌వాష్‌కు గురైంది. సొంత గడ్డపై భారత్‌కు ఇది వరుసగా 11వ టెస్టు సిరీస్ విజయం కాగా.. కెప్టెన్‌గా కోహ్లీకి కూడా 11వ సిరీస్ విజయమే. ఓవర్‌నైట్ స్కోరు 132/8తో మంగళవారం ఆట కొన సాగించిన సఫారీలు.. కేవలం ఒక పరుగు మాత్రమే జతచేసి మిగిలిన రెండు వికెట్లు కోల్పోయారు. షాబాజ్ నదీమ్ వేసిన రెండో ఓవర్‌లో డిబ్రుయన్ (30), రబాడ (0) వరుస బంతుల్లో పెవిలియన్ చేరడంతో భారత్ గెలుపు ఖాయమైంది. సిరీస్‌లో 2 సెంచరీలు, ఓ డబుల్ సెంచరీతో మొత్తం 529 పరుగులు చేసిన నయా ఓపెనర్ రోహిత్ శర్మకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్'అవార్డులు దక్కాయి. ఈ విజయంతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో భారత్ మరో 40 పాయింట్లు ఖాతాలో వేసుకొని 240 పాయింట్లతో అగ్రస్థానాన్ని మరింత పటిష్ఠం చేసుకుంది.

### స్కోరు బోర్డు

**భారత్ తొలి ఇన్నింగ్స్:** 497/9 డిక్లేర్డ్, **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్:** 162, **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** డికాక్ (బి) ఉమేశ్ 5, ఎల్గర్ (రిటైర్డ్ హర్ట్) 16, హమ్జ (బి) షమీ 0, డుప్లెసిస్ (ఎల్బీ) షమీ 4, బవుమా (సి) సాహ (బి) షమీ 0, క్లాసెన్ (ఎల్బీ) ఉమేశ్ 5, లిండే (రనౌట్/నదీమ్) 27, పీట్ (బి) జడేజా 23, డిబ్రుయన్ (సి) సాహ (బి) నదీమ్ 30, రబాడ (సి) జడేజా (బి) అశ్విన్ 12, నోర్జే (నాటౌట్) 5, ఎంగ్డి (సి అండ్ బి) నదీమ్ 0, **ఎక్స్‌ట్రాలు:** 6, **మొత్తం:** 48 ఓవర్లలో 133. **వికెట్ల పతనం:** 1-5, 2-10, 3-18, 4-22, 5-36, 6-67, 7-98, 8-121, 9-133, 10-133, **బౌలింగ్:** షమీ 10-6-10-3, ఉమేశ్ 9-1-35-2, జడేజా 13-5-36-1, నదీమ్ 6-1-18-2, అశ్విన్ 10-3-28-1.

### ఈ దాహం తీరనిది

20, 31, 254, 12.. కెప్టెన్ విరాట్ స్కోర్లివి. తొలి టెస్టు రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ పెద్దగా ఆకట్టుకోలేకపోయిన కోహ్లీ.. పుణెలో లెక్కసరిచేశాడు. ఓ వైపు రోహిత్, మయాంక్ రెచ్చిపోతుంటే.. తానేమి తక్కువ తినలేదన్నట్లు డబుల్ సెంచరీతో అదరగొట్టాడు. అంతకుమించి సిరీస్‌లో తన కెప్టెన్సీతో అభిమానుల మనసులు గెలుచుకున్నాడు. పోరాట పటిమ కనబర్చడంలో వెనక్కి తగ్గని ప్రొటీస్‌ను వరుసగా రెండు టెస్టుల్లోనూ ఫాలోఆన్ ఆడించడం కోహ్లీ దూకుడుకు నిదర్శనం. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో చీకూ కెప్టెన్సీపై ఎన్ని ప్రశ్నలు తలెత్తినా.. సుదీర్ఘ ఫార్మాట్‌లో భారత అత్యుత్తమ కెప్టెన్ అతడేననే విషయాన్ని మరోసారి స్పష్టం చేశాడు. వేదికను బట్టి జట్టును ఎంపిక చేయడంతో పాటు సరైన సమయాల్లో బౌలింగ్ మార్పులు చేసి భళా అనిపించుకున్నాడు. ముఖ్యంగా పుణేలో ట్రిపుల్ సెంచరీ చాన్స్ ఉన్నా.. జట్టు ప్రయోజనాల కోసం ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేయడం కోహ్లీ కెప్టెన్సీ నైపుణ్యానికి అద్దం పడుతున్నది. మూడు టెస్టుల్లోనూ టాస్ నెగ్గడం కూడా కోహ్లీకి కలిసొచ్చిందనే చెప్పాలి.

**11** స్వదేశంలో భారత్‌కిది వరుసగా 11వ సిరీస్ విజయం. 2012-13లో ఇంగ్లండ్ చేతిలో ఓడాక సొంతగడ్డపై భారత్ సిరీస్ కోల్పోలేదు.

సారథిగా విరాట్ కోహ్లీ సిరీస్ విజయాల సంఖ్య.

**4** టెస్టు క్రికెట్ చరిత్రలో దక్షిణాఫ్రికాకు ఇది నాలుగో అతిపెద్ద ఓటమి. భారత్ చేతిలో ఇదే పెద్దది.

**6** సొంతగడ్డపై ప్రత్యర్థిని క్లీన్‌స్వీప్ చేయడం భారత్‌కిది ఆరోసారి.

**7** కోహ్లీ కెప్టెన్సీలో దక్షిణాఫ్రికాతో ఆడిన 10 టెస్టుల్లో భారత్ సాధించిన విజయాలు. కోహ్లీకి ముందు భారత్ సఫారీలపై 29 టెస్టులాడి ఏడింట మాత్రమే నెగ్గింది.

"

టెస్టు ఫార్మాట్‌లో ఓపెనర్‌గా బరిలో దిగిన తొలి సిరీస్‌లోనే రోహిత్ శర్మ అదరగొట్టాడు. ఆందోళనను పక్కకు నెట్టి అద్భుత ప్రదర్శన కనబర్చాడు. ఈ ప్రశంసలకు అతడు అర్హుడు. మయాంక్, జింక్స్ (రహానే) ఆకట్టుకున్నారు. భారత పేసర్ల ఫిట్‌నెస్ లెవల్స్ ఏ స్థాయిలో ఉన్నాయో ఈ సిరీస్ తేటతెల్లం చేసింది. ఆటకన్నా ఆలోచన ధోరణి ఎంతో ముఖ్యం. దాంతోనే విజయాలు సాధించగలం. ఈ సిరీస్‌లో మా ప్రదర్శన బాగుంది. జట్టుగా రాణించడం సానుకూలాంశం. ప్రపంచంలో ఎక్కడైనా మేం విజయం సాధించగలమని నమ్ముతున్నాం.

**- విరాట్ కోహ్లీ, భారత కెప్టెన్.**

**కోచ్, కెప్టెన్ సహకారం వల్లే..**

కెప్టెన్, కోచ్ అందించిన సహకారం ఉపయోగపడింది. ఓపెనర్‌గా అవకాశం ఇచ్చిన జట్టు యాజమాన్యానికి ధన్యవాదాలు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ఓపెనర్ (2013లో)గా దిగినప్పుడే.. ఈ స్థానంలో ఆడాలంటే ప్రత్యేకమైన క్రమశిక్షణ అవసరం అని తెలుసుకున్నా. సంప్రదాయ ఆటలోనూ ఓపెనర్‌గా శుభారంభం దక్కింది. ఒక్కసారి క్రీజులో కుదురుకుంటే ఫార్మాట్ ఏదైనా చెలరేగిపోవచ్చు. ఇలాగే భారీ ఇన్నింగ్స్‌లు ఆడుతూ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాలనుకుంటున్నా.

**-రోహిత్ శర్మ, మ్యాన్ ఆఫ్ ది సిరీస్.**



ప్రతి ఇన్నింగ్స్‌లోనూ భారీ స్కోర్లు నమోదు చేసిన టీమ్ఇండియా మా జట్టును మానసికంగా ఆందోళనలోకి నెట్టేసింది. దీంతో మేము వారికి సరైన పోటీ ఇవ్వలేకపోయాం. ఈ పర్యటనలో భారత బ్యాట్స్‌మెన్ మామీద కనికరం లేకుండా విరుచుకుపడ్డారు. వైజాగ్ టెస్టులో మా ప్రదర్శన ఫర్వాలేదనిపించినా.. సిరీస్ సాగే కొద్దీ దిగజారింది. ఇక భారత సీమర్ల గురించి ఎంత చెప్పినా తక్కువే. మావాళ్లు 30, 40 నిమిషాలు ప్రభావం చూపగలిగిన చోట వారు రోజంతా ధాటిగా బౌలింగ్ చేశారు. ఇది మేము ఊహించనిది. ఓవరాల్‌గా ప్రస్తుతం జోరు మీదున్న టీమ్ఇండియాను ఓడించడం కష్టమైన పని.

**- డుప్లెసిస్, దక్షిణాఫ్రికా కెప్టెన్.**

**ఫెరారీ ప్రయాణంలా..**

ముంబై అయినా.. మెల్‌బోర్న్ అయినా పిచ్‌తో సంబంధం లేకుండా 20 వికెట్లు తీయడమే మా లక్ష్యం. భాడ్ మే గయా పిచ్ (వికెట్ గురించి పట్టించుకోవాల్సిన అవసరమే లేదు) అనే తత్వంతోనే ముందుకు సాగుతున్నాం. ప్రత్యర్థిని రెండు సార్లు ఆలౌట్ చేయగలిగితే ఆ తర్వాత మ్యాచ్‌లు నెగ్గడం ఫెరారీ ప్రయాణమంత సాఫీగా సాగినట్లే. సిరీస్‌లో ప్రతిఒక్కరు ఆకట్టుకున్నారు. రహానే మిడిలార్డర్‌కు నిలకడ తెస్తే.. రోహిత్ తన క్లాస్‌తో ఓపెనింగ్‌ను మరో లెవల్‌కు తీసుకెళ్లాడు.

**- రవిశాస్త్రి, భారత కోచ్.**

# జోరు సాగనీ..

నమస్తే తెలంగాణ క్రీడావిభాగం

**సంధిదశలో** ఉన్న దక్షిణాఫ్రికాతో సొంత గడ్డపై సిరీస్ అనగానే భారత్ విజయం సాధించడం ఖాయమే అని అనిపించినా.. మరీ ఇంత ఏకపక్షంగా గెలుస్తుందని మాత్రం ఎవరూ ఊహించి ఉండరు. అత్యుత్తమ ఆటగాళ్లు అందుబాటులో లేకున్నా.. నాణ్యమైన ప్లేయర్లతో కనిపించిన సఫారీ జట్టు మూడు మ్యాచ్‌లయ్యేసరికి పూర్తిగా తేలిపోయింది. ప్రపంచశ్రేణి పేసర్ రబాడ ఏ మాత్రం ప్రభావం చూపలేకపోగా.. భవిష్యత్ కెప్టెన్‌గా కనిపించిన మార్క్‌రమ్ అసహనంతో గోడకు పంచ్‌కొట్టి గాయపడ్డాడు. ఇక చివరి టెస్టులోనైతే టాస్ సమయంలోనే అదృష్టం కోసం ప్రాక్సీ కెప్టెన్‌గా బవుమాను వెంటతెచ్చుకున్న డుప్లెసిస్.. తుదిజట్టులో ఏకంగా ఐదు మార్పులు చేసినా ఫలితం లేకపోయింది. ఓవరాల్‌గా టీమ్ఇండియా నాలుగు ఇన్నింగ్స్‌ల్లో 1923 పరుగులు చేసి, 25 వికెట్లు మాత్రమే కోల్పోతే.. దక్షిణాఫ్రికా 1381 రన్స్ చేసి ఆరు సార్లు ఆలౌటైంది.

**లేట్‌గా వచ్చినా.. లేటెస్ట్‌గా..**

176, 127, 14, 212.. ఈ సిరీస్‌లో రోహిత్ శర్మ జోరుకు నిదర్శనమే ఈ స్కోర్లు. మొత్తం నాలుగు ఇన్నింగ్స్‌ల్లో హిట్‌మ్యాన్ 529 పరుగులు చేశాడు. కొన్నేళ్లుగా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో ప్రపంచ అత్యుత్తమ ఓపెనర్‌గా మన్ననలందుకుంటున్న రోహిత్.. ఈ సిరీస్‌తో సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ ఆ స్థానంలో తనకు తిరుగులేదని నిరూపించుకున్నాడు. టాపార్డర్‌లో ప్రమోషన్ లభించడంతోనే తనలోని హిట్టర్‌ను మేల్కొలిపిన రోహిత్.. నాలుగు ఇన్నింగ్స్‌ల్లోనే 19 సిక్సర్లు బాది కొత్త ప్రపంచ రికార్డు లిఖించాడు.

**మాయ చేసిన మయాంక్**

215, 7, 108, 10.. సొంతగడ్డపై ఆడుతున్న తొలి సిరీస్‌లో మయాంక్ అగర్వాల్ చేసిన స్కోర్లు. వైజాగ్‌లో అంతా రోహిత్ విధ్వంసం గురించి మాట్లాడుతుంటే.. చాపకింద నీరులా చెలరేగిన మయాంక్ డబుల్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. శతక్కొట్టిన తొలిసారే దాన్ని ద్విశతకంగా మలిచి ఔరా అనిపించాడు.

**జింక్స్ రాక్స్**

15, 27, 59, 115.. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో రహానే చేసిన పరుగులు. సుదీర్ఘ ఫార్మాట్‌లో టీమ్ఇండియా వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న జింక్స్ అవసరమైన సమయాల్లో కీలక ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకున్నాడు. ముఖ్యంగా రాంచీ టెస్టులో సెంచరీ చేసి మూడేండ్లుగా సొంతగడ్డపై శతకం చేయలేకపోతున్నాననే భారాన్ని తనపై నుంచి దింపుకున్నాడు.

**జడ్డూ జాదూ**

30, 40, 91, 51.. ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా చేసిన స్కోర్లు. ఈ సిరీస్‌లో జడ్డూ స్పిన్నర్‌గా కంటే ఎక్కువ బ్యాట్స్‌మెన్‌గానే చక్కటి ముద్ర వేశాడు. ఎంతలా అంటే.. తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో వేగంగా పరుగులు చేసి డిక్లేర్ చేయాల్సిన దశలో కోహ్లీ తనకంటే ముందు జడేజాను బ్యాటింగ్‌కు పంపాడు. దాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకున్న 'సర్'జడేజా కెప్టెన్ నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు.సొంతగడ్డపై అనూహ్యమైన టర్న్, బౌన్స్ లభించే చోట పంత్ పనికిరాడని.. అతడి స్థానంలో సీనియర్ కీపర్ వృద్ధిమాన్ సాహాకు అవకాశం ఇస్తే అతడూ కెప్టెన్ విశ్వాసాన్ని చూరగొన్నాడు. పుణె టెస్టులో డిబ్రుయన్ బంతిని ఎడమవైపు డైవ్ చేస్తూ అందుకున్న వృద్ధిమాన్.. చివరి మ్యాచ్‌లో తనకంటే చాలా ఎత్తుగా వెళ్తున్న డికాక్ క్యాచ్‌ను రెప్పపాటులో ఒడిసిపట్టి ఔరా అనిపించాడు.

**పేస్ పవర్**

భారత గడ్డపై టెస్టు సిరీస్ అంటే.. స్పిన్నర్లకు వికెట్ల జాతరే అనేది జగమెరిగిన సత్యం. అయితే ఈ సారి అందుకు భిన్నంగా.. స్పిన్నర్లతో పోటీపడి పేసర్లు వికెట్లు పడగొట్టారు. సంఖ్య పక్కన పెడితే టాపార్డర్‌ను కూల్చడంలో పేస్ బౌలర్లే ప్రధాన పాత్ర పోషించారు. 3 టెస్టులాడిన షమీ 13 వికెట్లు పడగొడితే.. ఉమేశ్ రెండు మ్యాచ్‌ల్లో 11 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఇషాంత్ 2 వికెట్లు తీశాడు. మొత్తంగా ముగ్గురు కలిపి 26 వికెట్లు పడగొట్టారు. వైజాగ్ టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో షమీ 5 వికెట్లు పడగొట్టిన తీరు ఎంత చెప్పినా తక్కువే.సుదీర్ఘకాలంగా బెంచ్‌కే పరిమితమవుతూ వస్తున్న ఉమేశ్ యాదవ్ చివరి రెండు టెస్టుల్లో సత్తాచాటాడు.

**తిప్పేసిన్ యాష్, జడ్డూ**

టెస్టుల్లో మా తొలి ప్రాధాన్య స్పిన్నర్ రవిచంద్రన్ అశ్వినే అని సిరీస్ ప్రారంభానికి ముందు కోహ్లీ అన్న మాటలను అశ్విన్ (15 వికెట్లు) నిజమని నిరూపించాడు. వైజాగ్‌లో సఫారీ బ్యాట్స్‌మెన్ దంచికొడుతున్న సమయంలో 7 వికెట్లు పడగొట్టి తనలో చేవ తగ్గలేదని చాటాడు. చూస్తుండగానే చకచకా ఓవర్లు ముగించే జడేజా (13 వికెట్లు) కూడా కీలక సమయాల్లో వికెట్లు తీసి ఆకట్టుకున్నాడు. దేశవాళీల్లో వందలకొద్ది వికెట్లు పడగొట్టిన షాబాజ్ నదీమ్‌కు సొంతగడ్డపై అరంగేట్రం ఛాన్స్ వస్తే.. నాలుగు వికెట్లు పడగొట్టి శుభారంభం చేశాడు.




### టెస్టులకు శాశ్వత వేదికలు..!

సుదీర్ఘకాలం నుంచి సంప్రదాయ క్రికెట్‌కు పెద్దపీట వేస్తున్న ఇంగ్లండ్, ఆస్ట్రేలియా తరహాలో మన దేశంలోనూ టెస్టు మ్యాచ్‌లకు శాశ్వత వేదికలు ఏర్పాటు చేస్తే బాగుంటుందని టీమ్ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ అభిప్రాయపడ్డాడు. ఆసీస్‌లో మెల్‌బోర్న్, సిడ్నీ, పెర్త్, బ్రిస్బేన్, అడిలైడ్‌లో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. అదే ఇంగ్లండ్‌లో అయితే.. లార్డ్స్, ఓవల్, ట్రెంట్‌బ్రిడ్జ్, ఓల్డ్ ట్రాఫోర్డ్, ఎడ్జ్‌బాస్టన్, సౌథాంప్టన్, హెడింగ్లే వేదికలవుతాయి. ఇలా భారత్‌లో కూడా నిర్దిష్టమైన ఓ ఐదు వేదికలు ఉంటే బాగుంటుందని కోహ్లీ పేర్కొన్నాడు. 'మనకూ ఐదు టెస్టు వేదికలుంటే మంచిది. సుదీర్ఘ ఫార్మాట్‌కు వన్నె తేవాలంటే శాశ్వత వేదికలు ఉండాల్సిందే' అని కోహ్లీ అన్నాడు.

### ధోనీ గురించి దాదా మాట్లాడలేదు: కోహ్లీ

మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ భవితవ్యంపై.. అతణ్ని అడిగి తెలుసుకుంటానని బీసీసీఐ అధ్యక్ష బాధ్యతలు చేపట్టనున్న సౌరవ్ గంగూలీ వ్యాఖ్యానించిన నేపథ్యంలో.. కోహ్లీ, దాదా ఈ అంశంపై చర్చించుకున్నారా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే తాజాగా కోహ్లీ మాట్లాడుతూ.. 'ధోనీ కెరీర్ గురించి గంగూలీ ఇప్పటివరకు నాతో మాట్లాడలేదు. బీసీసీఐ కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న దాదాకు అభినందనలు. గంగూలీ బీసీసీఐ ప్రెసిడెంట్‌గా రావడం గొప్పగా ఉంది. ఇప్పటివరకు ధోనీ గురించి కానీ జట్టు గురించి కానీ దాదా నాతో ఏమీ మాట్లాడలేదు' అని విరాట్ స్పష్టం చేశాడు.



## టోక్యోకు నిఖత్‌ను ఎంపిక చేయండి

### కేంద్ర మంత్రికి క్రీడా మంత్రి శ్రీనివాస్ గౌడ్ లేఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో నిలకడగా రాణిస్తూ పతకాలు కొల్లగొడుతున్న రాష్ట్ర యువ బాక్సర్ నిఖత్ జరీన్‌ను టోక్యో (2020) ఒలింపిక్స్ క్వాలిఫయర్స్‌కు ఎంపిక చేయాలని రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఈ మేరకు మంగళవారం కేంద్ర క్రీడాశాఖ మంత్రి కిరణ్ రిజిజు, భారత క్రీడా ప్రాధికార సంస్థ (సాయ్) డైరెక్టర్ జనరల్‌కు మంత్రి శ్రీనివాస్ గౌడ్ లేఖ రాశారు. అంచలంచెలుగా ఎదుగుతూ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నదని మంత్రి ప్రశంసించారు. అద్భుత ప్రతిభ కలిగిన జరీన్‌కు ఒలింపిక్స్‌లో అవకాశమిస్తే పతకం సాధించే అవకాశముందని ఆయన అన్నారు. జరీన్ ఎంపికపై సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళుతానని ఆమె తండ్రి జమీల్ అహ్మద్‌కు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో సాట్స్ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు హర్షిత



**సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీలకు హైదరాబాద్ విద్యార్థిని డీఎం హర్షిత ఎంపికైంది. ఈనెల ఆరంభంలో ఆదిలాబాద్‌లో జరిగిన అంతర్‌జిల్లాల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ టోర్నీలో పోటీపడ్డ హర్షిత 50మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 100మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్, 200మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికైంది.

# సింధు శుభారంభం

**పారిస్ :** భారత స్టార్ షట్లర్ వీపీ సింధు.. ఫ్రెంచ్ ఓపెన్‌లో శుభారంభం చేసింది. మంగళవారం ఇక్కడ జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ చాంపియన్ సింధు 21-15, 21-13తేడాతో మిషెల్లీ లీ(కెనడా)పై సునాయాస విజయం సాధించింది. 44 నిమిషాల పాటు మ్యాచ్ జరుగగా.. తొలి గేమ్‌లో ఓ దశలో 2-5తో వెనుకబడ్డ భారత ప్లేయర్ ఆ తర్వాత పుంజుకుంది. 8-8తో పాయింట్లు సమమయ్యాక వెనక్కి తిరిగిచూసుకోలేదు. ఓ దశలో వరుసగా ఐదు పాయింట్లు సాధించడం సహా 21-15తో గేమ్‌ను తెలుగమ్మాయి సొంతం చేసుకుంది. రెండో గేమ్ సైతం హోరాహోరీగా సాగగా.. సింధు 8-10తో వెనుకబడింది. ఆ తరుణంలో దూకుడు ప్రదర్శించిన సింధు వరుసగా ఏడు పాయింట్లు సాధించి ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత కూడా జోరును కొనసాగించి ప్రత్యర్థిని అలవోకగా ఓడించింది. రెండో రౌండ్‌లో 26వ ర్యాంకర్ యే జియామిన్(సింగపూర్)తో సింధు తలపడనుంది. ఇక పురుషుల సింగిల్స్‌లో భారత ఆటగాడు శుభంకర్ డే సైతం మంచి ఆరంభాన్ని అందుకున్నాడు. తొలి రౌండ్‌లో శుభంకర్ 15-21, 21-14, 21-17తో టామీ సుగియార్తో(ఇండోనేషియా)పై గంటా 18నిమిషాల పాటు పోరాడి మూడు గేమ్‌ల్లో విజయం సాధించాడు.



## 'భారత్ కీ లక్ష్మి' అంబాసిడర్లుగా సింధు, దీపిక

**ముంబై:** మహిళా సాధికారతను, కృషిని చాటే ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోదీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొస్తున్న 'భారత్ కీ లక్ష్మి' కార్యక్రమానికి బ్రాండ్ అంబాసిడర్లుగా పీవీ సింధు, దీపికా పదుకోన్ ఎంపికయ్యారు. మహిళా సాధికారతను ప్రస్ఫుటిస్తూ ప్రత్యేకంగా రూపొందించిన ఓ వీడియోను ప్రధాని మోదీ సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'భారత నారీశక్తి, పట్టుదల, ధృడ సంకల్పం, అంకితభావాన్ని తెలిపేందుకు ఈ కార్యక్రమాన్ని తీసుకున్నాం. మహిళా సాధికారతకు మద్దతుగా నిలిచేందుకు ఎల్లప్పుడు ముందుంటామని చెప్పదల్చుకున్నాం' అని మోదీ అన్నారు. ఈ వీడియోకు మద్దతుగా నిలుస్తూ సింధు, దీపిక తమ అభిప్రాయాలను ట్విట్టర్ వేదికగా పంచుకున్నారు.

## నేడే దాదాకు పట్టం

**ముంబై :** బీసీసీఐలో దాదా శకం మొదలవనుంది. బుధవారం ఇక్కడ జరిగే బోర్డు వార్షిక సాధారణ సమావేశం (ఏజీఎం)లో బీసీసీఐ 39వ అధ్యక్షుడిగా టీమ్ఇండియా మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీ బాధ్యతలను చేపట్టనున్నాడు.





## చాక్లెట్@రూ.4.3 లక్షలు!

- తయారు చేసిన ఐటీసీ
- గిన్నిస్ బుక్‌లో చోటు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 22:** బహుళ వ్యాపార దిగ్గజం ఐటీసీ గ్రూప్ మంగళవారం ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన చాక్లెట్‌ను ఆవిష్కరించింది. తమ లగ్జరీ చాక్లెట్ బ్రాండ్.. ఫాబెల్లీ ద్వారా దీన్ని పరిచయం చేసింది. 'ట్రినిటీ-ట్రఫ్లెస్ ఎక్స్‌ట్రార్డినెయిర్' పేరుతో వచ్చిన ఈ చాక్లెట్ కిలో ధర రూ.4.3 లక్షలు. దీంతో ఈ చాక్లెట్ గిన్నిస్ బుక్ రికార్డుల్లో నిలిచింది. దీనికోసం ఫ్రాన్స్ స్టార్ చెఫ్ ఫిలిప్పే కాంటిసిని సాయం తీసుకున్నట్లు ఐటీసీ ప్రకటించింది. ఈ లిమిటెడ్ ఎడిషన్ చాక్లెట్లను ఆర్డర్ చేసుకున్న వారికి చేతులతో చెక్కిన ప్రత్యేక చెక్క బాక్స్‌లో అందిస్తున్నామని, ప్రతీ బాక్స్‌లో 15 గ్రాముల 15 చాక్లెట్లు ఉంటాయని ఐటీసీ ఫుడ్ డివిజన్ సీవోవో అనుజ్ రుస్తగి తెలిపారు. అన్ని పన్నులతో కలిపి ఈ బాక్స్ ధర లక్ష రూపాయలన్నా రు. ఒక్కో చాక్లెట్ రూ.6,670 పలుకుతున్నది.

## బ్యాంకింగ్ సమ్మె పాక్షికం

### పాల్గొన్న 4 లక్షల మంది ఉద్యోగులు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 22:** బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాలు చేపట్టిన ఒకరోజు సమ్మెతో దేశవ్యాప్తంగా బ్యాంకింగ్ కార్యకలాపాలు పాక్షికంగా నిలిచిపోయాయి. బ్యాంకింగ్ విలీనాలను, పొదుపు వడ్డీరేట్లను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రభుత్వరంగ బ్యాంకింగ్ ఉద్యోగ సంఘాలు మంగళవారం ఒకరోజు సమ్మె చేస్తున్నట్లు ఇదివరకే ప్రకటించాయి. దేశవ్యాప్తంగా నిర్వహించిన ఈ సమ్మెలో 4 లక్షల మంది ఉద్యోగులు పాల్గొనడంతో బ్యాంకింగ్ కార్యకలాపాలు... ముఖ్యంగా నగదు డిపాజిట్లు, ఉపసంహరణలతో పాటు చెక్ క్లియరెన్స్‌లపై ప్రభావం చూపాయి. కానీ, ప్రైవేట్ రంగ బ్యాంకులు పూర్తిస్థాయిలో పనిచేశాయి. ఉద్యోగులు సమ్మె బాటపట్టడంతో దేశవ్యాప్తంగా అత్యధిక స్థాయిలో ఉన్న ప్రభుత్వరంగ శాఖలు మూతపడ్డాయి. ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్(ఏఐబీఈఏ), బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(బీఈఎఫ్ఐ) చేపట్టిన సమ్మెపై ఇప్పటికే బ్యాంకింగ్ దిగ్గజం ఎస్బీఐ, ఇతర బ్యాంకులు తమ ఖాతాదారులకు సమాచారాన్ని చేరవేశాయి కూడా. మహారాష్ట్రలో 40 వేల సిబ్బంది పాల్గొనడంతో 10 వేల శాఖలు స్థంభించిపోయాయి. తెలంగాణలోనూ బ్యాంకింగ్ ఆర్థిక లావాదేవీలపై సమ్మె ప్రభావం అంతంత మాత్రంగానే కనిపించింది. నగదు డిపాజిట్లు, ఉపసంహరణ, చెక్ క్లియరెన్స్‌లు కాలేవని ఏఐబీఈఏ జాతీయ కార్యదర్శి బీఎస్ రాంబాబు తెలిపారు. ఈ సమ్మెలో ఎస్బీఐ ఉద్యోగులు పాల్గొనలేదని, ఆంధ్రాబ్యాంక్ ఉద్యోగులు ఆందోళన చేయడంతో పూర్తిగా ఈ బ్యాంక్‌కు సంబంధించిన అన్ని రకాల సేవలు నిలిచిపోయాయన్నారు.



హైదరాబాద్‌లో మూతపడిన సెంట్రల్ బ్యాంక్ శాఖ

**మూతపడనున్న మరో 2 వేల శాఖలు**

పది ప్రభుత్వరంగ బ్యాంకులను నాలిగింటిలో విలీనం చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయంతో దేశవ్యాప్తంగా మరో 2 వేల శాఖల వరకు మూతపడనున్నాయని ఏఐబీఈఏ జనరల్ సెక్రటరీ సీహెచ్ వెంకటాచలం తెలిపారు. ఇప్పటికే అనుబంధ బ్యాంకులు ఎస్బీఐలో, దేనా, విజయ బ్యాంకులు బ్యాంక్ ఆఫ్ బరోడాలో విలీనంకావడంతో దాదాపు 3 వేల శాఖల వరకు మూతపడ్డాయన్నారు. ఆగస్టులో పీఎన్‌బీలో ఓబీసీ, యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ కామర్స్, సిండికేట్ బ్యాంక్‌లో కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఆంధ్రాబ్యాంక్, కార్పొరేషన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్‌లో అలహాబాద్ బ్యాంకులను విలీనం చేస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే.

# విచారణ మొదలైంది

### ఇన్ఫోసిస్ చైర్మన్ నందన్ నిలేకని ప్రకటన

## సీఈవో, సీఎఫ్‌వో అనైతిక చర్యలపై సమగ్ర దర్యాప్తు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 22:** సీఈవో సలీల్ పరేఖ్, సీఎఫ్‌వో నిలంజన్ రాయ్‌లపై వచ్చిన అనైతిక చర్యలపై విచారణ చేస్తున్నామని దేశీయ ఐటీ రంగ దిగ్గజం ఇన్ఫోసిస్ చైర్మన్ నందన్ నిలేకని మంగళవారం తెలిపారు. అక్రమ విధానాలతో సంస్థ ఆదాయం, లాభాలను పెంచే ప్రయత్నం చేశారని కంపెనీ విజిల్‌బ్లోవర్లు ఇన్ఫీ బోర్డుకు లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దీనిపై సమగ్ర దర్యాప్తు జరుపుతున్నామని సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకరైన నిలేకని ప్రకటించారు. గత నెల 20న 'నీతిగల ఉద్యోగులు' పేరిట ఈ లేఖను ఇన్ఫీ బోర్డుకు విజిల్‌బ్లోవర్లు పంపారు. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో ఈ నెల 10న సదరు లేఖను ఆడిట్ కమిటీ ముందు పెట్టామని, మరుసటి రోజు బోర్డు నాన్-ఎగ్జిక్యూటివ్ సభ్యుల ఎదుటకు తీసుకెళ్లామని నిలేకని తెలియజేశారు. 'అక్టోబర్ 11న జరిగిన బోర్డు సమావేశం అనంతరం ఈ వ్యవహారంపై స్వతంత్ర అంతర్గత ఆడిటర్లతో ఆడిట్ కమిటీ సంప్రదింపులను ప్రారంభించింది. స్వతంత్ర దర్యాప్తు కోసం శార్దుల్ అమర్‌చంద్ మంగళ్‌దాస్ అండ్ కో న్యాయ సంస్థనూ నియమించింది' అని స్పష్టం చేశారు. కాగా, బోర్డు సభ్యుల్లో ఒకరికి



గత నెల 20న, 30న రెండు ఫిర్యాదులు అందాయని చెప్పారు.

**ఇన్ఫీపై అమెరికా న్యాయ సంస్థ దావా**

ఇన్ఫోసిస్‌పై అమెరికా న్యాయ సంస్థ దావా వేసేందుకు సిద్ధమవుతున్నది. సీఈవో, సీఎఫ్‌వోల అనైతిక చర్యలపై ఇన్ఫోసిస్ బోర్డుతో పాటు అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ కమిషన్‌కు విజిల్‌బ్లోవర్లు లేఖ రాసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అమెరికా న్యాయ సంస్థలు ఇన్ఫీపై చర్యలపట్ల దృష్టి సారించాయి. ఇందులో భాగంగానే సెక్యూరిటీస్ సంబంధిత చర్యల్లో విశేష గుర్తింపున్న రోజెన్ న్యాయ సంస్థ.. వాటాదారుల తరపున అన్నిరకాల లోపాలపై దర్యాప్తును కొనసాగించాలని ఇన్ఫోసిస్‌కు సూచిస్తున్నది. ఇన్ఫోసిస్ మదుపరుల నష్టాలను భర్తీ చేసేందుకు ఓ క్లాస్ యాక్షన్ లాసూట్‌ను రోజెన్ లా సంస్థ సిద్ధం చేస్తున్నది. అవకతవకల ఆరోపణలు వచ్చినప్పుడు అమెరికా స్టాక్ మార్కెట్లలో ట్రేడ్ అవుతున్న షేర్ల కంపెనీలకు ఈ తరహా నోటీసులు సాధారణంగానే వస్తుంటాయి.




### మద్రాసీలు అంటూ చులకన

**ఇన్ఫోసిస్ బోర్డు** సభ్యులనుద్దేశించి సీఈవో సలీల్ పరేఖ్ చాలా చులకనగా మాట్లాడేవారని, జాత్యహంకార వ్యాఖ్యలు చేశారని విజిల్‌బ్లోవర్లు తమ లేఖలో పేర్కొన్నారు. భారీ ఒప్పందాల గురించి వారికి చెప్పినా అర్థం కాదని, వారికి షేర్ విలువ పెరిగితే చాలంటూ బోర్డులోని డీఎన్ ప్రహ్లాద్, డీ సుందరం, కిరణ్ మజుందార్ షాలను పరేఖ్ తేలిగ్గా తీసిపారేశారని చెప్పారు. 'ప్రహ్లాద్, సుందరంలు మద్రాసీలు. ఇక మజుందార్ షా దివా. వెర్రి ప్రశ్నలు వేస్తారు. వారిని మీరు పట్టించుకోనక్కర్లేదు. వదిలేయండి' అని పరేఖ్ అన్నట్లు లేఖలో ఉద్యోగుల బృందం వెల్లడించింది. ఇందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయన్నారు. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ, ఒడిషా, లక్షద్వీప్ వాసులకు ప్రతిభ ఉండదన్నట్లు వ్యవహరించేవారని చెప్పారు. కాగా, ప్రహ్లాద్.. సూర్య సాఫ్ట్‌వేర్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపక సీఈవోగా ఉండగా, సుందరం.. టీవీఎస్ క్యాపిటల్ ఫండ్స్ లిమిటెడ్ వైస్ చైర్మన్, ఎండీగా ఉన్నారు. కిరణ్ మజుందార్ షా.. బయోకాన్ సీఎండీగా ఉన్న సంగతి విదితమే.



## షేర్లు ఢమాల్.. 53 వేల కోట్లు ఆవిరి!

ఇన్ఫోసిస్‌లో వచ్చిన అనైతిక చర్యల ఆరోపణలు ఆ సంస్థ షేర్ విలువను భారీగా నష్టపరిచాయి. మంగళవారం ఒక్కరోజే ఇన్ఫీ షేర్ విలువ దాదాపు 17 శాతం పడిపోయింది. తీవ్ర ఆందోళనకు గురైన మదుపరులు పెద్ద ఎత్తున అమ్మకాలకు తెరతీశారు. ఫలితంగా బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ)లో 16.21 శాతం క్షీణించి రూ.643.30 వద్ద స్థిరపడిన ఇన్ఫీ షేర్.. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ)లో 16.86 శాతం పతనమై రూ.638.30 వద్ద నిలిచింది. గడిచిన ఆరేండ్లకుపైగా కాలంలో ఇన్ఫోసిస్ షేర్ విలువ ఈ స్థాయికి దిగజారడం ఇదే తొలిసారి. 2013 ఏప్రిల్ నాటి కనిష్ఠాన్ని తాకింది. ఒకానొక దశలో రూ.640 స్థాయికి చేరడం గమనార్హం. మరోవైపు మదపరుల సంపద రూ.53, 450.92 కోట్లు హరించుకుపోయింది. బీఎస్ఈలో ప్రస్తుతం ఇన్ఫోసిస్ మార్కెట్ విలువ రూ.2,76,300.08 కోట్లుగా ఉన్నది.

# ఆరు రోజుల ర్యాలీకి బ్రేక్

### సెన్సెక్స్ 335, నిఫ్టీ 73 పాయింట్ల పతనం

**ముంబై, అక్టోబర్ 22:**

దేశీయ స్టాక్ మార్కెట్ల వరుస ర్యాలీకి బ్రేక్ పడింది. వరుసగా ఆరు రోజులపాటు ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన మార్కెట్లకు ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ రూపంలో తగిలిన దెబ్బకు కుదేలైంది. ఇన్ఫీలో సీనియర్ ఉన్నతాధికారులు అనైతికానికి పాల్పడుతున్న సిబ్బందే బోర్డుకు ఫిర్యాదు చేయడం దలాల్‌స్ట్రీట్ వర్గాల్లో ఆందోళనను పెంచింది. ఇన్ఫీలో విశాల్ సిక్కా విషయం మరువకముందే సలీల్ పరేఖ్ ఉదాంతం బయటకు పొక్కడంతో బీఎస్ఈ సెన్సెక్స్ 39 వేల మార్క్ దిగువకు పడిపోయింది. నష్టాల్లో ప్రారంభమైన సూచీ సమయం గడుస్తున్న కొద్దీ తీవ్ర ఒత్తిడికి గురైంది. మధ్యాహ్నానికి అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు కూడా తోడవడంతో 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 334.54 పాయింట్లు(0.85 శాతం) పతనం చెంది 38,963.84 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 38,924.85ని తాకిన సూచీ ఒక దశలో 39,426.47 గరిష్ఠ స్థాయికి చేరుకున్నది. జాతీయ స్టాక్ ఎక్స్చేంజ్ సూచీ నిఫ్టీ 73.50 పాయింట్లు పతనం చెంది 11,588.35 వద్దకు జారుకున్నది. ఇన్ఫోసిస్ షేరు ధర అత్యధికంగా 16.21 శాతం పతనం చెంది టాప్ లూజర్‌గా నిలిచింది. వీటితోపాటు టాటా మోటర్స్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, బజాజ్ ఫైనాన్స్‌లు మూడు శాతానికి పైగా పతనం చెందాయి. కానీ, ఐసీఐసీఐ బ్యాంక్, సన్‌ఫార్మా, బజాజ్ ఆటో, హెచ్‌యూఎల్, హెచ్‌డీఎఫ్‌సీలు మూడు శాతంకు పైగా మార్కెట్ వాటాను పెంచుకున్నాయి. రంగాలవారీగా చూస్తే ఐటీ, టెక్నాలజీ రంగ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతో ఈ రంగ సూచీ ఏడు శాతానికి పైగా నష్టపోయింది. టెలికం, మెటల్, వాహహన రంగ షేర్లు కూడా నష్టాల పాలయ్యాయి. మరోవైపు హెల్త్‌కేర్, కన్జ్యూమర్ డ్యూరబుల్, బ్యాంకెక్స్, ఫైనాన్స్, ఆయిల్ అండ్ గ్యాస్, ఎఫ్ఎంసీజీ, రియల్టీ రంగ షేర్లు మదుపరులను ఆకట్టుకున్నాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ స్వల్పంగా తగ్గుముఖం పట్టగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ మాత్రం స్వల్పంగా పెరిగింది. అతిపెద్ద బ్లూచిప్ కంపెనీల షేర్లలో ప్రాఫిట్ బుకింగ్ జరుగగా, ఇన్ఫోసిస్ దెబ్బకు సెన్సెక్స్ 39 వేల దిగువకు, నిఫ్టీ 11,600 స్థాయి కంటే కిందకు పడిపోయాయని మార్కెట్ పండితులు వెల్లడిస్తున్నారు. బ్యాంకింగ్ రంగ షేర్లు భారీగా లాభపడినప్పటికీ, ఐటీ రంగ షేర్లు కుదేలవడం మొత్తం పతనాన్ని శాసించిందన్నారు. మహారాష్ట్ర, హర్యాన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ బీజేపీకి పట్టం పట్టనున్నట్లు ఎగ్జిట్ పోల్స్ అంచనాలు మార్కెట్ల పతనాన్ని ఏ మాత్రం ఆపలేకపోయాయి. మరోవైపు, గత కొన్ని రోజులుగా పతనాన్ని నమోదు చేసుకుంటున్న రూపాయి ఎట్టకేలకు కోలుకున్నది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 20 పైసలు పెరిగి రూ.70.94 వద్ద ముగిసింది. బ్రెంట్ క్రూడాయిల్ కూడా 59.17 డాలర్ల వద్ద ముగిసింది.




### దూసుకుపోయిన అవంతి షేరు

**హైదరాబాద్‌**కు చెందిన దాణా తయారీ సంస్థ అవంతి ఫీడ్స్ షేరు దూసుకుపోతున్నది. గడిచిన ఆరు సెషన్లలో కంపెనీ షేరు ధర 26.32 శాతం రిటర్నులు పంచింది. గతేడాది కాలంలో 21.86 శాతం పెరిగిన షేరు ధర..ఈ ఏడాది ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 17.49 శాతం లాభపడింది. అక్టోబర్ 22, 2009న రూ.1.47గా ఉన్న కంపెనీ షేరు ధర ప్రస్తుతం రూ.450.60కి చేరుకున్నది. గడిచిన పదేండ్లకాలంలో కంపెనీ షేరు ఏకంగా 30,553 శాతం రిటర్నులు పంచింది. 2009లో సంస్థకు చెందిన లక్ష రూపాయల విలువైన షేర్లను కొనుగోలు చేసుంటే ప్రస్తుతం ఇవి రూ.3.06 కోట్లకు చేరుకోనున్నదన్న మాట. మంగళవారం కూడా కంపెనీ షేరు ధర మరో 10.35 శాతం బలపడి రూ.450.60 వద్ద ముగిసింది. రెండో త్రైమాసికంలో కంపెనీ నికర లాభం 155 శాతం పెరిగి రూ.118.69 కోట్లకు చేరుకోవడం, అమ్మకాలు 41.66 శాతం అధికమై రూ.1,085.28 కోట్లకు చేరాయి.

## యాక్సిస్ బ్యాంక్ నష్టం రూ.112 కోట్లు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 22:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికిగాను రూ. 112 కోట్ల నష్టం సంభవించిందని దేశంలో మూడో అతిపెద్ద ప్రైవేట్ రంగ ఆర్థిక సేవల సంస్థ యాక్సిస్ బ్యాంక్ ప్రకటించింది. ఒకేసారి పన్ను చెల్లింపులు జరుపడం వల్లనే లాభాల్లో గండిపడిందని పేర్కొంది. క్రితం ఏడాది ఇదే సమయంలో బ్యాంక్ రూ.789.61 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసుకున్నది. కార్పొరేట్ పన్నులను మారుస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో బ్యాంక్ రూ.2,138 కోట్ల ఆదాయాన్ని ఒకేసారి కోల్పోయింది. జూలై-సెప్టెంబర్ మధ్యకాలంలో బ్యాంక్ ఆదాయం రూ.15,959.37 కోట్ల నుంచి రూ. 19,333.57 కోట్లకు ఎగబాకినట్లు బీఎస్ఈకి సమాచారం అందించింది. మొండి బకాయిల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించడంతో బ్యాంక్ ఆస్తుల నాణ్యత ప్రమాణాలు మెరుగుపడ్డాయని, దీంతో గత త్రైమాసికంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 5.96 శాతం నుంచి 5.03 శాతానికి తగ్గాయని ఒక ప్రకటనలో వెల్లడించింది. అలాగే నికర ఎన్‌పీఏ కూడా 2.54 శాతం నుంచి 1.99 శాతానికి పరిమితమైంది. నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించినప్పటికీ బ్యాంక్ షేరు ధర స్వల్పంగా పెరిగి రూ.712.70 వద్ద ముగిసింది.

## కొటక్ మహీంద్రా లాభం 2,407 కోట్లు

**న్యూఢిల్లీ, అక్టోబర్ 22:** దేశంలో ప్రముఖ ప్రైవేట్ బ్యాంకింగ్ సేవల సంస్థ కొటక్ మహీంద్రా బ్యాంక్ ఆర్థిక ఫలితాలు ఆకట్టుకున్నాయి. కోర్ ఆదాయం ఇచ్చిన దన్నుతో గడిచిన త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ. 2,407.25 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని ఆర్జించింది. 2018-19 ఏడాది ఇదే త్రైమాసికానికిగాను బ్యాంక్ రూ.1,747.37 కోట్ల లాభాన్ని గడించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే సమయంలో రూ.10,829.08 కోట్లుగా నమోదైన బ్యాంక్ ఆదాయం..ఈసారికిగాను రూ.12, 542.99 కోట్లకు ఎగబాకినట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. వీటిలో వడ్డీల ద్వారా రూ.8,418.75 కోట్లు లభించింది. మొండి బకాయిలను తగ్గించుకోవడానికి బ్యాంక్ చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. గత త్రైమాసికంలో బ్యాంక్ స్థూల నిరర్థక ఆస్తుల విలువ 1.91 శాతం నుంచి 2.17 శాతానికి పెరుగగా, వీటి విలువ రూ.4,302.17 కోట్ల నుంచి రూ.5,475.48 కోట్లకు ఎగబాకింది. నికర ఎన్‌పీఏ 0.82 శాతం(రూ.2,031.59 కోట్లు)గా నమోదయ్యాయి. మొండి బకాయిలను పూడ్చుకోవడానికి గత త్రైమాసికంలో బ్యాంక్ రూ.473.10 కోట్ల నిధులను వెచ్చించింది. ఏకీకృత విషయానికి వస్తే బ్యాంక్ నికర లాభం 51 శాతం ఎగబాకి రూ.1,724 కోట్లకు చేరాయి. బ్యాంక్ షేరు ధర స్వల్పంగా తగ్గి రూ.1,608గా నమోదైంది.




## కోరమాండల్ లాభంలో వృద్ధి

**హైదరాబాద్, అక్టోబర్ 22:** ప్రముఖ ఎరువుల తయారీ సంస్థ కోరమాండల్ ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. సెప్టెంబర్ 30తో ముగిసిన మూడు నెలలకాలానికిగాను కంపెనీ రూ.503 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభాన్ని నమోదు చేసుకున్నది. గతేడాది ఇదే సమయంలో నమోదు చేసుకున్న రూ.366 కోట్లతో పోలిస్తే 37 శాతం వృద్ధి చెందింది. లాభాల్లో వృద్ధిని నమోదు చేసుకున్న సంస్థకు ఆదాయంలో మాత్రం నిరాశే ఎదురైంది. కంపెనీ ఆదాయం రూ.5,018 కోట్ల నుంచి రూ.4,867 కోట్లకు పడిపోయింది. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ సమీర్ గోయల్ మాట్లాడుతూ..గత త్రైమాసికంలో బలమైన వృద్ధిని నమోదు చేసుకున్నాం..అమ్మకాల్లో మిశ్రమ స్పందన వ్యక్తమైనప్పటికీ తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి సారించడం ఇందుకు కలిసొచ్చిందన్నారు. దక్షిణ భారతంలో వర్షాలు సాధారణం కంటే అధికంగా కురియడం సంస్థకు దన్నుగా నిలిచిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో రూ.7,008 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.710 కోట్ల లాభాన్ని ఆర్జించింది.

### మలేషియా
# పామాయిల్ కొనొద్దు

### సభ్యులకు ఎస్ఈఏఐ వాణిజ్య సంఘం ఆదేశం

#### కశ్మీర్ అంశంపై విమర్శలే కారణం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 22:** మలేషియా నుంచి పామాయిల్ కొనుగోళ్లను ఆపేయాలని తమ వర్తక సభ్యులను ఎస్ఈఏఐ వాణిజ్య సంఘం ఆదేశించింది. కశ్మీర్‌పై భారత్ వైఖరిని మలేషియా విమర్శించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్ఈఏఐ అధ్యక్షుడు అతుల్ చతుర్వేదీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రపంచంలో ఇండోనేషియా తర్వాత మలేషియానే పామాయిల్‌ను అధికంగా ఉత్పత్తి, ఎగుమతి చేస్తున్నది. మలేషియా నుంచి పామాయిల్, పామ్ ఆధారిత ఉత్పత్తులను భారత్ పెద్ద ఎత్తున కొనుగోలు చేస్తున్నది. గతేడాది మలేషియా పామాయిల్ ఎగుమతుల్లో భారత్ మూడో స్థానంలో నిలిచింది. 1.63 బిలియన్ డాలర్ల కొనుగోళ్లను చేసింది. మలేషియా జీడీపీలో వెజిటబుల్ ఆయిల్ వాటానే 2.8 శాతంగా ఉన్నది. మొత్తం ఎగుమతుల్లో 4.5 శాతానికి సమానం. దీంతో తాజా నిర్ణయం మలేషియాపై బాగానే ప్రభావం చూపుతుందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. కాగా, భారత్‌కు మలేషియా మొత్తం ఎగుమతులు ఈ ఏడాది మార్చి 31తో ముగిసిన గత ఆర్థిక సంవత్సరం (2018-19)లో 10.8 బిలియన్ డాలర్లుగా నమోదైయ్యాయి. భారత్ నుంచి దిగుమతులు 6.4 బిలియన్ డాలర్లుగా ఉన్నట్లు కేంద్ర గణాంకాలు చెబుతున్నాయి. మలేషియా సరఫరాలు ఆగితే.. భారత్‌కు ప్రత్యామ్నాయ మార్గాలు చాలానే ఉన్నాయని, దేశంలో పామాయిల్ కొరత ఉండబోదని ఎస్ఈఏఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీవీ మెహెతా అన్నారు.



**వ్యాఖ్యల్ని వెనక్కి తీసుకోను**

కశ్మీర్ అంశంపై భారత్ తీరుపట్ల తాను చేసిన వ్యాఖ్యలను వెనుకకు తీసుకోబోనని మలేషియా ప్రధాన మంత్రి మహతీర్ తేల్చిచెప్పారు. మలేషియా పామాయిల్ కొనుగోళ్లను నిషేధిస్తూ ఎస్ఈఏఐ తీసుకున్న నిర్ణయం ప్రభావాన్ని సమీక్షిస్తామన్నారు. ఈ సమస్యను తగువిధంగా పరిష్కరించుకుంటామన్న ధీమాను వ్యక్తం చేశారు. మరోవైపు ఫ్యూచర్స్ ట్రేడింగ్ మార్కెట్‌లో మంగళవారం మలేషియా పామాయిల్ ఫ్యూచర్స్ నష్టాల్లోకి జారుకున్నాయి. ఎస్ఈఏఐ ప్రకటన ప్రభావం స్పష్టంగా కనిపించిందని ట్రేడింగ్ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రెస్టేజ్ ప్రత్యేక ఆఫర్ల గడువు పెంపు

**బెంగళూరు, అక్టోబర్ 22:** గృహోపకరణాల విక్రయంలో అగ్రగామి సంస్థయైన టీటీకే ప్రెస్టేజ్...ప్రస్తుత పండుగ సీజన్‌లో ప్రకటించిన ప్రత్యేక డిస్కౌంట్ ఆఫర్‌ను నవంబర్ 28 వరకు పొడిగించింది. 'శుభుత్సవ్' పేరుతో ప్రకటించిన ఈ ఆఫర్లకింద గృహోపకరణాలు 79 శాతం రాయితీకే విక్రయిస్తున్నది. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధి దినేశ్ గార్గ్ మాట్లాడుతూ..కొనుగోలుదారులకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించడానికి కంపెనీ ఎప్పుడూ కృషి చేస్తున్నదని, ప్రస్తుత పండుగ సీజన్‌లో ప్రకటించిన ఆఫర్లకు వినియోగదారుల నుంచి వస్తున్న విశేష ఆదరణతో ఈ గడువును పొడిగించాల్సి వచ్చిందన్నారు. ఈ ఆఫర్లలో భాగంగా 3,200 ధర కలిగిన ఒమెగా డీలక్స్ 3 పీస్‌ల నాన్-స్టిక్ కుక్‌వేర్‌ను కొనుగోలు చేసిన వారికి 68 శాతం రాయితీ ఇస్తున్నది. అలాగే 10,895 విలువైన ఎడ్జ్ గ్లాస్ టాప్‌ను కొనుగోలు చేసిన వారికి 6,720 విలువైన ఇతర ఉత్పత్తులను ఉచితంగా అందిస్తున్నది సంస్థ.

# డౌన్‌లోడ్‌లో ఎయిర్‌టెల్ స్పీడ్

### అప్‌లోడింగ్‌లో ఐడియాదే హవా.. ఓపెన్‌సిగ్నల్ వెల్లడి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 22:** దేశంలోని 4జీ నెట్‌వర్క్‌ల్లో భారతీ ఎయిర్‌టెల్ అత్యుత్తమమని బ్రిటన్‌కు చెందిన మొబైల్ సేవల విశ్లేషణ సంస్థ ఓపెన్‌సిగ్నల్ ప్రకటించింది. డేటా స్పీడ్, వీడియో అనుభవాల్లో ఎయిర్‌టెల్ టాప్‌లో నిలిచినట్లు స్పష్టం చేసింది. దేశవ్యాప్తంగా అన్ని సర్కిళ్లలో 9.6 ఎంబీపీఎస్ (మెగాబైట్స్ పర్ సెకండ్) డౌన్‌లోడ్ స్పీడ్‌ను ఆగస్టు నెలాఖరుతో ముగిసిన మూడు నెలల్లో ఎయిర్‌టెల్ వినియోగదారులు అందుకుంటున్నట్లు తెలిపింది. ఓపెన్‌సిగ్నల్ లెక్క ప్రకారం 7.9 ఎంబీపీఎస్‌తో వొడాఫోన్ రెండో స్థానంలో ఉండగా, తర్వాతి స్థానాల్లో ఐడియా (7.6 ఎంబీపీఎస్), జియో (6.7 ఎంబీపీఎస్), బీఎస్ఎన్ఎల్ (3.1 ఎంబీపీఎస్) ఉన్నాయి. ఇక అప్‌లోడింగ్‌లో 3.2 ఎంబీపీఎస్‌తో ఐడియా ముందున్నది. వొడాఫోన్ 3.1 ఎంబీపీఎస్‌తో రెండో స్థానంలో ఉండగా, తర్వాతి స్థానాల్లో ఎయిర్‌టెల్ (2.4 ఎంబీపీఎస్), జియో (2.1 ఎంబీపీఎస్), బీఎస్ఎన్ఎల్ (0.9 ఎంబీపీఎస్) ఉన్నాయి.




**అందరికి చేరువలో జియోనే**

ఇదిలావుంటే దేశంలో 4జీ సేవల అందుబాటు విషయంలో మాత్రం జియో అగ్రస్థానంలో నిలిచింది. భారతీయ 4జీ వినియోగదారుల్లో 97.8 శాతం మందికి జియో సేవలు అందుబాటులో ఉన్నాయని వెల్లడించింది. 89.2 శాతం మందికి అందుబాటులో ఉండి ఎయిర్‌టెల్ రెండో స్థానానికి పరిమితమైంది. వొడాఫోన్ 77.4 శాతం, ఐడియా 76.9 శాతంతో తర్వాతి స్థానాల్లో నిలిచాయి. ప్రభుత్వ రంగ టెలికం సంస్థ బీఎస్ఎన్ఎల్‌కు దేశవ్యాప్తంగా 3జీ నెట్‌వర్కే ఉన్న విషయం తెలిసిందే. 4జీ సేవలు పరిమితంగానే ఉన్నాయి. దేశంలోని 42 నగరాల్లో 76.77 లక్షల మొబైల్స్‌ను పరిశీలించి ఈ నివేదికను ఓపెన్‌సిగ్నల్ రూపొందించింది.

**రూ.4,500 కోట్లు చెల్లింపు**

గడిచిన మూడు, నాలుగు రోజుల్లో ప్రైవేట్ రంగ టెలికం సంస్థలు.. టెలికం శాఖకు రూ.4,500 కోట్లకుపైగా స్పెక్ట్రం బకాయిలను చెల్లించాయి. ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ జియో రూ.1,133 కోట్లు, సునీల్ భారతీ మిట్టల్‌కు చెందిన ఎయిర్‌టెల్ రూ.977 కోట్లు చెల్లించగా, వొడాఫోన్ ఐడియా మాత్రం రూ.2,421 కోట్లను తీర్చింది. మొత్తం ఈ మూడు సంస్థలు కలిపి రూ.4,531 కోట్లను చెల్లించాయి.



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ రామేశ్వర్‌రావు

## నేటి నుంచి మైనింగ్‌పై సదస్సు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 'ప్రస్తుత మైనింగ్, భవిష్యత్ పెట్టుబడులు, సమస్యలు-సవాళ్లు' అనే అంశంపై జాతీయ, అంతర్జాతీయ స్థాయి నిపుణులతో బుధవారం నుంచి శుక్రవారం వరకు మూడు రోజులపాటు సదస్సు నిర్వహించనున్నట్టు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఇండియా(ఐఈఐ) తెలంగాణ స్టేట్ సెంటర్ చైర్మన్ రామేశ్వర్ రావు తెలిపారు. మంగళవారం విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఐఈఐ వందేండ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలను చేపడుతున్నామని చెప్పారు. మైనింగ్ రంగంలో అన్వేషణలకు సాంకేతిక విధానాలు, ఇతర అంశాలపై సదస్సులో చర్చిస్తారని పేర్కొన్నారు. తెలంగాణలో అమలు చేస్తున్న మైనింగ్ పాలసీని దేశవ్యాప్తంగా ఇతర రాష్ట్రాలవారు పరిశీలించి.. అక్కడ కొనసాగిస్తున్నారని మైనింగ్ శాఖ డైరెక్టర్ సుశీల్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వం ప్రత్యేక విధానాలతో మైనింగ్ పాలసీ ద్వారా ఆదాయ వనరుల పెంపులో పురోగతి సాధిస్తున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఐఈఐ కన్వీనర్ రమేశ్‌కుమార్, టెక్నికల్ చైర్మన్ వీఎస్ రావు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో మరో రెండు పాయ్ స్టోర్లు

**హైదరాబాద్, అక్టోబర్ 22:** ప్రముఖ ఎలక్ట్రానిక్స్ పరికరాల విక్రయ సంస్థ పాయ్ ఇంటర్నేషనల్.. రాష్ట్రంలో వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నది. ఇప్పటికే పలు రిటైల్ అవుట్‌లెట్లను ఏర్పాటు చేసిన సంస్థ.. తాజాగా హైదరాబాద్‌లో మరో రెండు మెగా స్టోర్లను ప్రారంభించింది. గచ్చిబౌలి, సన్‌సిటీల వద్ద ఏర్పాటు చేసిన ఈ స్టోర్లతో మొత్తం సంఖ్య 222కి చేరుకున్నది. ఈ సందర్భంగా కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ రాజ్‌కుమార్ పాయ్ మాట్లాడుతూ.. 2000లో బెంగళూరులో తన తొలి స్టోర్‌ను ప్రారంభించిన సంస్థ.. ఆ తర్వాత వెనుతిరిగి చూసుకోలేదని, క్రమంగా వ్యాపారాన్ని కర్ణాటకతోపాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు విస్తరించినట్లు చెప్పారు. కాగా, ఈ షోరూం ప్రారంభం సందర్భంగా కొనుగోలుదారులకు 100 శాతం క్యాష్‌బ్యాక్, తక్కువ ధరకే అన్ని రకాల టెక్నాలజీ పరికరాలు, వారెంటీ పెంపు, చౌకగా రుణ సదుపాయం కల్పిస్తున్నది సంస్థ.



పాయ్ గచ్చిబౌలి స్టోర్‌ను ప్రారంభిస్తున్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ


Diwali CELEBRATIONS
All-NEW Vibrant Festive Collection for the Entire Family
షాపింగ్ చేయండి...
గెలుచుకోండి!
ఈ అవకాశం మరికొన్ని రోజులు మాత్రమే
₹ 4 కోట్ల
విలువైన
బహుమతులు
11330 మంది విజేతలు
దసరా బంపర్ డ్రా విజేతలు
Coupon No. Customer_name
VADDANAM-WINNERS
1655064 T.SUMAN
1819798 G.LAXMI
1009212 CH.B.RAJU
BIKE-WINNERS
1403500 BHASKAR RAJU
1569338 S.SAMBHASIVA RAO
275090 D.RAJESHAM
ACTIVA-WINNERS
203867 RISHI
498541 K.VIJAYA
875517 T.PANDA
Customer_name (Coupon No.)
10 GMS NECKLACE-WINNERS
K.HARITHA (26723)
SYED YOUSUF (484632)
P.SWETHA (266800)
V.RAVINDER RAO (1552146)
P.SUDHARSHAN REDDY (537777)
V.SRINIVASULU (92651)
BEEDA JAMATHA (92467)
SWARNA KANTHA (1695138)
M.SRINIVAS (745275)
K.PRIYANKA (360514)
S.VENKATESWARA RAO (1569861)
VARSHA (799568)
B.B.R (1429841)
M.SRI VAISHNAVI (1757370)
K.NARESH (1703668)
M.SUNITHA (62658)
L.ASHOK KUMAR (1775245)
K.VINEELA (336452)
S.VANITHA (1012569)
B.RAMA PRASA (873661)
V.RAM PRASAD (1099253)
K.KAVYA (1728091)
SHARVANHI (1723587)
K.RAJESH (1730185)
P.LAXMI (1834128)
R.VENKATESH (1504066)
T.SHRAVAN KUMAR (115464)
VENU PATIBANDLA (1579762)
V.VARUN (1576245)
M.NARASIMHA (1576510)
CAR-WINNERS
Coupon No: 773433 R. SHARANYA
Coupon No: 715303 K R REDDY
Coupon No: 1574440 SURJ
వీక్లీ డ్రా
32" LED TVs 20, Smart Phones 20
దీపావళీ బంపర్ డ్రా
2 Bikes, 2 Scooties, 100 gms. Gold Vaddanams 2 & 2 Santro Cars
ప్రతిరోజు లక్కీ డ్రా
1gm Gold 50 coins, 50 Silver Glasses (50gm), 20 Pattu Sarees, 50 Mixies & 50 Pressure Cookers
వెడ్డింగ్ టైమ్స్
కంచి, ధర్మవరం, ఆరణి, ఉప్పాడ,
బెనారస్, చందేరీ, భగల్పూరీ, సంబల్పూరీ, పోచంపల్లి, పైఠాని, కళాంకారి, పటోళ శారీస్,
డిజైనర్ శారీస్, డ్రెస్ మెటీరియల్స్ మరియు బ్రాండెడ్ మెన్స్‌వేర్ & కిడ్స్‌వేర్
www.SISMO.in
Follow us on: southindiashoppingmall southindiashopping
మన కరీంనగర్‌లో
₹12850 ₹8995 కంచి సాముద్రిక పట్టు
₹4150 ₹2995 కంచి ఆవిష్కార పట్టు
₹16650 ₹11995 కంచి కళ్యాణ పట్టు
₹4244 ₹2896 కంచి స్వర్ణ పట్టు
₹14295 ₹9950 కంచి గాంధర్వ పట్టు
₹1650 ₹1295 కంచి పసిడి పట్టు
₹2750 ₹1995 కంచి మీనాక్షి పట్టు
₹1950 ₹1495 కంచి పటోల పట్టు
₹8150 ₹5995 కంచి ఆరణి పట్టు
సౌత్ ఇండియా
షాపింగ్ మాల్
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | కర్ణాటక
ఉస్మాన్‌పుర, కరీంనగర్.
ఫోన్: 0878-224 0225


WE Love
THE CHENNAI SHOPPING MALL
ధంతేరాస్
వేడుకలు
17th - 25th October
*Conditions apply.
BEST DEALS THIS DHANTERAS
₹1500 OFF* ON 10 GRMS. 916 GOLD ORNAMENTS
NO MAKING & WASTAGE CHARGES ON GOLD COINS
NO MAKING & WASTAGE CHARGES ON SILVER ARTICLES
₹100 EXTRA ON OLD GOLD EXCHANGE
FLAT 6% WASTAGE ON CHAINS & BANGLES
కంచి పసిడి పట్టు 1650 ₹1095
కంచి మీనాక్షి పట్టు 2750 ₹1795
కంచి స్వర్ణ పట్టు 4244 ₹2696
సాత్విక పట్టు 4150 ₹2795
పరిణయ పట్టు 8150 ₹5795
కంచి సాముద్రిక పట్టు 12850 ₹8795
సప్తకళా పట్టు 14295 ₹9750
మాంగళ్య పట్టు 16650 ₹11795
Wedding COLLECTION
SILK MARK
All Credit Card and Debit Card Accepted Here
వివాహ వైభవం
ఇక్కడినుండే
ప్రారంభం
The CHENNAI SHOPPING MALL
HYDERABAD & SECUNDERABAD
Mangalya Samudrika Pattu vastrakala pattu Parinaya Pattu Saatvika Pattu Kanchi Swarna Pattu Kanchi Meenakshi Pattu Kanchi Pasidi Pattu
Best Price Guarantee
Life Time Free Service
Buy Back Guarantee
Better Exchange Offers
Gold Testing Machine Available in All Showroom

నమస్తే తెలంగాణ
WWW. NTNEWS.COM
జిందగీ
బుధవారం 23 అక్టోబర్ 2019
/nt.zindagi

# అనాథలకూ రిజర్వేషన్ల కోసం..



**పాఠశాలలో చదువుకుంటున్న ఎస్సీ, ఎస్టీ, ఓబిసి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందుతున్నాయి. వీరిని పక్కన బెడితే ఏ ఆధారం లేని అనాథలకు ఎలాంటి సదుపాయం అందడం లేదు. వీరికి విరాళాలు, ఆహారం అందివ్వడం కంటే చదువు, ఉద్యోగాలలో రిజర్వేషన్లు కల్పించాలంటూ సుప్రీమ్ కోర్టును కోరుతున్నదో యువతి.**

రోజురోజుకీ అనాథ బాలికలపై లైగింక దాడులు ఎక్కువవుతున్నాయి. వీరికి 18 ఏండ్లు వచ్చే వరకు తమను తాము కాపాడుకోవాలి. తల్లిదండ్రులు ఉన్నవారి పిల్లలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. దిక్కులేని అనాథలకు కూడా రిజర్వేషన్లు కల్పించాలంటూ పాలోమి ప్రశ్నిస్తున్నది. విద్యాసంస్థల్లో, ప్రభుత్వ ఉద్యోగాలలో అనాథలకు రిజర్వేషన్లు కోరుతున్నది. అంతేకాకుండా ఎస్సీ, ఎస్టీ, ఓబిసి వర్గాల విద్యార్థులకు ఇచ్చే రాష్ట్ర స్కాలర్‌షిప్‌లు, ప్రయోజనాలను అనాథలు పొందాలని 26 ఏండ్ల పాలోమి కోరుతున్నది. ఈమె పదేండ్ల వయసు నుంచే అనాథలతో కలిసి పనిచేస్తున్నది. పాలోమి తల్లి ఐఎఎస్ అధికారి. 2001లో గుజరాత్‌లోని భుజ్‌లో భూకంపం సంభవించింది. అక్కడున్న అనాథలను ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్ అనాథాశ్రమాలలో పిల్లలను ప్రవేశపెట్టడానికి పర్యవేక్షించిన తల్లి పాలోమిని అనాథలకు పరిచయం చేసింది. అప్పటి నుంచి పాలోమి 11 రాష్ర్టాలలోని ఆనాథాశ్రమాలను సందర్శించింది. వారి పరిస్థితులను డాక్యుమెంటరీ చేసింది. ఆమె ప్రయాణాలను అనుసరించి 2015 నవంబర్‌లో వీకెస్ట్ ఆన్ ఎర్త్ ఆర్ఫాన్స్ ఆఫ్ ఇండియా)' అనే పుస్తకం రాసింది. ఈ పుస్తకానికి మాజీ న్యాయమూర్తి జస్టిస్ వి.ఎస్.సిర్పూర్కర్ అమోదం కూడా అందుకున్నది. ప్రారంభంలో ప్రభుత్వాలపై పిటిషన్ వేయడానికి ప్రయత్నించాను. కాని నేను చాలా జడత్వాన్ని ఎదుర్కొన్నాను. అనాథలకు విరాళాలు, ఆహారం కాకుండా వారితో కొంత సమయం గడుపండి. నెలకు రెండుసార్లు ఆనాథాశ్రమాన్ని సందర్శించడానికి ప్రయత్నించండి. వారి చదువుకు కావాల్సిన సదుపాయాలు అందించండి. రోడ్డుపై చేయిచాచి యాచిస్తున్న పిల్లల గురించి తెలుసుకొని అధికారుల వద్దకు తీసుకెళ్లండి' అని మాలోని తేల్చి చెప్పింది.

# బరువు తగ్గండిలా..



**అధిక బరువు చాలామందిని వేధించే సమస్య. బరువు తగ్గడానికి కొందరు ఎవ్వరేది చెప్పినా ఫాలో అవుతుంటారు. ఇంటి వద్దే ఉంటూ ఈ చిన్న చిట్కాలు పాటిస్తే చాలు. అధిక బరువు సమస్య నుంచి బయటపడొచ్చు.**

- బరువు తగ్గాలనుకునేవారు వారానికి ఒకరోజు అన్ని పూటలూ భోజనానికి బదులుగా కూరగాయలూ, ఆకుకూరల సలాడ్ తీసుకుంటే ఫలితం ఉంటుంది. ఇలా చేయడం వల్ల బరువు తగ్గడంతో పాటు వాటిలో ఉండే పోషకాలు, విటమిన్లతో చర్మ నిగారింపు కూడా వస్తుంది.
- తగిన చోటు, సమయం చూసుకొని కూర్చొనే భోజనం చేయాలి. దాంతో ఆహారాన్ని బాగా నములుతారు. ఫలితంగా త్వరగా జీర్ణమవుతుంది. సాధ్యమైనంత చిన్న సైజు ప్లేటులో భోజనం చేస్తే మీకు తెలియకుండానే పూటకు కనీసం 250 క్యాలరీలైనా తగ్గించి తింటారు.
- నిద్రలేచిన గంటలోపే బ్రేక్‌ఫాస్ట్ పూర్తి చేయడం మంచిది. ఆలస్యంగా తినడం వల్ల కొవ్వు పెరిగే అవకాశం ఉంటుంది. మధ్యాహ్నం భోజనానికి ముందు నారింజ లాంటి నిమ్మజాతి పండు సగం తింటే బరువు తగ్గుతారని ఓ పరిశోధనలో వెల్లడైంది.
- రోజూ పాల ఉత్పత్తులు ఎంతో కొంత పరిమాణంలో తీసుకోవాలి. వీటిలోని క్యాల్షియం కొవ్వుని కొంతమేర తగ్గించగలదు. వారంలో మూడు రోజులు గుడ్లు, ఒకపూట చేప తినడం కూడా బరువు తగ్గేందుకు సాయపడుతుంది.
- వ్యాయామం చేసిన తరువాత 30 – 60 నిమిషాల్లోపు భోజనం చేయడం మేలు. కొత్తగా చేరే క్యాలరీలను శరీరం అలసిపోయినప్పుడు వెంటనే ఉపయోగించుకుంటుంది.

# పర్యావరణహిత దీపావళి



**ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉన్నది. చీకట్లు పారదోలే దీపావళి పండుగ భవిష్యత్ తరానికి చీకట్లు మిగిల్చేలా ఉండకూడదని కొంత మంది మహిళలు పర్యావరణహిత దివాళికి శ్రీకారం చుట్టారు.**

ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మహిళలు ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాన్ని ప్రజలకు వివరిస్తూ ప్రత్యామ్నాయ ఉత్పత్తులు అందించడానికి ముందుకొచ్చారు. రాయ్‌పూర్‌లోని మారుమూల గ్రామాల్లోని స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రకృతికి విఘాతం కలిగించని వస్తువులను తయారు చేస్తున్నాయి. 'గోథన్' అనే ప్రాజెక్టు ద్వారా వివిధ రకాల వస్తువులు తయాచేసి చూపించారు. ఆవుపేడ, చింతపండు, పలురకాల మూలికలను ఉపయోగించి సరికొత్త ఉత్పత్తులను అందిస్తున్నారు. ఆవుపేడతో దీపావళికి వినియోగించే 2లక్షల ప్రమిదలను తయారు చేశారు. అగర్‌బత్తులు, మొబైల్ ఫోన్ స్టాండ్లు, కీ చెయిన్ వంటి వస్తువులను అందిస్తునారు. ఆయా వస్తువుల్లో సువాసన వెదజల్లే మూలికలను ఉపయోగించారు. వారు రూపొందించిన ఉత్పత్తులను చూసిన అక్కడి అధికారులు ఆశ్చర్యపోయారు. ఇదే కార్యక్రమాన్ని ఛత్తీస్‌గఢ్‌లోని 1905 గ్రామాల్లో అమలు చేశారు. గోథాన్ ప్రాజెక్టు కింద అక్కడి మహిళలకు అవసరమైన ఆర్థిక సాయాన్ని అందించడంతో చాలామంది ఉపాధి పొందుతున్నారు. దశాబ్దం క్రితం రాయ్‌పూర్ ప్రాంతంలో జల వనరులు అడుగంటడంతో పంటలు పండక అక్కడి ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. అప్పటి నుంచి ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడడాన్ని తమ బాధ్యతగా తీసుకున్నారు. పదేండ్ల నుంచి వారు ప్రకృతికి మేలు చేసే విధానాలనే అనుసరిస్తున్నారు. సేంద్రియ పద్ధతిలో పంటలు పండించి అందరికీ ఆరోగ్యాన్ని పంచుతున్నారు. తమ పరిసరాల్లో చెట్లు నాటుతూ అడవులను పెంచుతున్నారు.











# నాలుగు వసంతాల శ్రేయోభిలాషిటీమ్

**ఈవ్ టీజింగ్‌కు గురైన వారు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసేందుకు ఒకప్పుడు ఒకటికి పదిసార్లు ఆలోచించేవారు. కుటుంబ పరువు పోతుందేమోనని కొందరు, పోలీస్‌స్టేషన్ చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తుందని మరికొందరు ఫిర్యాదు చేసేందుకు వెనుకంజ వేసేవాళ్లు. ఎంతోమంది మహిళలు, యువతులు తాము చేయని తప్పకు కుంగిపోయేవారు. అటువంటి వారిని రక్షించేందుకు తెలంగాణ సర్కారు ముందుకు వచ్చింది. మహిళలపై జరిగే అఘాయిత్యాలను, వేధింపులను అరికట్టేందుకు షీటీమ్స్‌ను ప్రారంభించింది. మహిళల రక్షణ కోసం ప్రారంభించిన షీటీమ్స్‌తో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. షీ టీమ్స్ నీడలా పోకిరీలను వెంటాడుతుండడంతో మహిళలను వేధించేందుకు వారు భయపడుతున్నారు. బాధితులకు షీటీమ్స్ అండగా ఉండటంతో ఫిర్యాదు చేసేందుకు ధైర్యంగా ముందుకొస్తున్నారు. ఆ టీమ్స్ అతివల శ్రేయోభిలాsheలా పనిచేస్తున్నాయి. నాలుగు వసంతాలు పూర్తిచేసుకున్న 'షీటీమ్స్' అక్టోబర్ 24న ఐదో వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ప్రత్యేక కథనం.**

**కార్యాలయాలు,** కళాశాలలు, రైల్వేస్టేషన్లు, బస్టాప్‌లతో పాటు బహిరంగప్రదేశాల్లో మహిళలను, విదారిన్థులను వేధించే వారి భరతం పట్టేందుకు షీ టీమ్స్‌ను రంగంలోకి దింపుతున్నారు. పోకిరీల అగడాలను అరికట్టేందుకు రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కిన వారికి షీటీమ్స్ వారి తల్లిదండ్రుల సమక్షంలోనే కౌన్సెలింగ్ ఇచ్చి మళ్లీ అలాంటి ఉదంతానికి పాల్పడకుండా వారిలో మార్పు తీసుకొస్తున్నారు. ఈవ్‌టీజర్లను పట్టుకోవడంతో పాటు వ్యవహరించాల్సిన తీరుపై షీ టీమ్ సభ్యులు ప్రత్యేక తర్ఫీదు పొందారు. వీరు బస్‌స్టాపులు, బస్సులు, మెట్రో రైల్ స్టేషన్లు, ఎంఎంటీఎస్, మెట్రో రైళ్లలో అమ్మాయిలను వేధిస్తున్న వారిని కనిపెడతారు. రహస్య కెమెరాలతో ఆకతాయిల ఆగడాలను షూట్ చేసి పట్టేస్తారు. దీనికోసం ప్రత్యేక టీమ్‌లు బహిరంగ ప్రదేశాల్లో, రద్దీ ప్రాంతాల్లోనూ నిఘా వేస్తుంటారు. ఆడపిల్లలను వేధించినట్టు కనిపిస్తే అదుపులోకి తీసుకుని వారిలో మార్పు తెస్తున్నారు. మరికొందరికి చేసిన నేరాన్ని బట్టి కఠినంగా శిక్షలూ వేస్తున్నాయి న్యాయస్థానాలు.

### ఇదీ పద్ధతి

ఈయర్ (ఎగ్జామిన్, యాక్సెప్ట్, రిజెక్ట్) పద్ధతితో ఈవ్‌టీజర్ల పరివర్తనలో మార్పు తీసుకొస్తున్నారు షీ టీమ్ సభ్యులు. కౌన్సెలర్లు (మానసిక నిపుణులు) ఈవ్‌టీజర్ల వ్యక్తిత్వాన్ని తెలుసుకునేందుకు వారి కుటుంబ నేపథ్యంతోపాటు స్నేహితులకు సంబంధించిన విషయాలపై ప్రశ్నావళి ఇచ్చి పూర్తి చేయమంటారు. ఈ ప్రశ్నావళి ఆధారంగా కౌన్సెలర్లు అతన్ని పరీక్షిస్తారు. ఈవ్‌టీజింగ్ చేయలేదని తప్పించుకోజూస్తే 'షీటీమ్' బృందాలు షూట్ చేసిన వీడియోను వారి తల్లిదండ్రుల సమక్షంలోనే చూపిస్తారు. ఆ దృశ్యాలను చూసిన తర్వాత వారు ఎటువంటి తప్పు చేశారో తెలుసుకుంటున్నారు. ఇలా ఆడపిల్లలను వేధించే ఆకతాయిల్లో మార్పు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు మన పోలీసులు. ముఖ్యంగా కళాశాల ప్రాంగణాలు, బస్టాండ్‌లు, రైల్వే స్టేషన్‌లు, మాల్స్‌లో ఆకతాయిల బారిన పడిన మహిళలు వాట్సాప్ ద్వారా షీ బృందాలకు ఫిర్యాదు చేస్తున్నారు. సంబంధిత షీటీమ్ బృందాలు మఫ్టీలో వెళ్లి ఈవ్‌టీజర్ల అకృత్యాలను కెమెరాలతో వీడియో తీస్తున్నారు. ఆ వెంటనే ఆకతాయిని పట్టుకొని స్థానిక పోలీసులకు అప్పగిస్తున్నారు. మేజర్ అయితే పెట్టీ కేసులు, మైనర్ అయితే కౌన్సెలింగ్ ఇస్తున్నారు. తద్వారా 90 శాతం మంది తమ తప్పులను తెలుసుకుంటున్నారు. షీ టీమ్స్‌కు చిక్కుతున్న వారిలో యువకులేకాదు, అన్ని వయసుల వారూ ఉండడం గమనార్హం.

### పీడీ యాక్ట్

తెలిసీ తెలియక ఆడవారిని వేధించేవారిని మొదటిసారి హెచ్చరించి, కౌన్సెలింగ్ ఇచ్చి వదిలేస్తారు. కావాలని ఏడిపించినవారిపై పెట్టీ కేసులు పెడుతున్నారు. మరింత తీవ్రమైన నేరం చేస్తే ఎఫ్ఐఆర్ నమోదు చేసి కోర్టుకు పంపుతున్నారు. పదేపదే ఇటువంటి నేరాలకు పాల్పడే వారిపై ప్రివెంటివ్ డిటెన్షన్(పీ.డీ.)యాక్ట్ అమలు చేస్తున్నారు. కేసుల రికార్డు నిర్వహణకు షీ సాఫ్ట్‌వేర్‌ను రూపొందించారు.

### ఆన్‌లైన్ లో ఫిర్యాదులు



మహిళల రక్షణ కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతున్నది. ప్రవాస భారతీయులకు సంబంధించి ప్రత్యేకంగా ఓ విభాగం పనిచేస్తున్నది. మన రాష్ట్రంలో పెండ్లి చేసుకుని ఇతర దేశాల్లో ఉండే మహిళా బాధితులకు మన షీటీమ్ అండగా నిలుస్తున్నది. అటువంటి కేసులను కూడా పరిష్కరిస్తున్నాం. ఆన్‌లైన్ ద్వారా వారి ఫిర్యాదులు నమోదు చేసి విచారణ చేస్తున్నాం. ఇంకా చాలామంది బాధితులు ముందుకు రావాలి. గతంలో మహిళలు, యువతులు పట్టపగలు బయటకు రావాలంటే భయపడేవాళ్లు. షీటీమ్ వారికి అండగా నిలవడంతో వారు ధైర్యంగా ముందుకు వస్తుండడం అభినందనీయం.

**స్వాతి లక్రా,** షీటీమ్ ఇన్‌చార్జీ



### ఆమె సంరక్షణ కోసం ...

మహిళారక్షణలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన షీ–టీమ్స్ నిఘా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. 2014లో హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా ప్రారంభించిన 'షీటీమ్స్'మంచి ఫలితాలు ఇస్తున్నాయి. మహిళలు, బాలికలు, యువతులు, విద్యార్థినులను వేధిస్తున్న ఘటనలపై 100కు డయల్, ఫోన్, వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిపై విచారణ జరిపి బాధితులకు అండగా నిలుస్తున్నారు. షీటీమ్స్ తెలంగాణలోని 33 జిల్లాలకు విస్తరించాయి. జిల్లాల్లో మహిళలపై జరిగే అఘాయిత్యాలను అరికడుతూనే బాధితులకు అవసరమైన కౌన్సెలింగ్ ఇస్తూ వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలపై జరిగే వేధింపులపైనే కాకుండా సోషల్ మీడియా ద్వారా మహిళలను బ్లాక్ మెయిల్ చేసే అకతాయిలనూ కఠినంగా శిక్షిస్తున్నారు. ఈ ఏడాది సెప్టెంబర్ 30 వరకు ఉన్న సమాచారం ప్రకారం 2,587 ఎఫ్ఐఆర్ కేసులు నమోదయ్యాయి. 5,608 మందిపై పెట్టీ కేసులు పెట్టారు. 12,188 మందికి కౌన్సెలింగ్ ఇచ్చి వారిలో మార్పు తీసుకువచ్చారు. బాధితుల గురించిన సమాచారాన్ని గోప్యంగా ఉంచడం వల్ల మరింత మంది కేసులు పెట్టేందుకు ముందుకు వస్తున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా ఫిర్యాదులు నమోదు చేసేందుకు ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్ రూపొందించారు. కొన్ని కేసులను సుమోటోగా స్వీకరించి పరిష్కరిస్తున్నారు. 'భరోసా స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్' ద్వారా బాధిత మహిళలకు పలు అంశాల్లో శిక్షణ ఇచ్చి వారికి ఉపాధి కల్పిస్తున్నారు.

### ఆగడాలకు అడ్డుకట్ట



వయసుతో సంబంధంలేకుండా మహిళలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. వాటిని అరికట్టి ఆడపిల్లలకు అండగా నిలుస్తున్నది షీటీమ్. బహిరంగ ప్రదేశాల్లోనూ, బస్సులు, రైళ్లలో మహిళలకు రక్షణ కల్పించేందుకు పోలీసులు మఫ్టీలో తిరుగుతున్నారు. వారు ఆకతాయిల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. ఎక్కువగా నేరాలు జరిగే ప్రదేశాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. కొంతమంది బాధితులు ఫిర్యాదు చేయడానికే వెనుకాడుతున్నారు. బాధితులు ముందుకు వస్తే వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచి సమస్యను పరిష్కరిస్తాం.

**కవిత,** అడిషనల్ ఎస్పీ విమన్ సేఫ్టీ వింగ్.

### అవగాహనా కార్యక్రమాలు

ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో షీటీమ్ సభ్యులు ఈవ్‌టీజింగ్‌ను నిరోధించడానికి ప్రత్యేక ప్రచారం చేపట్టారు. దీనివల్ల తలెత్తే పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. అందుకోసం ప్రతి కళాశాలలో ఈవ్‌టీజింగ్ వ్యతిరేక కమిటీలు ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పటివరకు ఈవ్‌టీజింగ్‌కు వ్యతిరేకంగా 496పైగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. మల్కాజిగిరి, ఎల్‌బీనగర్, మాదాపూర్, ఐటీ కారిడార్, బాలానగర్, శంషాబాద్ జోన్‌లో 400కు పైగా ఉన్న హాట్‌స్పాట్స్ (ఆకతాయిల వేధింపులపై ఎక్కువ ఫిర్యాదు వచ్చే ప్రాంతాలు)పై షీ టీమ్స్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాయి. అక్కడ పోలీసులు ఉదయం సాయంత్రం వేళల్లో పెట్రోలింగ్ పెంచారు. మరోపక్క ఫోన్‌లో వేధింపులకు గురవుతున్న మహిళలు పోలీసుల భరోసాతో నేరుగా ఠాణాలకు వెళ్లి ఫిర్యాదు చేస్తున్నారు. గతంలోకంటే ఇప్పుడు జనాల్లో చైతన్యం పెరిగింది. అందుకే తమకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసేందుకు ముందుకు వస్తున్నారు. పాఠశాలలు, కాలేజీలు, ట్యుటోరియల్స్, రైల్వేస్టేషన్లు, మాల్స్, బస్తీ తదితర ప్రాంతాల్లో మహిళా చట్టాలపై షీ బృందాలు పూర్తి స్థాయిలో అవగాహన కలిగిస్తున్నాయి. సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేస్తూ భరోసా కల్పిస్తున్నాయి. తద్వారా వేధింపులకు గురైన అతివలు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేస్తున్నారు. నేరుగా ఫోన్ కాల్స్ కూడా చేస్తున్నారు. గతంలో ఠాణా గడప తొక్కేందుకే ఆలోచించిన మహిళలు ఇప్పుడు అవే వేధింపులపై గళం విప్పుతుండడం శుభపరిణామం.

### ఇతర దేశాలకూ ఆదర్శం

తెలంగాణ సర్కారు మహిళల రక్షణ కోసం అమలు చేస్తున్న విధివిధానాలు మంచి ఫలితాలనిస్తున్నాయి. దీంతో ఇతర దేశాలు, రాష్ట్రాలు కూడా షీటీమ్ అనుసరిస్తున్న విధివిధానాలను ఆయా చోట్ల వేర్వేరు పేర్లతో అమలు చేస్తున్నారు. కర్ణాటక, మహారాష్ట్ర , ఆంధ్రప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలు అక్కడి మహిళలను రక్షించేందుకు షీటీమ్ చేపడుతున్న చర్యలనే అనుసరిస్తున్నాయి. కెనడా నుంచి వచ్చిన అక్కడి పోలీసు బృందం తెలంగాణరాష్ట్ర పోలీసు వ్యవస్థపై అధ్యయనం చేశారు. ఇక్కడ మనం అమలు చేసే విధానాలపై వారు ప్రశంసలు కురిపించారు.

**... పసుపులేటి వెంకటేశ్వరరావు**

# తల వెంట్రుకలకు ముల్తానీ మట్టి వాడొచ్చా?



**ముల్తానీ మట్టిని కేవలం ముఖ సౌందర్యానికే పరిమితం చేస్తుంటారు కొందరు. కానీ ముల్తానీ మట్టిని తల వెంట్రుకలకు కూడా వాడొచ్చంటున్నారు బ్యూటీషియన్లు. ముల్తానీ మట్టిని వెంట్రుకలకు పట్టిస్తే ఎలాంటి లాభాలుంటాయో చూద్దాం.**

- ముల్తానీ మట్టిని కేవలం ముఖ సౌందర్యానికే పరిమితం చేయాల్సిన అవసరం లేదు. దీని వల్ల జుట్టుకు సంబంధించిన సమస్యలకు కూడా పరిష్కారం దొరుకుతుంది. కొన్ని పదార్థాలతో కలుపుకొని పూతలా వేసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు.
- జుట్టు జిడ్డుగా మారి అంటుకుంటున్నట్లుగా అవుతుంటే ముల్తానీ మట్టిలో గుడ్డులోని తెల్లసొనను కలుపుకొని రాసుకోవాలి. తలస్నానం చేయబోయే నీటిలో కాస్త నిమ్మరసం కలుపుకుంటే గుడ్డు వాసన తొలగిపోతుంది. ముల్తానీ మట్టిలో కాస్త పెరుగు, నువ్వుల నూనె కలిపి తలకు పట్టించాలి.
- 20 నిమిషాల తర్వాత తలస్నానం చేస్తే జుట్టు రాలిపోకుండా ఒత్తుగా పెరుగుతుంది. కొంత మందికి తలస్నానం చేసిన రెండో రోజే జుట్టు జిడ్డుగా మారిపోతుంది. అలాంటివారు ముల్తానీ మట్టిలో నీళ్లు కలుపుకొని తలకు రాసుకుంటే మంచి ఫలితాలుంటాయి. దీన్ని తరచూ చేయకూడదు.
- చుండ్రు సమస్యలతో బాధపడేవారు కొన్ని మెంతులను రాత్రంతా నానబెట్టి ముద్దలా తయారు చేసుకోవాలి. ఆ మిశ్రమంలో కాస్త ముల్తానీ మట్టిని కలుపుకొని తలకు రాసుకోవాలి. అరగంట తర్వాత తలస్నానం చేస్తే చుండ్రు సమస్య నుంచి పరిష్కారం పొందవచ్చు.
- చుండ్రు సమస్యతో బాధపడుతున్న వారు నిమ్మచెక్కను తలకు రుద్దుకోవాలి. అరగంట తర్వాత తలస్నానం చేస్తే ఫలితం ఉంటుంది. ఇలా వారానికి మూడు రోజులు చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

### వంటింటి చిట్కాలు



- రసానికి చింతపండు నానబెట్టేటప్పుడు చల్లని నీటికి బదులుగా వేడినీటితో నానబెడితే త్వరగా నాని పులుసు బయటకు వస్తుంది.
- పకోడీలకు కలిపిన పిండిని పావుగంటపాటు ఊరనిచ్చి కొన్ని వెల్లుల్లి పాయలను నూరి కలిపితే పకోడీలు కరకరలాడుతూ రుచిగా ఉంటాయి.
- మినపట్ల పిండిలో కప్పు సగ్గుబియ్యం నానబెట్టి, రుబ్బి కలిపితే పిండి అంటుకోకుండా పలుచగా వస్తాయి.
- కోడిగుడ్డు ఉడికించేముందు కొంచెం నిమ్మరసం రాస్తే ఉడుకుతుండగా గుడ్డు పగిలి సొన బయటకు రాదు.
- బత్తాయి పండ్లు నిలువ ఉండి ఆరిపోతే వొలిచేటప్పుడు తొక్క సులభంగా ఊడిరాదు. అందుకు ముందుగా బత్తాయి పండ్లను ఐదు నిమిషాలు వేడి నీటిలో నానబెట్టి వొలిస్తే సులభంగా తొక్కలు ఊడిపోతాయి.

నమస్తే తెలంగాణ
యువ
[ కరీంనగర్ ]
బుధవారం 23 అక్టోబర్ 2019

### మంచిమాట



మీ అపజయాలను తప్పటడుగులుగా ఎప్పుడూ అనుకోకండి! అవి తప్పులు కావు.. భవిష్యత్‌లో మీరేం చేయరాదో తెలిపే పాఠాలు

- అబ్దుల్ కలాం

### వాట్సప్ మెసేజ్

అద్దాలమేడలో ఉన్నవాడు అబద్ధం చెప్పినా నిజమే అనుకుంటారు..
గుడిసెలో ఉన్నవాడు నిజం చెప్పినా అబద్ధమనే అంటారు..
ఈ సమాజం మనిషిని నమ్మదు. మనిషి వెనుకున్న ఆస్తిని నమ్ముతుంది.

### ఏం డైలాగ్ గురూ..



అమ్మ తొమ్మిది నెలలు కష్టపడితే పుట్టామనుకుంటారు కొందరు. కాదు నాన్న పక్కన పది నిమిషాలు సుఖపడితే పుట్టారనుకుంటారు ఇంకొందరు. రెండూ నిజాలే. కానీ పురిటి నొప్పుల్ని చూసినవాడు మనిషవుతాడు. పడక సుఖాన్ని చూసినవాడు పశువవుతాడు.

సినిమా: (కృష్ణం వందే జగద్గురుమ్)

### నవ్వుకొందాం

**శేఖర్:** మా ఆవిడకు నేనంటే ఎంతో ప్రేమ.. తెల్సా? అర్ధరాత్రయినా వేడి నీళ్లు పెట్టమంటే కాదనకుండా పెడుతుంది. కొబ్బరిపీచు, సున్నిపిండి.. ఇలా ఏదడిగినా కాదనదు మరి!

**శ్రీను:** (ఆశ్చర్యంగా) అంత అర్ధరాత్రిపూట, నీకు వేడినీళ్లు, కొబ్బరి పీచు, సున్నిపిండి దేనికసలు?

**శేఖర్:** భలేవాడివే! అంత రాత్రి పూట గిన్నెలు తోమాలంటే అవన్నీ కావాలి కదా..

# కొత్త హాస్యావధానులు!

కాలం మారింది.. పరిస్థితులు మారాయ్.. మనసుల స్వభావమూ మారింది. కాలానికి, పరిస్థితులకు, మనుషుల స్వభావానికి తగ్గట్లుగానే హాస్యంలోనూ మార్పులొచ్చాయి. ఇన్నాళ్లూ హాస్యావధానం అంటే.. పృచ్ఛకులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పి.. సభికులను కడుపుబ్బా నవ్వించడం. ఈ తరహా హాస్యావధానం నుంచి వచ్చిందే 'ఇంప్రోవ్ కామెడీ'. ఈ కొత్త తరహా హాస్యవల్లరి ఇన్నాళ్లూ విదేశాల్లో, ఉత్తర భారతంలోనే అందుబాటులో ఉండేది. ఇప్పుడు హైదరాబాద్‌కూ వచ్చేసింది. తెలుగులోనూ సభికులను కడుపుబ్బా నవ్విస్తున్నది.




బుక్‌మై షో వెబ్‌సైట్‌లో.. 'తెలుగులో ఇంప్రోవ్ కామెడీ షో.. ఆగస్టు 24.. శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా' అంటూ ప్రకటన..
తెలుగులో ఇదే మొదటి షో కావడంతో ఎక్కువగా జనం రారేమో అనుకొని బంజారాహిల్స్‌లోని నృత్యహాల్‌ను ఎంచుకొని, 30మంది వరకే టికెట్లు అమ్మకానికి పెట్టారు నిర్వాహకులు.
'ఈ ప్రకటన ఏదో కొత్తగా ఉందే.. ఏంటో చూద్దాం' అంటూ తెలిసినవాళ్లు, హాస్యంపై పరిజ్ఞానం ఉన్నవాళ్లు టికెట్లు బుక్ చేసుకున్నారు.
షో ఇంకా ప్రారంభమే కాలేదు.. నిర్ణీత సమయానికి 60మందికిపైగా వచ్చారు. వచ్చినవారిని కాదనలేక ప్రత్యేకంగా కుర్చీలు తెప్పించారు నిర్వాహకులు.
సమయం సాయంత్రం 7గంటలు.. షో స్టార్ట్ అయింది. స్టేజ్ కర్టెన్ తీయగానే.. హాల్‌మొత్తం నిండిన ప్రేక్షకులను చూసి అవాక్కయ్యారు హాస్యావధానులు. ఇక ఫస్ట్ సీట్లలో కూర్చున్న అనుకోని అతిథి ప్రముఖ దర్శకుడు విజయేంద్రప్రసాద్‌ను చూసి మరోషాక్. కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేసే విజయేంద్రప్రసాద్.. చిరునవ్వుతో వారిని ప్రోత్సహించడంతో రెట్టించిన ఉత్సాహంతో షో ప్రారంభించారు. ఇంప్రోవ్ కామెడీలో భాగంగా సభికులు ఇచ్చిన ఆసక్తికర సన్నివేశాలకు.. సందర్భోచితంగా కామెడీ పండిస్తూ.. షో ఆసాంతం ప్రేక్షకుల ముఖాల్లో నవ్వులు పువ్వులు పూయించారు. హాస్యప్రియుడైన విజయేంద్రప్రసాద్ కూడా మనస్ఫూర్తిగా నవ్వుకొని.. తెలుగులో మొదటిసారిగా ఇంప్రోవ్ కామెడీ చేసిన జయశ్రీ బృందాన్ని మనసారా దీవించారు.

**అసలేంటీ ఇంప్రోవ్ కామెడీ?**

ఇదొక కొత్త నవ్వుల లోకం. ఈ విధానంలో ముందుగా స్క్రిప్ట్ రాసుకోవడం ఉండదు. స్క్రిప్ట్‌కు అనుగుణంగా నటించడం ఉండదు. సభకు హాజరైనవారు ఏదైనా ఒక టాపిక్ ఇస్తే.. అప్పటికప్పుడు ఆ టాపిక్‌కు అనుగుణంగా క్యారెక్టర్లు డిసైడ్ చేసుకుంటారు నటులు. ఆ క్యారెక్టర్లలోకి పరకాయ ప్రవేశం చేసి, సందర్భోచితంగా నవ్విస్తుంటారు. ఉదాహరణకు.. 'కూలర్' ఒక టాపిక్ అనుకుంటే.. భర్త, భార్య, అత్తమామలు, పిల్లలు క్యారెక్టర్లు ఎంచుకుంటారు. ఆ కూలర్‌లో నీళ్లు ఎవరు పోయాలి, ఎవరు క్లీన్ చేయాలి.. ఎవరు కొన్నారు.. దాని వెనుకపడిన కష్టనష్టాలు ఏంటి.. డబ్బులెంత ఖర్చు అయ్యాయి? అనే అంశాలతో ఫ్రెష్‌గా కామెడీ పండించడం. ఇందులో 'Yes, And' అనేది నిబంధన. ఈ ఇంప్రోవ్‌లోనే ఒకే వేదికపై నాలుగు టాపిక్‌లు నడిచే విధానం ఉంటుంది. దానినే 'ఫోర్ స్క్వేర్స్ గేమ్' అంటారు. సభికులు ఇచ్చిన నాలుగు టాపిక్‌లతో వరసగా ఒకే వేదికపై హాస్యం పండిస్తారు. ఇలా ఒక్కో టాపిక్‌కు 3 నుంచి 5 నిమిషాల టైమ్ ఉంటుంది. ఒక్కోసారి ప్రేక్షకుల స్పందననుబట్టి సమయం పొడిగిస్తారు. అష్టావధానంలో పృచ్ఛకులు అడిగిన ప్రతి ప్రశ్నకు సమాధానం చెప్పినట్లే.. ఇందులో ప్రేక్షకులు ఇచ్చిన ప్రతి టాపిక్‌కు అనుగుణంగా క్షణాల్లోనే ఓ సీన్ క్రియేట్ చేసి, అప్పటికప్పుడు నవ్వించాలి.

**సామాజికాంశాలే అస్త్రంగా..**

తెలుగు మొదటి స్టాండప్ కమెడియన్ రాజశేఖర్ మామిడన్న ఈ ఇంప్రోవ్ కామెడీని తొలిసారిగా హైదరాబాద్‌కు పరిచయం చేశారు. అప్పటి నుంచి హిందీ, ఇంగ్లిష్‌లోనే ఇంప్రోవ్ కామెడీ షోలు జరుగుతున్నాయి. మామిడన్న దగ్గర శిష్యరికం చేసిన జయశ్రీ.. తెలుగులో 'ఇంప్రోవ్'ను ప్రవేశపెట్టాలని ప్రయోగం చేసింది. ఇందుకోసం ఫ్రెండ్ జై సోలంకితో కలిసి 'ఇంప్రోవ్ కామెడీ హైదరాబాద్ (ఐసీహెచ్)' పేరుతో ఓ టీమ్‌ను ఏర్పాటు చేసుకున్నది. తర్వాత బెంగళూరులో నిర్వహించిన వర్క్‌షాపులకు హాజరై.. మరింత మెరుగైన తర్వాత గత ఆగస్టు 24న మొట్టమొదటి తెలుగు ఇంప్రోవ్ షోను విజయవంతంగా నిర్వహించింది. ఈ కొత్త హాస్య విధానంలో కూడా సామాజికాంశాలను అస్త్రంగా చేసుకొని తనకంటూ ప్రత్యేకత చాటుకున్నది జయశ్రీ. ప్లాస్టిక్ భూతం, గృహహింస, ట్రాఫిక్, నేరాలు, జంతువధ, యానిమల్స్ కేర్ టేకింగ్, సైబర్ క్రైమ్స్, పిల్లలపై అఘాయిత్యాలు వంటి వివిధ అంశాలను కొత్తగా ప్రేక్షకులకు చెబుతూ అవగాహన కల్పిస్తున్నది. ఈ కొత్త హాస్యాన్ని మరింత మందికి చేరువ చేయడానికి ఉచితంగా ఇంప్రోవ్ కామెడీకి తరగతులు నిర్వహిస్తున్నది.

**కత్తిమీద సాము..!**

ముందుగా స్క్రిప్ట్ అంటూ తయారు చేసుకోకపోవడం ఇంప్రోవ్ ప్రత్యేకత. అందుకే ఈ తరహా కామెడీ కత్తిమీద సాములాంటిది. ఎందుకంటే ప్రేక్షకులు ఎలాంటి టాపిక్స్ ఇస్తారో తెలియదు. కాబట్టి సమాజంలో జరిగే ప్రతీ అంశంపై అవగాహన ఉండాలి. పాత విషయాలు గుర్తుకు తెచ్చుకోవాలి. కొత్త విషయాలపై కసరత్తు చేయాలి. ఈ ట్రెండ్‌కు తగ్గట్లుగా కొత్తగా ఎలా కామెడీ పండించాలో తెలుసుకోవాలి. ఒక్కమాటలలో చెప్పాలంటే కాలంతోపాటు పరుగెత్తాలి. అలాగని ఎవరినీ కించపరిచేలా మాట్లాడకూడదు. సభకు వచ్చిన ప్రేక్షకులు మనస్ఫూర్తిగా నవ్వుకొని వెళ్లడం వీరి ముఖ్య ఉద్దేశం. ఎక్కువగా ఇంటి వాతావరణం ప్రతిబింబించేలా అత్తా కోడళ్లు, భార్యాభర్తలకు సంబంధించిన జోకులే అడుగుతుంటారు ప్రేక్షకులు. పాత జోకులు చెప్పకుండా కొత్తవాటిపై కసరత్తు చేస్తేనే మరోసారి ప్రేక్షకుడు షోకు వస్తాడు. పాతవే రిపీట్ చేస్తే ప్రేక్షకులను సంపాదించుకోవడం చాలా కష్టం. ఇలాంటి చాలెంజింగ్ కామెడీని తెలుగులో పరిచయం చేసింది జయశ్రీ.




**నవ్వించడమే వీరి పని..**

హైదరాబాద్‌కు చెందిన జయశ్రీకి చిన్నప్పటి నుంచి నలుగురిని నవ్వించడమంటే చాలా ఇష్టం. ఎదుటివారిని ఏడిపించడం కన్నా.. నవ్వించడం చాలా కష్టం అంటున్నది. ఉర్దూ, ఇంగ్లిష్ బాగా మాట్లాడుతుంది. యాక్టింగ్ వైపు కూడా ఆసక్తి ఉన్నది. ఈమెకు నాటికలు వేయడం చాలా ఇష్టం. 'ఐడ్రీం' మీడియాలో 'దీనెమ్మ జీవితం' అనే వెబ్ సిరీస్‌లో, ఈటీవీ ప్లస్‌లో కొన్ని షార్ట్‌ఫిల్మ్స్‌లో నటించింది. ఆ తర్వాత నటనకు స్వస్తి చెప్పి స్టాండప్ కామెడీవైపు అడుగులు వేసింది జయశ్రీ. ఓపెన్ మైక్స్ అనే విధానం ద్వారా ప్రేక్షకుల నవ్వులనాడిని తెలుసుకొని అనవసరమైన పదాలను తొలగించుకునే ప్రయత్నం చేసింది. 2017లో నిర్వహించిన స్టాండప్ కామెడీ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి 'క్వీన్ ఆఫ్ కామెడీ' బహుమతి సాధించింది. ఆకాశవాణి రెయిన్‌బో ఎఫ్‌ఎంలో ఆర్జేగా చేస్తున్న జయశ్రీ ప్రతిభను గుర్తించి.. అన్ని ప్రైవేట్ ఎఫ్‌ఎం చానెల్స్ ఇంటర్వ్యూ చేశాయి. ఈ బృందంలో మరో సభ్యురాలు ప్రణవి. ఆమెదీ హైదరాబాదే. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. హాస్యంపై ఇష్టంతో స్టాండప్ కమెడియన్‌గా మారింది. ఆ తరువాతే ఈ ఐసీహెచ్ బృందంలో చేరింది. అలాగే కేరళకు చెందిన అధిర కూడా సాఫ్ట్‌వేర్ ఉద్యోగినే. హైదరాబాద్‌లోనే పని చేస్తున్నది. అమెరికన్ టీవీషోలు కూడా చేస్తోంది. హైదరాబాద్‌కు చెందిన జై సోలంకి కూడా జీఎస్టీ ప్రాక్టీషనర్. వీరితో పాటుగా అబిద్, వీణా నాయర్, నిహార్‌గౌడ్, శ్రీనివాస్ ఆర్యన్, బాబూరి వెంకటేశ్వర్లు, సంఘమేశ్వర్ వంటివారు వివిధ రంగాల్లో ఉద్యోగాలు చేస్తూ ఐసీహెచ్ ద్వారా ప్రేక్షకులను నవ్విస్తున్నారు. బెంగళూరుకు చెందిన కేవీఎం కిషోర్ వీరిని ప్రోత్సహిస్తున్నారు. ఈ టీమ్ సభ్యులంతా ఉన్నత విద్యావంతులే. అయిదంకెల జీతం అందుకుంటున్నవారే. వీరందరి అభిరుచి హాస్యం. అదే వీరిని కలిపింది. హాస్యంతోపాటు సామాజిక సేవ ఓ భాగం. వీరంతా మొదట్లో స్టాండప్ కామెడీ చేసేవాళ్లు. ఇప్పుడు ఇంప్రోవ్ చేస్తున్నారు. బాధల్లో ఉన్నవారికి హాస్యాన్ని పంచగలిగితే వాళ్లు సంతోషించడమే కాదు... జీవితాంతం మనల్ని గుర్తు పెట్టుకుంటారు. అదే వీళ్లు చేస్తున్నారు. ఎప్పుడైనా ఇంప్రోవ్ కామెడీ షో జరిగితే మీరు మిస్సవకండి.

.. డప్పు రవి

## టెక్నాలెడ్జీ

### సూపర్ ఫీచర్లతో శాంసంగ్ గెలాక్సీ ఏ91

పండగ వాతావరణంలో సాంసంగ్ నుంచి గెలాక్సీ ఏ91 ఫోన్ ఆకట్టుకుంటున్నది. సూపర్ ఫీచర్లతో ఇది వినియోగదారుల దృష్టిని ఆకర్షిస్తున్నది.




**ఫీచర్లు**

| | |
|---|---|
| డిస్‌ప్లే : | 6.70 అంగుళాలు, గొరిల్లాగ్లాస్ |
| ప్రాసెసర్ : | ఆక్టాకోర్-క్వాల్కమ్ స్నాప్‌డ్రాగన్ |
| ఓఎస్ : | ఆండ్రాయిడ్ 10 |
| ర్యామ్ : | 8 జీబీ |
| స్టోరేజీ : | 128 జీబీ |
| రియర్ కెమెరా: | 48+8+5 ఎంపీ ట్రిపుల్ కెమెరా |
| సెల్ఫీ : | 32 మెగాపిక్సెల్ |
| బ్యాటరీ : | 4500 ఎంఏహెచ్ |

### పెట్స్‌ను కూడా తీసుకెళ్లండి!



ప్రముఖ రైడ్ షేరింగ్ యాప్ ఉబెర్‌లో కొత్త రైడ్ ఆప్షన్ రాబోతున్నది. Uber Pet పేరుతో రైడ్ ఫీచర్ త్వరలో రిలీజ్ కానుంది. ఇక నుంచి ట్రావెల్ చేసే సమయంలో పెంపుడు జంతువులను కూడా ఉబెర్ అనుమతించనుంది. దీంతో ప్యాసింజర్లు తమ వెంట పెంపుడు జంతువులను కూడా తీసుకెళ్లవచ్చు. ప్రస్తుతం ఉబెర్ పెట్ రైడ్ ఫీచర్‌పై టెస్టింగ్ చేస్తున్నది. ఈ ఫీచర్ ద్వారా ముందుగానే ఉబెర్ డ్రైవర్లకు ప్యాసింజర్ల వెంట పెట్స్ ఉన్నట్టు సూచిస్తుంది. ఆస్టిన్, డెన్వర్, నాష్ విల్లే, మిన్నెపోలిస్ సేయింట్, ఫిల్లాడెల్ఫియా, ఫోనెక్స్, యూనైటెడ్ స్టేట్స్‌లో ఈ పెట్ రైడింగ్ ఫీచర్ టెస్టింగ్ చేయనుంది. ఈ రీజియన్లలోని ఉబెర్ యూజర్లకు Uber Pet ఆప్షన్ అందుబాటులోకి రానుంది. అయితే.. కొత్త రైడ్ ఆప్షన్ మాత్రం ఉచితం కాదు. కొద్ది మొత్తంలో ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. పెట్ రైడ్ ధర రూ.210 నుంచి రూ.350 వరకు వసూలు చేయనుంది. యూజర్ రైడ్ కంప్లీట్ కాగానే పెట్‌రైడ్‌తో కలిపి మొత్తం ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. టెస్టింగ్ చేసిన అన్ని ప్రాంతాల్లోని వినియోగదారుల ఫీడ్‌బ్యాక్‌ను బట్టి అన్ని దేశాల్లో ఈ విధానం తీసుకురానున్నారు.

### బగ్ కనిపెట్టు.. బహుమతి పట్టు




ఏ పుట్టలో ఏ పాముందో ఎవరికి తెలుసు అన్నట్టు ఏ యాప్‌లో ఎలాంటి బగ్ ఉందో ఎవరు కనిపెట్టగలరు.. ఇలాంటి బగ్‌లతోనే హ్యాకర్ల యాప్‌ల ద్వారా యూజర్ డేటాను హ్యాక్ చేస్తారు. ఎప్పుడైనా ఓ కంపెనీ కొత్త యాప్‌ను లాంచ్ చేసేటప్పుడు దాన్ని పూర్తిగా టెస్టింగ్ చేసి విడుదల చేస్తుంది. కానీ కొన్నిసార్లు వారికి తెలియకుండానే బగ్స్ రహస్యంగా యాప్‌లోకి వస్తాయి. అలాంటి బగ్‌లను కనిపెట్టి కంపెనీకి చెప్తే భారీ నజరానా మీ సొంతం అవుతుంది. సరిగ్గా ఇలాగే సోషల్ మీడియా దిగ్గజం ఫేస్‌బుక్ హ్యాకర్ల కోసం అదిరిపోయే ఆఫర్‌ను ప్రకటించింది. 'బగ్ బౌంటీ ప్రోగ్రామ్' పేరుతో ఈ స్పెషల్ కాంటెస్టును ప్రకటించింది. థర్డ్ పార్టీ యాప్స్‌లో భద్రతాపరమైన లోపాలను గుర్తించాలని బౌంటీ పోటీదారులందరికీ కండిషన్ పెట్టింది ఫేస్‌బుక్. రియల్ టైంలోనే యాప్స్ టెస్టింగ్ చేసి అందులోని లోపాలను గుర్తించాలంటూ సవాల్ విసిరింది. ఇలా బగ్స్ కనిపెట్టిన వారికి రూ.35 లక్షల క్యాష్ ప్రైజ్ కూడా పొందవచ్చని అంటున్నది. ఇదే కాకుండా స్థానిక యాప్స్‌లోని సెక్యూరిటీ థ్రెట్స్‌ను గుర్తించినవారికి వెయ్యి డాలర్ల నుంచి 15వేల డాలర్ల వరకు బోనస్ ఇస్తామని ఫేస్‌బుక్ ప్రకటించింది.

# కొత్తగొంతుక 'యూత్ స్పీక్ ఫోరం'

ఏం చేయాలో తెలియదు. ఎలా చేయాలో తెలియదు. కొన్ని కొత్త ఆలోచనలున్నాయి. వాటిని ఆచరణలోకి తేవడమెలాగో తెలియదు. ఇలాంటి వారందరికీ 'యూత్ స్పీక్ ఫోరం' అండగా నిలుస్తున్నది. మార్గదర్శిగా మారుతున్నది.

ప్రతి యేటా యువతకు ఉపయోగపడే సలహాలిస్తూ 'యూత్ స్పీక్ ఫోరం' అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నది. హైదరాబాద్‌లోని బిట్స్ పిలాని క్యాంపస్‌లో 'ది యూత్ స్పీక్ ఫోరం' ఓ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఇందులో యువతను వివిధ రంగాల్లో ప్రోత్సహించేలా సమావేశం నిర్వహించింది. లీడర్‌షిప్ క్వాలిటీస్, మోటివేషన్ క్లాసెస్ నిర్వహించింది. యువతకు ఉపాధి మార్గాలు, నూతన ఆవిష్కరణలపై ఇందులో చర్చ జరిగింది. ఐటీ సెక్రటరీ జయేశ్ రంజన్, క్రియేట్ యు ఫౌండర్ కృష్ణ చైతన్యరెడ్డి, లోటస్ చాక్లెట్స్ కో ఫౌండర్ అశ్విని యువతకు మార్గదర్శనం చేశారు.




# అమ్మాయిలు ఎవరిని ఇష్టపడుతారు?

**అమ్మాయిలు ఎలాంటి వారిని జీవిత భాగస్వామిగా కోరుకుంటారు? ఎలాంటి మనస్తత్వం ఉన్నవారిని ఇష్టపడుతారు? ఎలాంటి వారికి ఎక్కువ అట్రాక్ట్ అవుతారు? ఇలా పలు అంశాలపై ఇటీవల ఓ సర్వే జరిగింది. ఆ సంస్థ అమ్మాయిల మనసుల్ని ఆవిష్కరించే ప్రయత్నం చేసింది.**

అమెరికాకు చెందిన పీపుల్స్ మ్యాగజైన్ ఇటీవల ఓ ఆన్‌లైన్ సర్వే నిర్వహించింది. ప్రపంచవ్యాప్తంగా దాదాపు వంద దేశాలకు చెందిన యువతులు, మహిళలు ఈ సర్వేలో పాల్గొన్నారు. ఈ సర్వేలో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చాయి. 17 నుంచి 40 ఏళ్లలోపు ఆడవారు ఈ సర్వేలో పాల్గొన్నారు. మగవారిలో ఏ విషయాలను చూసి మీరు ఎక్కువగా ఇష్టపడతారు. అంటూ వారిని ప్రశ్నించిన సమయంలో అందం అనే సమాధానాన్ని చాలా తక్కువ మంది చెప్పారట. ఎక్కువశాతం ఆడవారు మగవారిలోని సెన్సాఫ్ హ్యూమర్, మాట్లాడే చతురతను బట్టి ఇష్టపడుతున్నారట. ఉదాహరణకు ఒక వ్యక్తికి ఎంత తెలివి ఉన్నా, అందంగా ఉన్నా.. ఎంత సంపాదిస్తున్నా మగువలు ఇష్టపడట్లేదట. మంచి మాటకారితనం, ఎంటర్‌టైన్ చేసే వ్యక్తిత్వం ఉన్నవారినే యువతులు ఇష్టపడతారని సర్వేలో వెల్లడైంది. అమ్మాయిల దృష్టిలో పడాలంటే కేవలం అందంగా ఉంటే సరిపోదని, మొహంపై ఎప్పుడూ నవ్వు ఉండాలని సర్వేలో వెల్లడైంది. చలాకీగా ఉంటూ నవ్విస్తూ ఉండేవారిని అమ్మాయిలు ఎక్కువగా ఇష్టపడతారట.



## నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం —

### ఇండియన్ ఆయిల్‌లో

**ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్)లో నాన్ ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**




- **పోస్టు:** జూనియర్ ఇంజినీరింగ్ అసిస్టెంట్-IV (ప్రొడక్షన్)
- **మొత్తం ఖాళీల సంఖ్య:** 38
- **అర్హతలు:** కెమికల్/రిఫైనరీ&పెట్రోకెమికల్ ఇంజినీరింగ్‌లో మూడేండ్ల డిప్లొమా లేదా బీఎస్సీ (ఎంపీసీ/ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ)లో కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- **అనుభవం:** కనీసం ఏడాది పోస్ట్ క్వాలిఫికేషన్ అనుభవం ఉండాలి.
- **వయస్సు:** అక్టోబర్ 30 నాటికి 18- 26 ఏండ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 30
- **వెబ్‌సైట్:** www.iocl.com

### ఐఐఎస్సీలో పీహెచ్‌డీ




**బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ (ఐఐఎస్సీ)లో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం ప్రకటన విడుదలైంది.**



- మిడ్ ఇయర్ అడ్మిషన్స్ -2019
- **ప్రోగ్రామ్:** రిసెర్చ్ (పీహెచ్‌డీ), పీహెచ్‌డీ- ఎక్స్‌టర్నల్ రిజిస్ట్రేషన్ ప్రోగ్రామ్ (ఈఆర్‌పీ)
- **డిపార్ట్‌మెంట్స్:** ఏరోస్పేస్ ఇంజినీరింగ్, కెమికల్ ఇంజినీరింగ్, సీఎస్ అండ్ ఆటోమేషన్, కంప్యూటేషనల్ డాటా సైన్సెస్, ఈసీఈ, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఈఎస్ఈ, మెటీరియల్స్ ఇంజినీరింగ్, మెటీరియల్స్ రిసెర్చ్, మెకానికల్ ఇంజినీరింగ్, నానోసైన్స్ అండ్ ఇంజినీరింగ్, ఫిజిక్స్, ప్రొడక్ట్ డిజైన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ తదితరాలు ఉన్నాయి.
- **అర్హతలు:** బీఈ/బీటెక్ లేదా ఎంఈ/ఎంటెక్ లేదా ఎంబీబీఎస్/ఎండీ లేదా బీఫార్మా లేదా బీఎస్సీతోపాటు వ్యాలిడ్ గేట్ స్కోర్/నెట్ జేఆర్‌ఎఫ్ లేదా జీప్యాట్‌లో వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.
- **నోట్:** 2017/2018, 2019 గేట్ ఎగ్జామ్‌లలో వ్యాలిడ్ స్కోర్ ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 31
- **ఇంటర్వ్యూ తేదీలు:** నవంబర్ 18, 19
- **సెషన్ ప్రారంభం:** 2020, జనవరి 1 నుంచి
- **వెబ్‌సైట్:** http://admissions.iisc.ac.in

### ఆర్టీజియన్ ట్రెయినీలు

**సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (సీసీఐ)లో కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టు:** ఆర్టీజియన్ ట్రెయినీ
- **విభాగాలవారీగా ఖాళీలు:** సివిల్-4, ఎలక్ట్రీషియన్-9, ఇన్‌స్ట్రుమెంటేషన్-6, వెల్డర్-13, ఫిట్టర్-13, ఎంటీవో (మెషిన్ టూల్)-5, మైనింగ్-1, ప్రొడక్షన్-9 ఖాళీలు ఉన్నాయి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 25
- **వెబ్‌సైట్:** www.cciltd.in

### తిరుపతి ఐఐటీలో

**తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ)లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

- **పోస్టులు:** ప్రొఫెసర్-3, అసోసియేట్ ప్రొఫెసర్/అసిస్టెంట్ ప్రొఫెసర్ (గ్రేడ్ 1, 2)-5 ఖాళీలు ఉన్నాయి.
- **విభాగాలు:** సివిల్&ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీరింగ్, హ్యుమానిటీస్&సోషల్ సైన్సెస్, కెమికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్.
- **అర్హతలు:** ప్రథమశ్రేణిలో పీహెచ్‌డీతోపాటు సంబంధిత సబ్జెక్టుల్లో/బ్రాంచీల్లో డిగ్రీ/పీజీతోపాటు మంచి అకడమిక్ రికార్డు కలిగి ఉండాలి.




- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 31
- **వెబ్‌సైట్:** http://facapp.iittp.ac.in



# ‘విధి లైంగికదాడిలాంటిది’

- ప్రతిఘటించలేనప్పుడు.. ఆస్వాదించాలి
- కేరళ కాంగ్రెస్ ఎంపీ భార్య వివాదాస్పద వ్యాఖ్యలు

**తిరువనంతపురం:** ‘విధి లైంగికదాడిలాంటిది’ అంటూ కేరళలోని ఎర్నాకులం కాంగ్రెస్ ఎంపీ హిబి ఈడెన్ భార్య అన్నా లిండా ఈడెన్ ఫేస్‌బుక్‌లో చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. లైంగికదాడులను విధితో పోల్చడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ‘విధి లైంగికదాడిలాంటిది. ఒకవేళ దాన్ని నువ్వు ప్రతిఘటించకపోతే.. అప్పుడు ఆస్వాదించేందుకు ప్రయత్నించు’ అని పేర్కొంటూ.. అన్నాలిండా ఫేస్‌బుక్‌లో రెండు వీడియోలను సోమవారం షేర్ చేశారు. ఇందులో భారీ వర్షాలకు సోమవారం కొచ్చిలోని ఇంటి చుట్టూ వరదనీరు చేరడంతో తమ కూతురును రబ్బరుబోటులో తరలిస్తున్న దృశ్యం ఒకటికాగా, తన భర్త హిబి ఈడెన్ ఆహారం తింటున్న దృశ్యం రెండోది. ఆ వీడియోలకు ఆమె పెట్టిన క్యాప్షన్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. దీనిపై అన్నా లిండా మంగళవారం స్పందించారు. లైంగికదాడులను కీర్తించాలన్నది తన ఉద్దేశం కాదని స్పష్టంచేశారు. ‘ఓ ప్రజాప్రతినిధి భార్యగా.. నేను ఎల్లప్పుడూ ప్రజల బాధలను అర్థం చేసుకొనేందుకు ప్రయత్నిస్తాను. అపార్థం అనిపించే వ్యాఖ్యలు చేసినందుకు తీవ్రంగా చింతిస్తున్నాను. మహిళలను అగౌరవపరచాలన్నది నా ఉద్దేశం కాదు’ అంటూ ఫేస్‌బుక్‌లో పోస్ట్‌చేశారు. సోమవారం చేసిన పోస్ట్‌లను తొలగించారు.

# టికెట్లు అమ్ముకున్న నేతలకు శాస్తి

- బూట్ల దండలు, గాడిదపై ఊరేగింపు
- రాజస్థాన్‌లో బీఎస్పీ నాయకులపై కార్యకర్తల తిరుగుబాటు

**జైపూర్, అక్టోబర్ 22:** అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టికెట్లను అమ్ముకున్నారన్న కోపంతో.. రాజస్థాన్‌కు చెందిన బీఎస్పీ కార్యకర్తలు తమ పార్టీకి చెందిన ఇద్దరు నాయకులకు బూట్లతో చేసిన దండలు వేసి, ముఖానికి ముసుగులు కప్పి పార్టీ కార్యాలయం బయట ప్రదక్షిణలు చేయించారు. అంతేకాదు.. వీరిలో ఒకరిని గాడిదపై కూర్చొబెట్టి మరీ ఊరేగించారు. ఈ ఘటన మంగళవారం జైపూర్‌లోని బని పార్క్ వద్ద చోటుచేసుకుంది. రాష్ట్రంలో 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా టికెట్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని, పార్టీ జాతీయ కో ఆర్డినేటర్ రాంజీ గౌతమ్, బీఎస్పీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సీతారాం టికెట్లను అమ్ముకున్నారని ఆరోపిస్తూ కార్యకర్తలు ఈ చర్యకు పాల్పడ్డారు. వేరే పార్టీల నుంచి వచ్చిన వారికి టికెట్లు అమ్ముకున్నారని, పార్టీ కోసం ఏండ్ల నుంచి కష్టపడి పనిచేసిన వారిని పట్టించుకోలేదని కార్యకర్తలు తెలిపారు. రాంజీ గౌతమ్, సీతారాంలకు బూట్ల దండలు వేసి ఊరేగించామని, రాంజీ గౌతమ్‌ను గాడిదపై కూర్చొబెట్టి ఊరేగించామని పేర్కొన్నారు. మరోవైపు ఈ ఘటన వెలుగుచూసిన వెంటనే రాజస్థాన్ బీఎస్పీ రాష్ట్ర కమిటీని మాయావతి రద్దు చేశారు.






కెనడా ఫలితాల అనంతరం మాట్లాడుతున్న జస్టిన్ ట్రూడో.



కెనడా ఫలితాల అనంతరం భార్యతో కలిసి ప్రజలకు అభివాదం చేస్తున్న జగ్మీత్‌సింగ్

# కెనడాలో మనోడు కింగ్ మేకర్

- 24 స్థానాలు సాధించి కీలకంగా నిలిచిన జగ్మీత్‌సింగ్ పార్టీ ఎన్డీపీ
- మెజారిటీ దగ్గరగా ఆగిపోయిన అధికార లిబరల్ పార్టీ
- ఎన్డీపీ మద్దతు కోసం ప్రయత్నాలు.. సానుకూలంగా స్పందించిన జగ్మీత్
- 121 స్థానాలకే పరిమితమైన ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ

**ఒట్టావా, అక్టోబర్ 22:**

కెనడా పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. ఈ ఎన్నికల్లో ప్రస్తుత ప్రధాని జస్టిన్ ట్రూడో నేతృత్వంలోని లిబరల్ పార్టీకి 157 స్థానాలు లభించగా, ప్రతిపక్ష కన్జర్వేటివ్ పార్టీ 121 స్థానాలకు పరిమితమైంది. కెనడాలో 338 పార్లమెంట్ స్థానాలకు సోమవారం ఓటింగ్ జరిగింది. 170 సీట్ల మెజారిటీ సాధించిన పార్టీ అధికారంలోకి వస్తుంది. అయితే, ఈ ఎన్నికల్లో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాలేదు. దీంతో ప్రధాన పార్టీలు ఇతర పార్టీల మద్దతు కోసం వెంపర్లాడుతున్నాయి. కెనడాలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే పార్టీకి ప్రవాస భారతీయ సంతతికి చెందిన జగ్మీత్ సింగ్ నేతృత్వంలోని న్యూడెమోక్రటిక్ పార్టీ(ఎన్డీపీ) ఇచ్చే మద్దతు కీలకంగా మారనున్నదని విశ్లేషకులు చెబుతున్నారు. ఎన్డీపీకి ఈ ఎన్నికల్లో 24 స్థానాలు లభించాయి. బ్లాక్ క్యూబెకాయిస్ పార్టీకి 32 సీట్లు, గ్రీన్ పార్టీకి మూడు.. మరొక స్థానం స్వతంత్ర్య అభ్యర్థికి దక్కింది. బ్లాక్ క్యూబెకాయిస్ పార్టీ, గ్రీన్ పార్టీలు అధికార పార్టీకి మద్దతిచ్చేందుకు సిద్ధంగా లేకపోవడంతో లిబరల్ పార్టీకి ఎన్డీపీ మద్దతు అనివార్యమైంది. 2015 ఎన్నికల్లో థామస్ మూల్కెయిర్ నేతృత్వంలోని అప్పటి ఎన్డీపీ 44 స్థానాల్లో గెలిచి లిబరల్ పార్టీకి మద్దతునిచ్చింది. ‘లిబరల్ పార్టీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావాలంటే జగ్మీత్ సింగ్ నేతృత్వంలోని న్యూడెమోక్రటిక్ పార్టీ మద్దతు అనివార్యం. మైనార్టీ పార్లమెంటును గెట్టెక్కించేందుకు ఎన్డీపీ ‘కింగ్ మేకర్’ పాత్ర పోషించనున్నది’ అని టొరంటో స్టార్ న్యూస్ పేపర్ పేర్కొంది. కాగా, గత ఎన్నికలతో పోలిస్తే, ఈ సారి సీట్ల సంఖ్య తగ్గినప్పటికీ.. కెనడా ప్రజల కోసం కష్టపడి పనిచేస్తామని జగ్మీత్ సింగ్ తెలిపారు. నూతన పార్లమెంటులో ఎన్డీపీ నిర్మాణాత్మక పాత్ర పోషిస్తుందని అన్నారు. జస్టిన్ ట్రూడోతో తాను మాట్లాడానని, ఆయన సాధించిన విజయానికి అభినందనలు తెలియజేశానని చెప్పారు. ‘ఈ ఎన్నికల్లో ఏ నాయకుడో, పార్టీనో విజయం సాధించలేదు. కెనడా ప్రజలు గెలిచారు. ప్రజల కోసం పనిచేసే ప్రభుత్వాన్ని వాళ్లు ఎన్నుకున్నారు’ అని జగ్మీత్ సింగ్ ఓ ట్వీట్‌లో పేర్కొన్నారు. 2015లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో లిబరల్ పార్టీకి 184 పార్లమెంట్ స్థానాలు దక్కాయి. వీటిలో 19 స్థానాలను భారత-కెనడియన్ ప్రజలు(ముఖ్యంగా పంజాబీలు) ఎక్కువగా నివసించే స్థానాల నుంచే గెలిచారు. దీంతో, ఏకంగా నలుగురు పంజాబీలకు జస్టిన్ ట్రూడో మంత్రి పదవుల్ని కట్టబెట్టారు. 2006 నుంచి కన్జర్వేటివ్ పార్టీ ప్రతిపక్ష హోదాలో కొనసాగుతున్నది.

# ఆ కేసులన్నీ బదిలీ చేయండి

- ఆధార్‌తో సోషల్ మీడియా ఖాతాల అనుసంధానంపై విచారణ జరుపుతాం
- 2020 జనవరిలో సీజేఐ ముందుంచాలని రిజిస్ట్రీకి సూచించిన సుప్రీంకోర్టు
- మార్గదర్శకాల జారీ కోసం కేంద్రానికి మూడు నెలల గడువు






**న్యూఢిల్లీ, అక్టోబర్ 22:** సోషల్ మీడియా ఖాతాలతో ఆధార్ అనుసంధానానికి సంబంధించి పలు హైకోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను తమకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది. వీటిపై తామే విచారణ జరుపుతామన్న ద్విసభ్య ధర్మాసనం, బెంచ్ కేటాయింపు కోసం వచ్చే ఏడాది జనవరి చివరి వారంలో వాటన్నింటిని సీజేఐ ముందుంచాలని రిజిస్ట్రీకి సూచించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు దీపక్ గుప్తా, అనిరుద్ధ్ బోస్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఫేస్‌బుక్ పిటిషన్ బదిలీకి అనుమతిస్తూ ఈ మేరకు నిర్ణయించింది. సామాజిక మాధ్యమాల దుర్వినియోగం, తప్పుడు వార్తల ప్రచారాన్ని అరికట్టేందుకు ఫేస్‌బుక్ ప్రొఫైల్స్‌తో ఆధార్ నెంబర్ అనుసంధానానికి సంబంధించి మద్రాసు హైకోర్టులో రెండు, బాంబే, మధ్యప్రదేశ్ హైకోర్టుల్లో ఒకటి చొప్పున పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే ప్రొఫైల్స్‌తో ఆధార్ నెంబర్ అనుసంధానం వల్ల దేశంలో తమ సామాజిక మాధ్యమం వినియోగంపై ప్రభావం చూపుతుందని ఫేస్‌బుక్ ఆందోళన వ్యక్తం చేసింది. వీటిపై సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్లు ఒకే అంశానికి సంబంధించినవి కావడంతో వాటి విచారణపై స్టే విధించి అన్నింటినీ సుప్రీంకోర్టుకు బదిలీ చేసి విచారణ జరుపాలని విన్నవించింది. అయితే హైకోర్టుల్లోని పిటిషన్ల విచారణపై స్టేకు నిరాకరించిన ధర్మాసనం, తుది తీర్పును మాత్రం వెలువరించవద్దని ఇటీవల ఆదేశించింది. మంగళవారం ఈ కేసు విచారణ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం తరుపున హాజరైన అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్, కేసుల బదిలీకి సంబంధించిన ఫేస్‌బుక్ పిటిషన్‌ను వ్యతిరేకించలేదు. కేంద్ర ప్రభుత్వం తరుపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన వాదనలు వినిపించారు. ఆధార్ అనుసంధాన విధానం అన్నది వ్యక్తిగత గోప్యతను హరించేదికాదన్నారు. వ్యక్తిగత గోప్యతపై ఉగ్రవాదికి ఎలాంటి హక్కు ఉండదన్నారు. ఆధార్ అనుసంధానంతో ప్రజల వ్యక్తిగత గోప్యతను ప్రభుత్వం హరిస్తుందన్న కొందరి పిటిషనర్ల వాదనలో ఎలాంటి పస లేదన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంటర్‌మీడియేటర్స్ గైడ్‌లైన్స్ 2018 నిబంధనల సవరణలకు మూడు నెలల సమయం పడుతుందని కేంద్ర సమాచార మంత్రిత్వశాఖ అఫిడవిట్‌ను కోర్టుకు సమర్పించారు. దీన్ని నమోదు చేసుకున్న ధర్మాసనం కేంద్రానికి ఆ మేరకు గడువు ఇచ్చింది. సాంకేతికత ప్రమాదకారిగా మారిందని ఇటీవల ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీంకోర్టు, సామాజిక మాధ్యమాల దుర్వినియోగాన్ని నియంత్రించేందుకు, సందేశాలను మార్పు చేసే మధ్యవర్తులను బాధ్యులుగా చేసే నిబంధనలపై 2020జనవరిలోగా తమకు సమగ్ర నివేదిక ఇవ్వాలని కేంద్రాన్ని ఆదేశించింది.

# చిదంబరానికి బెయిల్

- ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో మంజూరు చేసిన సుప్రీంకోర్టు
- ఈడీ కస్టడీలోనే ఉన్న కేంద్ర మాజీ మంత్రి



**న్యూఢిల్లీ, అక్టోబర్ 22:** కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి పీ చిదంబరానికి ఎట్టకేలకు బెయిల్ లభించింది. దాదాపు రెండు నెలలుగా దర్యాప్తు సంస్థల కస్టడీలో, జైలులో ఉన్న చిదంబరానికి సుప్రీంకోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. అయినప్పటికీ ఆయన ఇంకా విడుదల కాలేదు. సీబీఐ దాఖలు చేసిన ఐఎన్ఎస్ మీడియా అవినీతి కేసులో చిదంబరానికి బెయిల్ లభించినప్పటికీ అదే కేసుతో సంబంధం ఉన్న మరో హవాలా కేసులో ప్రస్తుతం ఆయన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీలో ఉన్నారు. చిదంబరాన్ని ఢిల్లీలోని జోర్‌బాగ్‌లో గల ఆయన నివాసం నుండి గత ఆగస్టు 21న సీబీఐ అరెస్టు చేసింది. సీబీఐ కస్టడీ ముగిసిన తర్వాత ఆయనను తీహార్ జైలుకు తరలించారు. ఈ నెల 18న ఢిల్లీ కోర్టు ఆయనను గురువారం వరకు ఈడీ కస్టడీకి అప్పగించింది. చిదంబరానికి బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించిన ఢిల్లీ హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. ‘ఆయన విమానంలో పారిపోయేవాడు కాదు.. లేదా విచారణకు గైర్హాజరయ్యే అవకాశం లేదు’ అని ముగ్గురు సభ్యుల ధర్మాసనం వ్యాఖ్యానించింది. తమ తీర్పు ఇతర కేసులకు వర్తించదని స్పష్టం చేసింది. సాక్షులను చిదంబరం ప్రభావితం చేసే అవకాశముందన్న సీబీఐ వాదనను జస్టిస్ భానుమతి నేతృత్వంలోని ధర్మాసనం తోసిపుచ్చింది. సీబీఐ వాదనకు తగిన సాక్ష్యాధారాలు లేవని తెలిపింది. లక్ష రూపాయల పూచీకత్తు, ఇద్దరి జామీనుపై చిదంబరాన్ని విడుదల చేయాలని కోర్టు ఆదేశించింది. చిదంబరం తన పాస్‌పోర్టును ప్రత్యేక కోర్టులో డిపాజిట్ చేయాలని, కోర్టు అనుమతి లేకుండా విదేశాలకు వెళ్లరాదని, ప్రత్యేక జడ్జి జారీ చేసే ఆదేశాలకు కట్టుబడి ఉండాలని ధర్మాసనం స్పష్టం చేసింది. సీబీఐ ఎప్పుడు కోరినా విచారణకు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపింది.

## ఏపీకి సాయం చేయండి

- కేంద్రమంత్రి అమిత్‌షాకు సీఎం జగన్ విజ్ఞప్తి

**అమరావతి:** ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఢిల్లీ పర్యటనలో భాగంగా మంగళవారం రెండోరోజు కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ అయ్యారు. ఏపీకి ప్రత్యేకహోదా ఇవ్వాలని కోరారు. రెవెన్యూలోటు కింద రావాల్సిన నిధులు, పోలవరం అంచనాలకు ఆమోదం, విభజన చట్టంలోని హామీలు, వెనుకబడ్డ జిల్లాలకు నిధులు, నాగార్జునసాగర్, శ్రీశైలానికి గోదావరి వరదజలాల తరలింపు తదితర అంశాలపై చర్చించారు. ఏపీలో పారిశ్రామిక అభివృద్ధి కోసం రాష్ట్ర పునర్ విభజన చట్టం ద్వారా కడపలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని కోరారు. ప్రకాశం జిల్లా రామాయపట్నంలో పోర్టు నిర్మాణ అంశాన్ని ప్రస్తావించారు. ఏపీలో వెనుకబడ్డ 7 జిల్లాలకు ఇప్పటివరకు రూ. 2100 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, రూ.1050 కోట్లు మాత్రమే ఇచ్చారని.. మిగిలిన మొత్తాన్ని వెంటనే విడుదలచేయాలని విజ్ఞప్తిచేశారు. జగన్ వెంట ఎంపీ విజయసాయిరెడ్డి, ఇతర ఎంపీలు ఉన్నారు.

## చెక్‌పోస్ట్‌పై తాలిబన్ల దాడి 15 మంది మృతి

**కాబూల్, అక్టోబర్ 22:** అఫ్ఘనిస్థాన్‌లో తాలిబన్లు మరోమారు హింసకు పాల్పడ్డారు. సోమవారం రాత్రి కుందుజ్ రాష్ట్రం అలిఅబాద్ జిల్లా పరిధిలోని చెక్‌పోస్ట్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 15 మంది పోలీసులు మృతి చెందారని కుందుజ్ ప్రొవిజనల్ కౌన్సిల్ సభ్యుడు గులాం రబానీ రబానీ మంగళవారం చెప్పారు. దాడి సందర్భంగా తాలిబన్లకు, పోలీసులకు కొన్ని గంటల పాటు కాల్పులు జరిగాయి. చెక్‌పోస్ట్‌పై తామే దాడి చేశామని తాలిబన్ అధికార ప్రతినిధి జబీహుల్లా ముజాహిద్ ప్రకటించుకున్నారు.



విశ్వ హిందూ పరిషత్‌కు చెందిన అఖిల భారత సంపర్క్ ప్రముఖ్ శ్రీరాజ్ బిహార్‌తోపాటు పలువురు ప్రతినిధులు గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్‌ను సోమవారం రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

-రాజ్‌భవన్, నమస్తే తెలంగాణ



వరంగల్ రూరల్ జిల్లా సంగెం మండలం కాపుల కనపర్తి గ్రామాభివృద్ధి కోసం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు చెక్కులను అందజేస్తున్న అన్నమనేని రవీందర్‌రావు, రాజేశ్వరరావు

## గ్రామాల అభివృద్ధికి దాతలు సహకరించాలి

- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గ్రామాల అభివృద్ధికి దాతలు సహకరించాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కోరారు. 30 రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా వరంగల్ రూరల్ జిల్లా సంగెం మండలం కాపుల కనపర్తి అభివృద్ధి కోసం ఆ గ్రామానికి చెందిన అన్నమనేని దేవేందర్‌రావు రూ.లక్ష, అన్నమనేని రవీందర్‌రావు రూ.50 వేలు, అన్నమనేని రాజేశ్వర్‌రావు రూ.50 వేలు విరాళంగా ప్రకటించారు. ఈ మొత్తానికి సంబంధించిన చెక్కులను వారు బుధవారం హైదరాబాద్‌లో మంత్రి ఎర్రబెల్లికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ ఎర్రబెల్లి గోపాల్‌రావు, ఎంపీటీసీ సుతారి బాలకృష్ణ పాల్గొన్నారు.

## వీఐటీ వర్సిటీలో ముగిసిన జాతీయ సదస్సు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అమరావతిలోని వీఐటీ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ ఆధ్వర్యంలో రెండురోజులపాటు నిర్వహించిన జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ‘కంప్యూటర్ ఆధారిత వ్యవస్థల్లో ప్రగతి, ప్రక్రియలు, అప్లికేషన్’ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో 5 కీ నోట్లు, 23 పరిశోధనా పత్రాలను ఎంపికచేశారు. వీటిలో కొన్ని టేలర్ ఫ్రాన్సిస్ ప్రొసీడింగ్‌లో, మిగతావాటిని స్కోపస్ జర్నల్‌లో ప్రచురిస్తారని నిర్వాహకులు తెలిపారు. సదస్సులో అనంతపురం జేఎన్టీయూ వీసీ డాక్టర్ ఎస్ శ్రీనివాస్‌కుమార్, భువనేశ్వర్ ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ గణపతి పాండా, కాంచీపురం ఐఐఐటీడీఎం ప్రొఫెసర్ డాక్టర్ బన్షీధర్ మాఝీ, వీఐటీ వీసీ డాక్టర్ డి శుభాకర్, మాజీ వీసీ డాక్టర్ డీపీ కొఠారీ, నాగార్జున వర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ హరిసీత, డాక్టర్ అనుపమ, డాక్టర్ సౌభాగ్యశంకర్, ఫ్యాకల్టీ, పరిశోధన విద్యార్థులు పాల్గొన్నారు.



డీజీపీ మహేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, సభ్యులు రాంబల్‌నాయక్, దేవయ్య, నీలాదేవి, సీహెచ్ నర్సింహ, విద్యాసాగర్

# సివిల్ రైట్స్ డేకు హాజరుకండి

- డీజీపీని కోరిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఈ నెల 30న నిర్వహించే సివిల్స్ రైట్స్‌డేలో పాల్గొనాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్.. డీజీపీ మహేందర్‌రెడ్డిని ఆహ్వానించారు. మంగళవారం ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు డీజీపీని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రతినెల 30వ తేదీన సివిల్ రైట్స్‌డేను ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో నిరంతరాయంగా నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా వారు తెలిపారు. అనంతరం డీజీపీ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఏర్పడిన తర్వాత చేపడుతున్న కార్యక్రమాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నానని తెలిపారు. డీజీపీని కలిసిన వారిలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు ఎం రాంబల్‌నాయక్, ఎస్ దేవయ్య, నీలాదేవి, సీహెచ్ నర్సింహ, విద్యాసాగర్ ఉన్నారు.

# చెప్పేదొకటి.. చేసేదొకటి!

- కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించవద్దంటూనే కాల్పులకు తెగబడిన పాక్
- ఎల్వోసీ వద్ద జవాన్ మృతి

**న్యూఢిల్లీ, అక్టోబర్ 22:** పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్వోసీ) ప్రాంతాన్ని పాత్రికేయులు సందర్శిస్తున్నారని, కనుక కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించవద్దని పాకిస్థాన్ ఆర్మీ భారత సైన్యాన్ని కోరింది. ఇటీవల భారత సైనికదళం పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని ఉగ్రవాద స్థావరాలపై శతఘ్నులతో దాడులు నిర్వహించిన నేపథ్యంలో పాకిస్థాన్ ఈ విజ్ఞప్తి చేసింది. ఈ విజ్ఞప్తిని భారత సైన్యం గౌరవించినప్పటికీ మళ్లీ పాకిస్థానే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం గమనార్హం. పూంచ్ జిల్లాలోని బాలాకోట్, మెంధార్ సెక్టార్లలో మంగళవారం పాక్ సైన్యం ఎటువంటి కవ్వింపులు లేకుండానే కాల్పులకు తెగబడటంతో ఒక జవాన్ మరణించాడు. ఇద్దరు పౌరులు గాయపడ్డారు. ఈ కాల్పుల వల్ల ఎల్వోసీ సమీపంలోని పాఠశాలల్లో చిన్నారులు చిక్కుకుపోయారు. భారత సైన్యం ఆదివారం శతఘ్నులతో దాడులు దాడులు జరిపి తాంగ్ధర్, కీరన్ సెక్టార్లకు ఆవలి వైపున ఉన్న నాలుగు ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే. ఈ దాడుల్లో దాదాపు ఏడుగురు ఉగ్రవాదులు, కొంతమంది పాక్ సైనికులు హతమయ్యారు. అయితే ఈ దాడుల వల్ల ఎలాంటి నష్టం వాటిల్లలేదని, జనావాస ప్రాంతాలు మాత్రమే ధ్వంసమయ్యాయని బుకాయించిన పాక్.. ఆయా ప్రాంతాలను చూపేందుకు ఇస్లామాబాద్‌లోని విదేశీ దౌత్యాధికారులను, మీడియాను నీలం లోయకు తీసుకెళ్లింది. ఈ పర్యటన కోసం భారత్‌ను కూడా ఆహ్వానించినప్పటికీ.. ఆ దేశం తమ ప్రతినిధులను పంపలేదని తెలిపింది. కాగా, విదేశీ దౌత్యాధికారులు, మీడియా ఎల్వోసీ ప్రాంతంలో పర్యటిస్తుండగానే పాక్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పీవోకేలోని ముజఫరాబాద్‌లో నిరసనలు భగ్గుమన్నాయి. భద్రతా సిబ్బందితో స్థానిక ప్రజలు ఘర్షణకు దిగడంతోపాటు స్వాతంత్ర్యం కోసం పెద్దపెట్టున నినాదాలు చేశారు.

## అంగన్‌వాడీల్లో నమోదు పెరిగింది

**పెద్దకొత్తపల్లి:** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం, గర్భిణులు, బాలింతలకు తీసుకుంటున్న చర్యలతో అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల నమోదు పెరిగిందని ఐసీడీఎస్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ అనురాధ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని ఒకటో అంగన్‌వాడీ, కొల్లాపూర్ మండల పరిధిలోని సోమశిల గ్రామంలో 1వ అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులు, బాలింతలు, గర్భిణీలకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం, గుడ్లు సక్రమంగా అందించని అంగన్‌వాడీ టీచర్లపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఇళ్లపై విద్యుత్‌లైన్లుంటే తొలగించాలి

- ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు



**వరంగల్ సబర్బన్, నమస్తే తెలంగాణ, అక్టోబర్ 22:** నివాస గృహాల పైనుంచి వెళ్లే విద్యుత్ లైన్లను గుర్తించి వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎన్పీడీసీఎల్ సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం వరంగల్‌లోని తన కార్యాలయంలో విద్యుత్ అధికారులు, ఉద్యోగులతో సమీక్ష సమావేశాన్ని కంపెనీ డైరెక్టర్లు నర్సింగరావు, సంధ్యా రాణి, మోహన్ రెడ్డిలతో కలిసి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గోపాల్‌రావు మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసి ఉంచుకోవాలని సూచించారు.వీలైనంత త్వరగా వర్క్ ఆర్డర్లను పూర్తి చేయాలని అన్నారు. మెటీరియల్‌కు సంబంధించిన లెక్కలు పక్కాగా నిర్వహించాలని చెప్పారు. స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని చెప్పారు. ప్రతీ వినియోగదారుని సర్వీస్‌ను మ్యాపింగ్ చేసి ఉంచాలని ఆయన కోరారు.. రూ.20 వేలకు పైబడి విద్యుత్ బకాయిలు ఉన్న వారి జాబితాను రూపొందించాలని సూచించారు. విద్యుత్ చౌర్యానికి పాల్పడే వారిపై కేసులను నమోదు చేయాలని ఆదేశించారు.

## వానలొస్తుంటే బాబు కండ్లలో నిప్పులు

- ఎంపీ విజయసాయిరెడ్డి ఫైర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

వర్షాలు కురిసి నదులు పొంగిపొర్లుతుంటే చంద్రబాబు.. కండ్లలో నిప్పులు పోసుకుంటున్నాడని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి విమర్శించారు. కార్యకర్తలు, నేతలతో సమావేశాల్లో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై మంగళవారం ట్విట్టర్‌లో ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. బాబుకు ఎప్పుడూ నదులు ఎండిపోయి, ఇసుక తిన్నెలు తేలి కనిపించాలని, ఆ ఇసుకను దోచుకొని పదివేల మంది కోటీశ్వరులయ్యారని, జలాశయాలన్నీ నిండితే తట్టుకోలేకపోతున్నాడని అన్నారు. బాబు ఇచ్చిన రుణమాఫీ హామీని ఎందుకు అమలుచేయడంలేదంటూ వైసీపీ ప్రభుత్వాన్ని దబాయిస్తున్నాడని విమర్శించారు. ‘అవునా కాదా తమ్ముళ్లూ..’ అంటూ ఆయన దీనాలాపనలు చేస్తున్నాడని, తాను ఎంత ఆవేశపడుతున్నా తమాషా చూస్తున్నట్టు ఏ స్పందన లేకుండా కూర్చున్నారంటూ కార్యకర్తల వైపు అనుమానంగా చూస్తున్నాడని ఎద్దేవాచేశారు. పోలవరం, అమరావతి, పీపీఏలపై అవే పాచి మాటలు మాట్లాడుతున్న ఆయన మాటల్లో వణుకు కనిపిస్తున్నదన్నారు. మీడియా ముందైనా, సమీక్షా సమావేశాల్లోనైనా ‘40 ఇయర్స్ ఇండస్ట్రీ, 14 ఏండ్ల సీఎం, పదేండ్ల ప్రతిపక్ష నేత’ ఈ మూడు పదాల్లేకుండా మాట్లాడటంలేదని, ఇలాంటివి ఇంకెవరైనా చెబితే బాగుంటుందిగానీ ఆయనకు ఆయనే చెప్పుకొంటే ఎలా? అని ఎంపీ ప్రశ్నించారు.



మంగళ వారం తెల్లవారుజామున హైదరాబాద్ నగర శివారు రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని ఖానాపూర్ గ్రామం పొగమంచు కమ్ముకొని ఊటీని తలపించేలా దర్శనమిచ్చింది. ఉదయం 8.30 గంటలకు ఈ అద్భుత వాతావరణాన్ని తిలకించిన స్థానికులు ఉల్లాసంగా గడిపారు.

- మణికొండ, నమస్తే తెలంగాణ


ప్రభాస్

# హృదయాల్ని ఏలే జాన్

ప్రభాస్ విగ్రహంలోనే కాదు వ్యక్తిత్వంలోనూ ఉన్నతంగా కనిపిస్తారు. ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలనే నానుడి ఆయన నడవడికలో ప్రతిఫలిస్తుంది. అందుకే అభిమానుల్ని ఆయన్ని డార్లింగ్ అంటూ ఆప్యాయంగా పిలుచుకుంటారు. 'బాహుబలి' సిరీస్ సినిమాలతో దేశవ్యాప్తంగా తిరుగులేని ప్రాచుర్యం సంపాదించుకున్నారు ప్రభాస్. ఆ విజయం ఆయనకు ఓ అలంకారంగా భాసిల్లింది తప్ప ఇసుమంత అహంకారాన్ని తెచ్చిపెట్టలేదు. నేడు ప్రభాస్ జన్మదినం. ప్రస్తుతం ఆయన గోపీకృష్ణ మూవీస్, యూవీ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఓ చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి 'జాన్' అనే పేరు ప్రచారంలో ఉంది. కేకే రాధాకృష్ణ దర్శకుడు. పూజాహెగ్డే కథానాయిక. త్వరలో హైదరాబాద్‌లో తాజా షెడ్యూల్‌కు ప్లాన్ చేశారు. దీనికోసం భారీ సెట్‌ను తీర్చిదిద్దుతున్నారు. ఈ షెడ్యూల్‌లో ప్రభాస్‌తో పాటు ముఖ్యతారాగణమంతా పాల్గొంటారని చిత్ర బృందం వెల్లడించింది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మనోజ్‌పరమహంస, ఎడిటర్: శ్రీకర్‌ప్రసాద్, సంగీతం: అమిత్‌త్రివేది, సమర్పణ: గోపీకృష్ణమూవీస్ కృష్ణంరాజు. దర్శకత్వం: కేకే రాధాకృష్ణకుమార్.

# మూడేళ్లు బాలీవుడ్‌కు దూరమయ్యా

తొలి సినిమా 'మొహంజదారో' తర్వాత బాలీవుడ్‌లో అగ్రకథానాయకులతో సినిమాలు చేసే అవకాశాలు వచ్చాయని అంటోంది పూజాహెగ్డే. నటిగా తనకో గౌరవాన్ని తీసుకొచ్చే సినిమా చేయాలనే ఆలోచనతో ఇన్నాళ్లు నిరీక్షించానని చెబుతున్నది. దాదాపు మూడేళ్ల విరామం తర్వాత 'హౌస్‌ఫుల్-4' సినిమా ద్వారా బాలీవుడ్‌లో రీఎంట్రీ ఇవ్వబోతున్నది పూజాహెగ్డే. తన బాలీవుడ్ ప్రయాణాన్ని గురించి పూజా హెగ్డే వెల్లడిస్తూ 'ఎలాంటి సినీ నేపథ్యం, ఇండస్ట్రీలో గాడ్‌ఫాదర్ లేనివారికి తొలి సినిమా వారిలోని ప్రతిభా సంపత్తులను ప్రపంచానికి తెలియజేసే ఆడిషన్ టేప్‌గా ఉపయోగపడుతుంది. 'మొహంజదారో' నా కెరీర్‌కు అలాగే ఉపకరించింది. ఆ సినిమా పరాజయం పాలైనా బాలీవుడ్‌లో చక్కటి అవకాశాలు నన్ను వెతుక్కుంటూ వచ్చాయి. నటిగా నేనేమిటో నిరూపించుకున్న తర్వాతే మళ్లీ హిందీలో సినిమా చేయాలని నిశ్చయించుకున్నాను. ఆ ఆలోచనతో హిందీలో మూడేళ్లు సినిమాల్ని ఒప్పుకోలేదు. ఈ సమయంలో తెలుగులో నేను నటించిన సినిమాలన్నీ విజయవంతమయ్యాయి. అగ్రకథానాయికగా నన్ను నిలబెట్టాయి. 'హౌస్‌ఫుల్-4' కథ నా మనసును ఆకట్టుకోవడంతో పునరాగమనానికి ఇదే సరైన సినిమా అనిపించి అంగీకరించాను. గ్లామర్‌కు పరిమితం కాకుండా నటిగా నాలోని భిన్న పార్శ్వాల్ని ఆవిష్కరించడానికి ఈ సినిమా దోహదపడింది. ఈ చిత్రం కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకున్నాను. అలాగే మా నాన్న కోసం చేసిన సినిమా ఇది. లాయర్‌గా పనిచేసే తనకు కామెడీ సినిమాలంటే చాలా ఇష్టం' అని తెలిపింది. ప్రస్తుతం పూజాహెగ్డే 'అల వైకుంఠపురములో' కథానాయికగా నటిస్తున్నది. ప్రభాస్‌తో ఓ ప్రేమకథా చిత్రంలో నటిస్తున్నది.


పూజాహెగ్డే


శ్రీనివాస్‌రెడ్డి, అలీ, సుబ్బారెడ్డి, శ్రీనివాస్

# నారాయణతే నమో నమో

'సినిమాలోని వెంకటేశ్వర స్వామి కీర్తనను నాతో విడుదల చేయించడం ఆనందంగా ఉంది. చక్కటి విజువల్స్‌తో ఈ పాటను చిత్రీకరించారు' అని అన్నారు తితిదే బోర్డ్ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి. సత్యదేవ్, ఇషారెబ్బ, శ్రీరామ్, ముస్కాన్‌సేథీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'రాగల 24 గంటల్లో'. శ్రీనివాస్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీనివాస్ కానూరు నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలోని 'నారాయణతే నమో నమో..' లిరికల్ వీడియోను సోమవారం హైదరాబాద్‌లో వై.వి.సుబ్బారెడ్డి విడుదలచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 'శ్రీనివాసరెడ్డితో ఇరవై ఏళ్లుగా నా స్నేహం కొనసాగుతున్నది. ఆయన దర్శకత్వం వహించిన ఈ సినిమా పెద్ద విజయాన్ని సాధించాలి. శతదినోత్సవాన్ని జరుపుకోవాలి' అని తెలిపారు. దర్శకుడు శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ 'దివంగత నేత వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెన్నుముకగా ఉంటూ ఎన్నో సేవలందిస్తున్నారు సుబ్బారెడ్డి. ఆయన మా సినిమాలోని పాటను విడుదలచేయడం ఆనందంగా ఉంది. యస్వీబీసీ బోర్డ్ డైరెక్టర్‌గా నాకు అప్పగించిన పదవీబాధ్యతల్ని నిజాయితీగా నిర్వర్తిస్తూ మంచి పేరు తెచ్చుకుంటాను' అని అన్నారు. రామానాయుడు, దిల్‌రాజు స్ఫూర్తితో తాను నిర్మాతగా మారానని, త్వరలో ఈ సినిమాను విడుదల చేయనున్నామని శ్రీనివాస్ కానూరు పేర్కొన్నారు. మేము ఊహించిన దానికంటే ప్రేక్షకులు ఈ సినిమాకు పెద్ద విజయాన్ని అందిస్తారనే నమ్మకముందని హాస్యనటుడు కృష్ణభగవాన్ అన్నారు.

# నిన్ను కలిసిన తర్వాతే..

తమిళ దర్శకుడు విఘ్నేష్‌శివన్, అగ్రనాయిక నయనతార మధ్య ప్రేమ వ్యవహారం అందరికి తెలిసిందే. విఘ్నేష్‌శివన్ దర్శకత్వం వహించిన 'నానుమ్ రౌడీదాన్' చిత్రీకరణ సమయంలో వీరిద్దరి మధ్య ప్రేమచిగురించింది. 2015 అక్టోబర్ 21న ఈ సినిమా విడుదలైంది. సోమవారంతో నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విఘ్నేష్‌శివన్ సోషల్‌మీడియాలో ఓ భావోద్వేగభరితమైన పోస్ట్ చేశారు. నయనతారతో దిగిన ఓ ఫొటోను పంచుకున్న ఆయన 'నిన్ను కలిసిన తర్వాతే నా జీవితం మధురంగా మారింది. 'నానుమ్ రౌడీదాన్' చిత్రం ద్వారా నాకు మంచి జీవితాన్ని అందించావు. నవ్వు ప్రతిరోజు సంతోషంగా, అందంగా ఉండాలని కోరుకుంటున్నా' అని విఘ్నేష్ పేర్కొన్నారు. ప్రస్తుతం నయనతార ప్రధాన పాత్రలో 'నెట్రికన్' అనే తమిళ సినిమాను నిర్మిస్తున్నారు విఘ్నేష్‌శివన్. ఇటీవలే ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభమైంది. సస్పెన్స్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రానికి మిలింద్‌రావ్ దర్శకత్వం వహిస్తున్నారు.


విఘ్నేశ్‌శివన్, నయనతార

# థాంక్యూ.. నయన్!

భాషా భేదాలతో సంబంధం లేకుండా మన కథానాయికల మధ్య చక్కటి అనుబంధాలు వెల్లివిరిస్తున్నాయి. అవసరమైన సందర్భాల్లో ఒకరికొకరు స్నేహహస్తాన్ని అందించుకుంటూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. తాజాగా దక్షిణాది లేడీ సూపర్‌స్టార్ నయనతార..బాలీవుడ్ కథానాయిక కత్రినా కైఫ్ నెలకొల్పిన ఓ సౌందర్య ఉత్పత్తుల వ్యాపార ప్రచార కార్యక్రమంలో భాగమయ్యారు. ఇందుకు సంబంధించిన చిన్న వీడియోను కత్రినాకైఫ్ సోషల్‌మీడియా ద్వారా పంచుకుంటూ నయనతారకు కృతజ్ఞతలు తెలిపింది. 'తీరికలేని షూటింగ్‌లతో ఉండి కూడా నా బ్రాండ్ ప్రమోషన్స్‌లో భాగంగా ముంబయికు వచ్చి యాడ్ చిత్రీకరణలో పాల్గొన్న దక్షిణాది అందాలతార నయనతారకు ప్రత్యేక ధన్యవాదాలు' అని కత్రినాకైఫ్ పేర్కొంది. ఇటీవలే ఆమె 'కే బై కత్రినా' పేరుతో బ్యూటీ ప్రొడక్ట్స్ వ్యాపారంలోకి అరంగేట్రం చేసింది. దీనికి సంబంధించిన ప్రమోషనల్ వీడియోలో పలువురు బాలీవుడ్ ప్రముఖులు మెరిశారు. దక్షిణాది నుంచి నయనతార షూట్‌లో పాల్గొంది. ఇటీవలే విడుదలైన 'సైరా' చిత్రంలో సిద్ధమ్మ పాత్రలో నయనతార ప్రేక్షకుల్ని మెప్పించింది. ప్రస్తుతం ఆమె విజయ్ కథానాయకుడిగా నటిస్తున్న 'బిగిల్'తో పాటు రజనీకాంత్ 'దర్బార్' చిత్రంలో నటిస్తున్నది.


కత్రినాకైఫ్

# పోలీస్ భావనరెడ్డి

గ్లామర్ తళుకులతో గత చిత్రాల్లో ఆకట్టుకున్న అదాశర్మ తాజాగా యాక్షన్ బాట పట్టింది. పోలీస్ అధికారిణిగా తన శక్తియుక్తులను నిరూపించడానికి సిద్ధమైంది. అదాశర్మ కథానాయికగా నటిస్తున్న బాలీవుడ్ చిత్రం 'కమాండో-3'. యాక్షన్ థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో అదాశర్మ ఫస్ట్‌లుక్‌ను మంగళవారం చిత్రబృందం విడుదలచేసింది. ఇందులో టోర్న్ జీన్స్ ధరించి చేతిలో తుపాకి పట్టుకొని పరుగులు తీస్తూ కనిపిస్తున్నది అదాశర్మ. భావనరెడ్డి అనే పోలీస్ అధికారిగా ఆమె కనిపించబోతున్నది. ఓ మిషన్ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో అదాశర్మ పాత్ర శక్తివంతంగా ఉంటుందని చిత్రబృందం చెబుతున్నది. ఆమెపై తెరకెక్కించిన యాక్షన్ సీక్వెన్స్ అలరిస్తాయని తెలిపారు. ఈ పోరాట ఘట్టాల కోసం అదాశర్మ ప్రత్యేకంగా శిక్షణ తీసుకున్నట్లు చెబుతున్నారు. 'కమాండో-2'తో పోలిస్తే నటిగా తనను కొత్త పంథాలో ఆవిష్కరించే చిత్రమిదని అదాశర్మ చెప్పింది. విద్యుత్ జమ్వాల్ ఈ సినిమాలో హీరోగా నటిస్తున్నారు. అదిత్య దత్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం నవంబర్ నెలాఖరున ప్రేక్షకుల ముందుకురానుంది.


అదాశర్మ

# ఒక్క సినిమా చాలు..

గత కొంతకాలంగా గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటున్నది రెజీనా. ప్రయోగాలకు ప్రాముఖ్యత నిస్తూ సినిమాలు చేస్తున్నది. తెలుగులో రూపొందిన 'అ!', 'ఎవరు' చిత్రాల్లో ప్రతినాయిక ఛాయలున్న పాత్రల్లో విలక్షణ అభినయాన్ని ప్రదర్శించి ప్రశంసల్ని అందుకున్నది. ప్రస్తుతం సినిమాల ఎంపికలో తన ఆలోచన విధానం పూర్తిగా మారిందని, ఎన్ని సినిమాలు చేస్తున్నాననే దానికంటే ఎలాంటి పాత్రల్లో నటిస్తున్నానన్నదే తనకు ముఖ్యమని చెబుతున్నది. రెజీనా మాట్లాడుతూ 'కెరీర్ తొలినాళ్లలో ఏడాదికి నాలుగైదు సినిమాలు చేసినప్పుడే చిత్రసీమలో నిలదొక్కుకుంటామనే అభిప్రాయం ఉండేది. లేదంటే ప్రేక్షకులు నన్ను మర్చిపోతారని అనుకునే దాన్ని. విరామం తీసుకుంటే అవకాశాలు రావేమోనని కథలు నచ్చకపోయినా చాలా సినిమాలు చేశాను. ఇప్పుడా భయాలన్నీ తొలగిపోయాయి. ఏడాదికి ఒకటైనా నా మనసుకు నచ్చిన సినిమా చేస్తే చాలనుకుంటున్నాను. పారితోషికం, పేరుప్రఖ్యాతుల కంటే ఆ పాత్ర నుంచి కొత్తగా ఏం నేర్చుకున్నాను, నటిగా నాలో ఎంతవరకు పరిణితికి ఉపయోగపడిందో చూసుకుంటున్నాను. ఆ సంతృప్తి నాకు ఎక్కువ ఆనందాన్నిస్తున్నది' అని తెలిపింది.


రెజీనా

